
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ


epaper.vaartha.com WWW.VAARTHA.COM
తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
హైదరాబాద్ : fb.com/vaartha Digital
Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
15-5-2025 గురువారం సంపుటి: 31 సంచిక: 103 పేజీలు: 10+4 వెల: 6.50

యుపిలో ఆరవ సెమీ కండక్టర్ యూనిట్
జవాన్‌ను భారత్‌కు అప్పగించిన పాక్ ఆర్మీ 5

'సుప్రీం' చీఫ్ జస్టిస్‌గా
# బిఆర్ గవాయి
## ప్రమాణం చేయించిన రాష్ట్రపతి ముర్ము
### అత్యున్నత పదవిలో ఆయన ఆరు నెలలే..


బుధవారం న్యూఢిల్లీలో జస్టిస్ గవాయి చేత సుప్రీం కోర్టు సిజెగా ప్రమాణం చేయిస్తున్న రాష్ట్రపతి ముర్ము

**న్యూఢిల్లీ, మే 14:** సుప్రీం కోర్టు 52వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయి (బిఆర్ గవాయి) బుధవారం ప్రమాణస్వీకారంచేసారు. రాష్ట్రపతిభవన్‌లోజరిగిన ప్రత్యేక కార్యక్రమంలో గవాయి చేత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రమాణంచేయించారు. ప్రధానిమోడీ ఆయనకు అభినందనలు తెలిపారు. 2019 మే 24నుంచి సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఉన్న ఆయన అనేక రాజ్యాంగధర్మాసనాల్లో సభ్యుడిగా చరిత్రాత్మక తీర్పులు వెలువరించారు. సిజెఐగా ఆరునెలలు మాత్రమే కొనసాగుతారు. ఈ ఏడాది నవంబరు 23న పదవీవిరమణచేస్తారు. సిజెఐ పీఠాన్ని అధిరోహించిన రెండో దళిత వ్యక్తిగా గవాయి పేరుపొందారు. మహారాష్ట్రలోని అమ్రావతిలో 1960 నవంబరు 24న జన్మించిన >>2


డ్రోన్లను ఛేదించే
# 'భార్గవాస్త్ర'
## భారత్ అమ్ములపొదిలోకి అత్యాధునిక ఆయుధం

**న్యూఢిల్లీ, మే 14:** ఆపరేషన్ సిందూర్ సమయంలో పొరుగు దేశం పాకిస్థాన్ ఎక్కువగా డ్రోన్లతో దాడికి ప్రయత్నించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో డ్రోన్ దాడులను ఎదుర్కొనేందుకు భారత్‌కౌంటర్ డ్రోన్ సిస్టమ్ 'భార్గవాస్త్ర'ను సిద్ధం చేసింది. సోలార్ డిఫెన్స్, ఏరోస్పేస్ లిమిటెడ్ స్వదేశీ పరిజ్ఞానంతో >>2

# ఆ ప్రాజెక్టులు పేకమేడలే

అందుకే కూలిపోతున్నాయి..
నెహ్రూ కట్టిన 'సాగర్' చెక్కు చెదిరిందా!
కాళేశ్వరం మూడేళ్లలోనే ఒరిగి పోయింది
ఇంజినీర్ల పని ఇంజినీర్లే చేయాలి
ఎస్ఎల్‌బిసి సహా ప్రాజెక్టులకు అగ్ర ప్రాధాన్యం
త్వరలోనే అన్ని గ్రూప్స్ నియామకాలు పూర్తి
ఇరిగేషన్ ఇంజినీర్లకు నియామక పత్రాలు అందజేసిన సిఎం రేవంత్


బుధవారం హైదరాబాద్‌లో ఇరిగేషన్ ఇంజినీర్లకు నియామక పత్రాలు అందజేస్తున్న సిఎం రేవంత్. చిత్రంలో మంత్రులు ఉత్తమ్ కుమార్, పొన్నం ప్రభాకర్ తదితరులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే14:** గత పాలకుల తప్పిదాల వలన ప్రాజెక్టులు పేకమేడల్లా కూలుతున్నాయని, ఏ ప్రాజెక్టు ఎప్పుడు కూలుతుంతో అర్థం కాలేదని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అన్నారు. కానీ కాంగ్రెస్ హయాంలో కట్టిన ప్రాజెక్టులు ఇప్పటికీ చెక్కు చెదరడం లేదని తెలిపారు. నీళ్ల కోసం ఎంత పరితపించామో తెలుసని, తెలంగాణ ప్రజల అతి పెద్ద సెంట్‌మెంట్ నీళ్లేనని,యుద్ధ ప్రతిపాదికన ప్రాజెక్టులన్నీ పూర్తిచేసి ప్రతి ఎకరాకు నీళ్లందిస్తామని చెప్పారు.ఇరిగేషన్ విభాగంలో కొత్తగా ఎంపికైన 244 ఏఈఈ,199 జెటిఓలకు బుధవారం జలసౌధ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కొలువు పండుగ కార్యక్రమంలో ఉద్యోగనియామక పత్రాలను ఆయన అందజేశారు. అత్యంత ప్రాధాన్యమైన శాఖ నీటిపారుదల శాఖ అందుకే ఆనాడు ఇరిగేషన్ ప్రాధాన్యతగా తీసుకుని నెహ్రూ సాగునీటి ప్రాజెక్టులు కట్టారని చెప్పారు. గతంలో కట్టిన సాగునీటి ప్రాజెక్టులు శ్రీశైలం, >>2


బుధవారం రామప్పదేవాలయాన్ని సందర్శించిన 'మిస్ వరల్డ్' సుందరీమణులు

# రామప్ప 'రమణీ'యం..
## హనుమకొండలో సందడి చేసిన ప్రపంచ సుందరీమణులు

**హన్మకొండ బ్యూరో, ప్రభాతవార్త, మే 14:** వరంగల్ నగరంలో ప్రపంచ సుందరీమణులు బుధవారం తెలంగాణ సంస్కృతి ఉట్టి పడేలా కట్టు బొట్టుతో మెరిశారు. సాయంత్రం 5 గంటలకు హన్మకొండ హరిత కాకతీయకు వివిధ దేశాల ప్రపంచ సుందరి మణులు చేరుకున్నారు. ముందుగా హరిత కాకతీయ ప్రాంగణంలో స్థానిక మహిళలతో బతుకమ్మ ఆటపాట పాడుతూ సందడిచేశారు. హన్మకొండ >>2

# 70 శాతం వాటా మనదే
## కృష్ణా జలాల్లో న్యాయబద్ధమైన కేటాయింపుల కోసం ట్రిబ్యునల్ ఎదుట పట్టుబట్టాలి
### 2027 జూన్‌కు నిర్మాణంలోని ప్రాజెక్టులు పూర్తి
### కల్వకుర్తి లిఫ్ట్, నెట్టెంపాడు డిసెంబరులోగా పూర్తి
### జలసౌధలో జరిపిన సమీక్షలో సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే14:** కృష్ణా జలాల్లో తెలంగాణకు న్యాయబద్ధంగా రావాల్సిన వాటాల సాధనకు చేస్తున్న ప్రయత్నాలను మరింత ముమ్మరం చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. తెలంగాణ ప్రయోజనాలను అత్యంత ప్రాధాన్యంగా గుర్తించాలని అన్నారు. కృష్ణా నది పరివాహక ప్రాంతం సుమారు 70 శాతం తెలంగాణలో ఉంటే కేవలం 30 శాతం మాత్రమే ఏపీలో ఉన్నందున.. కృష్ణా జలాల్లో 70 శాతం వాటా తెలంగాణ రాష్ట్రానికి తెచ్చుకునేలా ట్రిబ్యునల్ ఎదుట పట్టుబట్టాలని చెప్పారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులపై బుధవారం రాత్రి ముఖ్యమంత్రి జలసౌధలో సమీక్ష సమావేశం నిర్వహించారు. గోదావరి బేసిన్ నుంచి పట్టిసీమ ద్వారా ఏపీ తీసుకుంటున్న 90 టీఎంసీలను ఎగువన వాడుకునేలా నీటి కోటా పెంచుకోవాలని చెప్పారు. ఈ అంశాలన్ని కృష్ణా బోర్డు దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు నాటికి కృష్ణా పై నిర్మాణంలో ఉన్న అన్ని ప్రాజెక్టులకు కేటాయించిన నిర్ణీత నీటి వాటాల విషయంలో ప్రభుత్వ వాదనలు సమర్థంగా ఉండాలని అప్రమత్తం చేశారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు చేపట్టేటప్పుడు జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం నీటి వాటాల అనుమతులు తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. ఇదే సమయంలో రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. రాబోయే రెండేండ్లలో.. 2027 జూన్ నాటికి రాష్ట్రంలో కృష్ణాపై అసంపూర్తిగా ఉన్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అందుకు అనుగుణంగా నిర్ణీత గడువుతోపాటు లక్ష్యాలను నిర్దేశించుకోవాలని చెప్పారు. తక్కువ ఖర్చుతో పూర్తి అయ్యే ప్రాజెక్టుల పనులను వేగంగా చేపట్టాలని సూచించారు. కృష్ణా బేసిన్‌లో ప్రాధాన్యంగా ఎంచుకున్న ప్రాజెక్టులకు నిధులకు ఇబ్బంది లేకుండా చూడాలని ఆర్థికశాఖను సీఎం ఆదేశించారు. భూసేకరణ వేగంగాపూర్తయ్యేందుకు రెవిన్యూ విభాగంతోనూ సమన్వయం చేసుకోవాలని.. స్పెషల్ ఆఫీసర్లు పనులను వేగవంతం చేయాలని చెప్పారు. సూదిని జైపాల్ రెడ్డి పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును ఉద్దండాపూర్ వరకు మొదటి ప్రాధాన్యంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఉద్దండాపూర్ వరకు పెండింగ్‌లో ఉన్న పనులు 18 నెలల్లో పూర్తి చేయాలని, అందుకు వీలుగా కార్యాచరణ ప్రణాళిక చేసుకోవాలని చెప్పారు. కోయిల్ సాగర్ లిఫ్ట్ ప్రాజెక్టును కూడా వచ్చే ఏడాది జూన్‌లోగా పూర్తి చేయాలని చెప్పారు. మహాత్మగాంధీ కల్వకుర్తి లిఫ్ట్, జవహార్ నెట్టెంపాడు లిఫ్ట్, రాజీవ్ భీమా లిఫ్ట్ ప్రాజెక్టులను ఈ ఏడాది డిసెంబర్ లోపు పూర్తి చేయాలని నిర్ణయించారు. వీటికి సంబంధించి పెండింగ్ లో ఉన్న పనులు, కావాల్సిన నిధుల వివరాలను సీఎం అడిగి తెలుసుకున్నారు. సిఎం వద్ద జరిగిన సమీక్షలో ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ >>2




జూన్ 12న రాష్ట్రానికి
# 'నైరుతి'
## మూడు రోజులు వర్ష సూచన

**హైదరాబాద్, మే 14, ప్రభాతవార్త:** ఆగ్నేయ బంగాళాఖాతంలో ఆవర్తనం ఏర్పడుతోందని, ఇందుకు రుతుపవనాలు అనుకూలంగా ఉన్నట్టు వాతావరణ కేంద్రం అంచనా వేసింది. ఇప్పటికే రుతుపవనాల ఆగమనంతో గత రెండు రోజులుగా నికోబార్ దీవుల్లో భారీ వర్షాలు పడుతున్నాయని వెల్లడించింది.దీంతో వచ్చే మూడు,నాలుగు రోజుల్లో నైరుతి రుతుపవనాలు అండమాన్ నుంచి దక్షిణ అరేబియా సముద్రం, బంగాళాఖాతం మధ్య వరకు విస్తరించే అనుకూల పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇప్పటికే నైరుతి రుతుపవనాలు మంగళవారం మధ్యాహ్నాం నాటికే దక్షిణ అండమాన్ సముద్రం,నికోబార్ దీవులు, దక్షిణ బంగాళాఖాతాన్ని తాకినట్టు వెల్లడించింది. వ్యవసాయ దేశమైన భారత్‌కి >>2


పాక్‌కు మరో షాక్
# సొంత జెండా ఎగరేసిన బలూచ్‌లు
## స్వతంత్ర గణతంత్ర దేశంగా ఏర్పడినట్లు యుఎన్, భారత్‌కు లేఖ రాసిన బలూచిస్థాన్

**క్వెట్టా, మే 14:** పాకిస్థాన్‌లో దశాబ్దాలుగా అణచివేతకు గురవుతున్న బలూచిస్తాన్ ఇపుడు స్వతంత్ర దేశంగా ప్రకటించుకుంది. ఇండోపాక్ వివాదాలు, ఉద్రిక్తతలుదాడుల క్రమంలో బలూచ్‌నేతలు భారత్‌కే మద్దతుపలికారు. భారత్ మద్దతిస్తే పాకిస్తాన్‌ను మొత్తం స్వాధీనంచేసుకుంటామని కూడా ప్రకటించారు. ఓపక్క భారత్ ఆంక్షలు కొనసాగుతున్న క్రమంలో బలూచిస్తాన్ నాయకుడు మీర్ యార్ బలోచ్ రిపబ్లిక్ ఆఫ్ బెలూచిస్తాన్‌గా ప్రకటించారు. తమకు పాకిస్తాన్‌నుంచి స్వాతంత్ర్యం వచ్చిందని అన్నారు. బలూచ్ ప్రజలహక్కులకోసం నిరంతరం పోరాడిన నాయకునిగా యార్‌బలోచ్‌కు పేరుంది. భారత ప్రభుత్వం న్యూఢిల్లీలో బలూచ్ రాయబార కార్యాలయం ఏర్పాటుకు అనుమతినివ్వాలని, అలాగే ఐక్యరాజ్యసమితి కూడా బలూచిస్తాన్‌కు శాంతిపరిరక్షక దళాలను పంపించాలని కోరారు. అంతేకాకుండా తమ ప్రాంతం నుంచి పాకిస్తానీ దళాలు వెంటనే వెళ్లిపోవాలని >>2

# విందుకు రండి.. మాట్లాడుకుందాం!
## భారత్, పాక్‌ల మధ్య సయోధ్య కోసం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కొత్త ఆఫర్



**వాషింగ్టన్, మే 14:** భారత్, పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందంలో అమెరికా కీలక పాత్ర పోషించిందని మరోసారి ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు. ఉద్రిక్తతలు తగ్గేందుకు భారత్, పాక్‌లు మంచి డిన్నర్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. రెండు దేశాల మధ్య శాంతి ప్రక్రియలో ఉపాధ్యక్షుడు జెడివాన్స్ విదేశాంగ మంత్రి మార్కో రుబియోలు భాగస్వాములయ్యారన్నారు. వారిద్దరినీ మనం ఒకేచోట చేర్చవచ్చని, మార్కో రుబియో వాళ్లకలిసి బయటకు వెళ్లి మంచి విందు చేసుకోవచ్చు. ఇది బాగుంటుంది కదా అని ట్రంప్ అన్నారు. సహచరులారా రండి ఒక ఒప్పందాన్ని >>2




# పుష్కర 'సరస్వతి'
## కాళేశ్వరంలో నేటి నుంచి ఆరంభం
### త్రివేణి సంగమంలో సిఎం రేవంత్ పుష్కరస్నానం
### పన్నెండేళ్లకోసారి 12 రోజులు జరిగే నదీ ఉత్సవాలు
### ఘాట్‌ల వద్ద పూర్తి ఏర్పాట్లు చేసిన ప్రభుత్వం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే14:జయశంకర్** భూపాల్ పల్లి జిల్లా కాళేశ్వరంలో గురువారం సరస్వతీ పుష్కరాలు ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా త్రివేణి సంగమం వద్ద సరస్వతీ ఘాట్‌ను ప్రారంభించేందుకు గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి వెడుతున్నారు. ఈ పుష్కర ఘాట్ ప్రారంభం అనంతరం, కాళేశ్వర త్రివేణీ సంగమంలో ముఖ్యమంత్రి పుణ్యస్నానం ఆచరిస్తారు. సిఎంతో పాటు పలువురు మంత్రులు కూడా ఈ పుష్కరాల్లో పాల్గొంటారు. 12 సంవత్సరాలకు ఒక సారి వచ్చే ఈ అరుదైన సరస్వతీ మహా పుష్కరాలకు రాష్ట్ర ప్రభుత్వ దేవాదాయశాఖ విస్తృత ఏర్పాట్లుచేసింది. తొగుట ఆశ్రమం పీఠాధిపతి మాధవానంద సరస్వతి స్వామీజీ సంకల్పంతో పాటు పుష్కర స్నానం చేస్తారు. ప్రతిరోజూ ఉదయం 8.30 గంటల నుంచి 11గంటల వరకు యాగాలు నిర్వహిస్తారు. ప్రతిరోజూ సరస్వతీ ఘాట్‌లో 6.45 గంటల నుంచి 7.35 గంటల వరకు సరస్వతీ ఘాట్‌లో ప్రత్యేక సరస్వతీ నవరత్న మాలహారతి నిర్వహిస్తారు. పుష్కర్ స్నానం ఆచరించే వారికి తాత్కాలిక టెంట్ సిటీలను ఏర్పాటు చేశారు. వీటితో పాటు రోజూ రాత్రి కళా, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. హైందవ సాంప్రదాయాలలో పుష్కర స్నానం ఒక అచంచలమైన గొప్ప భక్తి విశ్వాసం ఉన్నది. ప్రాణకోటి మనగడకు ఆధారమైన జలాన్ని ఆరాధించడం ఓ మోక్ష ప్రదాయమని శాస్త్రపరమైన నమ్మకం. అందుకే >>2


బుల్డోజర్ కంపెనీలతో
# మీకు ఒప్పందమా?
## రాహుల్‌ను ప్రశ్నించిన కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే14:** రేవంత్ సర్కార్‌పై మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి విరుచుకుపడ్డారు. మిస్ వరల్డ్ పోటీలో పాల్గొంటున్న వారి పర్యటనకోసం పేదల ఇళ్లు కూల్చుతున్నారంటూ మండిపడ్డారు. కాంగ్రెస్ విధానంపై ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీకి సోషల్ మీడియా ఎక్స్‌లో బుధవారం కెటిఆర్ పలు ప్రశ్నలు సంధించారు. వరంగల్‌లో కూల్చివేతలపై ఆగ్రహంవ్యక్తం చేసిన ఆయన... >>2

కొత్తగా ఎన్ని ఎకరాలకు
# నీళ్లిచ్చారు?
## ప్రభుత్వాన్ని ప్రశ్నించిన హరీష్‌రావు
2




న్యూఢిల్లీలో బుధవారం జరిగిన భారత్ 6జి 3వ అంతర్జాతీయ సదస్సును జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి డాక్టర్ చంద్ర శేఖర్ పెమ్మసాని

# సొంత జెండా ఎగరేసిన బలూచ్‌లు

>> డిమాండ్ చేసారు. ఈనెల 7వ తేదీనుంచి భారత్ చేపట్టిన ఆపరేషన్ సింధూర్ నేపథ్యంలో బలూచ్ స్వతంత్ర దేశంగా ప్రకటించుకోవడం ప్రాధాన్యతను సంతరించుకుంది. మేం మా స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకున్నామని ఆయన అన్నారు. బలూచ్ స్వాతంత్ర్య యోధులు పాకిస్తాన్‌లోని సహజ వాయుక్షేత్రాలపై దాడిచేసారని, డేరా బుగ్తి ప్రాంతంలో 100కుపైగా ఉన్న గ్యాస్ బావులపై దాడులు జరిపినట్లు తెలిపారు. ఐక్యరాజ్యసమితి మా స్వతంత్ర దేశాన్ని గుర్తించాలని మీర్ యార్‌బలోచ్ విజ్ఞప్తిచేసారు. నేటి నుంచి బలూచిస్తాన్ డెమొక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ బలోచిస్తాన్‌గా అవతరించిందని, ఐక్యరాజ్యసమితి సభ్యదేశాలన్నీ కూడా మా స్వతంత్రతను గుర్తించి మద్దతివ్వాలని కోరారు. అంతేకాకుండా కరెన్సీ, పాస్‌పోర్టు వంటి వాటిముద్రణకు అంతర్జాతీయ సంస్థలు బిలియన్ డాలర్ల కరెన్సీ సాయం చేయాలని కోరారు. ఇదిలా ఉంటే పాకిస్తాన్ మిలిటరీ సిబ్బంది వెళుతున్న వాహనంపై బలూచ్‌మిలిటెంట్లు దాడిచేసి ధ్వంసంచేసారు. ఈదాడిలో 14 మంది సైనికులుచనిపోయారు. పాకిస్తాన్‌లోని అనేక జిల్లాల్లో బిఎల్ఏ సమన్వయంతో కూడిన దాడులుచేసిందని మీర్‌యార్ బలోచ్ తెలిపారు. ఆపరేషన్ హీరో 2.0గా మొత్తం 58 ప్రాంతాల్లో 78 దాడులుచేసినట్లు ప్రకటించారు. బిఎల్ఎ ప్రతినిధి జీయాంద్ బలోచ్‌మాట్లాడుతూ పాకిస్తాన్‌ను ప్రతిఘటించేందుకు తమపై ఆధిపత్యం నిలువరించేందుకు దాడులుచేసామని, పాకిస్తాన్ ఆక్రమణనుంచి నేటికి విముక్తి లభించిందన్నారు. ఏడు దశాబ్దాలపాటు పాకిస్తాన్ తమపై అణిచివేత, ప్రముఖులను కిడ్నాప్ అదృశ్యం, హింస, చట్టాలను ఉల్లంఘించి హత్యలకు పాల్పడిందని అప్పటినుంచి బలూచ్ పోరాటంసాగిస్తూనే ఉందని అన్నారు. భారత్‌పాక్ విభజన సమయంలో ఆనాటి బ్రిటిష్ పాలకులు కలత్‌గా పిలిచే ఈప్రాంతాన్ని ఎటూ తేల్చకుండా ఆప్రాంత పాలకులకే వదిలివేసారు. దీనితో ఆనాటి పాలకుడు యార్‌ఖాన్ ఈప్రాంతం స్వయంప్రతిపత్తితో ఉండేవిధంగా కొనసాగించినా తర్వాత పాకిస్థాన్‌లో విలీనంచేసేసాడు. అప్పటినుంచి ఈ ప్రాంతం బలూచిస్తాన్‌గా వ్యాప్తిలోకి వచ్చినా దశాబ్దాలుగా అణిచివేతకు గురవుతుందని యార్ బలోచ్ అన్నారు. అంతేకాకుండా జిన్నా హౌస్‌ను బలూచిస్తాన్‌హౌస్‌గా పేరుమార్చాలని కూడా ఆయన భారత్‌కు విజ్ఞప్తిచేసారు. ఇటీవల జరిపిన దాడులకు కూడా బలూచిస్తాన్ బిఎల్ఎ తన సంఘీభావాన్ని ప్రకటించింది.

## బుల్డోజర్ కంపెనీలతో మీకు ఒప్పందమా?

>> అందాల పోటీల కోసం పేదల ఇళ్లను ధ్వంసం చేయడమే ప్రజాపాలననా అంటూ ఫైర్ అయ్యారు. వరంగల్‌లో దారి వెంట ఇళ్ల ధ్వంసంపై కేటీఆర్ మండిపడ్డారు. కూల్చివేతలకు సంబంధించిన వీడియోను ఎక్స్‌లో పోస్ట్ చేసిన కేటీఆర్.. దీనికి సంబంధించి రాహుల్ గాంధీకి పలు ప్రశ్నలు సంధించారు. తెలంగాణ ప్రభుత్వ అమానవీయ చర్యలపై రాహుల్ గాంధీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. 'హలో రాహుల్ గాంధీ.... బుల్డోజర్ కంపెనీలతో మీకేమైనా రహస్య ఒప్పందం ఉన్నదా. ప్రతిరోజూ పేదల ఇళ్లతో పాటు వారి జీవితాలపై దాడి చేయడం ఏమిటి? అందాల పోటీల కోసం పేదవారి ఇళ్లను ధ్వంసం చేయడమే ప్రజాపాలననా? రూ.200 కోట్ల ప్రజా సొమ్ము ఖర్చుపెట్టి రాజభవనాల్లో విందులు పెట్టడం ప్రజాపాలనా? అని ప్రశ్నించారు. పేద ప్రజల జీవితాలు రాక్షస బుల్డోజర్ల కింద నలిగిపోతున్నాయి. పేదల ఇళ్లపై బుల్డోజర్లు నడిపిస్తున్న సిగ్గులేని కాంగ్రెస్ ప్రభుత్వం సమాధానం చెప్పాలి అంటూ మాజీ మంత్రి కేటీఆర్ ట్వీట్ చేశారు.

## పుష్కర 'సరస్వతి'

>> జీవరాశులన్నింటికీ జలం ప్రాముఖ్యత తెలపడానికి ప్రతి సంవత్సరం ఒక్కొక్క నదికి పుష్కరం వస్తుంది. భారతదేశంలోని 12 నదుల్లోనూ గురుడు మేషం నుండి మీన రాశి వరకు పన్నెండు రాశులలో ఒక్కొక్క రాశి లోకి ప్రవేశించినప్పుడు ఆయా నదులకు పుష్కరాలు వస్తాయి. గురుడు మిధున రాశిలోకి ప్రవేశించినప్పుడు సరస్వతీ నదికి పుష్కరాలు ప్రారంభమవుతాయి. గురువారం కాళేశ్వరంలో సరస్వతి నదీ పుష్కరాలు ప్రారంభం అవుతాయి. గురువారం నుంచి మే 26 (శనివారం)వరకు సరస్వతీ నది పుష్కరాలు నిర్వహించనున్నారు. ఇప్పటికే దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, జిల్లా మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు పలుమార్లు సరస్వతీ పుష్కరాలు విజయవంతం చేసేందుకు రివ్యూ సమావేశాలు నిర్వహించారు. జిల్లా యంత్రాంగానికి స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. ఈ పుష్కరాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు ఎదుర్కొకోకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. కాళేశ్వరం యాప్, వెబ్ పోర్టల్ ను ప్రారంభించి, భక్తులు సాంకేతికంగా పొందే సేవలను సైతం అందులో పొందుపరిచారు. మాతృవంశం వారికి పిండ ప్రదానం చేయడం సరస్వతి పుష్కరయాత్ర ఫలంగా చెబుతారు. అందుకే దాన్ని మాతృగయ అని కూడా అంటారు. సరస్వతి నది అతి పురాతనమైనది. హిమాలయాల్లో పుట్టిన ఈ నది ప్రశస్తి ఋగ్వేదంలోనూ, భాగవతాధి పురాణాల్లోనూ, రామాయణ, మహాభారతంలోనూ కనిపిస్తుంది. బ్రహ్మ శిరస్సు నుండి ఉద్భవించినదిగా చెప్పుకునే ఈ సరస్వతి నది కొంతదూరం ప్రవహించి ఎడారి ప్రాంతమైన రాజస్థాన్‌లో అదృశ్యమవుతుంది. గోదావరి, ప్రాణహిత నదులలో కలిసి అంతర్వాహినిగా సరస్వతి నది ప్రవహిస్తున్నందున కాళేశ్వరం కూడా త్రివేణి సంగమంగా ప్రఖ్యాతి చెందినది. అందువలన కాళేశ్వరంలోని త్రివేణి సంగమంలో పవిత్ర సరస్వతీ పుష్కరస్థానం చేసిన వారికి సమస్త పాపములు తొలగిపోవునని శాస్త్రములు చెబుచున్నవి. మానవులు తెలిసి తెలియక పుట్టినప్పటి నుండి చేసిన పాపములు పుష్కర స్నానంతో తొలగిపోవునని విశ్వాసం కలదు. ఈ నమ్మకంతోనే ఒక్కొక్క సంవత్సరం ఒక్కోనదికి వచ్చే పుష్కరాలకు వెళ్లి పుష్కర స్నానం చేస్తే ఎంతో పుణ్యం వస్తుందని హైందవ సాంప్రదాయం. భారతీయ సనాతన సాంప్రదాయాలలో పుష్కర స్నానం ఒక గొప్ప భక్తి భావం, కాళేశ్వరంలోని త్రివేణి సంగమంలో సరస్వతి పుష్కర స్నానం చేసిన పిదప శ్రీ మహా సరస్వతి అమ్మవారిని దర్శించుట వలన చాలా పుణ్యం వస్తుందని భక్తుల నమ్మకం.

## 'సుప్రీం' చీఫ్ జస్టిస్‌గా బిఆర్ గవాయి

>> గవాయి 1985 మార్చి 16న న్యాయవాదిగా వృత్తిజీవితంప్రారంభించి అంచెలంచెలుగా ఎదిగారు. 2003 నవంబరు 14న బాంబే హైకోర్టులో అదనపు న్యాయమూర్తిగా నియమితులయిన జస్టిస్ గవాయి 2005 నవంబరు 12న శాశ్వత న్యాయమూర్తిగా పదోన్నతి పొంది ఆ హైకోర్టు ప్రధాన ధర్మాసనం ఉన్న ముంబయితోపాటు నాగ్‌పూర్, ఔరంగాబాద్; పనాజీ ధర్మాసనాల్లో సేవలందించారు. 2019 మే 24న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. గత ఆరేళ్లలో జస్టిస్ గవాయి సుమారు 700 ధర్మాసనాల్లో భాగస్వాములయ్యారు. రాజ్యాంగ, పరిపాలన, సివిల్, క్రిమినల్‌చట్టాలు వాణిజ్య వివాదాలు ఆర్బిట్రేషన్, విద్యుత్, విద్య, పర్యావరణానికి సంబంధించిన కేసులను విచారించారు.

## డ్రోన్లను ఛేదించే 'భార్గవాస్త్ర'

>> రూపొందించిన ఈ సిస్టమ్‌ను భారత్ తాజాగా విజయవంతంగా పరీక్షించింది. ఒడిశాలోని గోపాల్‌పూర్‌లో గల సీవార్డ్ ఫైరింగ్ రేంజ్ నుంచిపరీక్షించింది. మూడుసార్లు పరీక్షించగా భార్గవాస్త్ర రాకెట్ టార్గెట్‌ను కచ్చితత్వంతో హిట్ చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఈ భార్గవాస్త్ర డ్రోన్ సమూహాల ముప్పును ఎదుర్కోవడంలో చాలా కీలకం. భార్గవాస్త్ర అనేది ఒక కౌంటర్ డ్రోన్ వ్యవస్థ. డ్రోన్‌దాడులను దీటుగా ఎదుర్కొనేందుకు దీన్ని అభివృద్ధి చేశారు. ఈ కౌంటర్ డ్రోన్ సిస్టమ్ 2.5కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాన్ని విజయవంతంగా ఛేదించగలదు. 6 కిలోమీటర్ల దూరంలో ఉన్న చిన్న వైమానిక వాహనాలను కూడా ఇది గుర్తించి, గైడెడ్ మైక్రో బాంబులను ఉపయోగించి వాటిని నిర్వీర్యం చేస్తుంది. భార్గవాస్త్ర వ్యవస్థకు ఏకకాలంలో 64 మైక్రో క్షిపణులను ప్రయోగించే సామర్థ్యం ఉంది. ఎక్కడికైనా సులువుగా, వేగంగా తరలించవచ్చు. ఆర్మీ ఎయిర్ డిఫెన్స్ కోసం అభివృద్ధి చేసిన మొట్టమొదటి మైక్రో క్షిపణి ఆధారిత కౌంటర్ డ్రోన్ వ్యవస్థ ఇది. గగనతలంలో ఆరునుంచి పదికిలోమీటర్ల దూరంలో ఉన్న ముప్పును కూడా పసికడుతుంది. తొలి లేయర్‌లో అన్‌గైడెడ్ మైక్రో రాకెట్లను పెట్టి 20 మీటర్ల పరిధిలో ఉన్న డ్రోన్ల దండును నాశనంచేసేలా దీన్ని రూపొందించారు. ఇక రెండో లేయర్‌లో గైడెడ్ మైక్రో మిస్సైల్‌ను ఉంచుతారు. ఇవి లక్ష్యాలను అత్యంత కచ్చితత్వంతో గుర్తించి నిర్వీర్యంచేస్తాయి. సముద్రానికి ఐదువేలమీటర్ల ఎత్తులో ఉండేభూభాగాల్లో కొండలప్రాంతాల్లోను వీటిని సమర్థంగా వినియోగించుకోవచ్చని కంపెనీ చెపుతోంది. భారత్‌లోని సోలార్ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ లిమిటెడ్ సంస్థ ఈ భార్గవాస్త్రను రూపొందించింది.

## వారం - వర్జ్యం

తేది : 15-05-2025, గురువారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
వైశాఖ మాసం, ఉత్తరాయణం,
వసంత ఋతువు, కృష్ణ పక్షం
తదియ 4.02
జ్యేష్ఠ మ.2-05
వర్జ్యం రా.3.21-తె.5.05
దు.ఉ.9.56-10.48, మ.3.05-3.57
శుభసమయం: ఉ.5.10-5.50, సా.5.00-6.00
రాహుకాలం - మ.1.30-3.00

## వార్తాఫలం

**మేషం :** ఉద్యోగయత్నాలు కలిసి వస్తాయి. సభలు, సమావేశాలలో చురుకుగా పాల్గొంటారు. వస్తువస్త్రాలు కొనుగోలు.

**వృషభం :** చిన్ననాటి మిత్రుల నుండి ఆహ్వానాలు అందుతాయి. కీలక నిర్ణయాలలో సొంత ఆలోచనలు శ్రేయస్కరం.

**మిథునం:** వ్యవహారాలలో విజయం సాధిస్తారు. వృత్తి వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. వాహనసౌఖ్యం.

**కర్కాటకం:** పనులలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి. కొత్తగా ఋణ బాధలు ఎదురై చికాకులు పెడతాయి.

**సింహం:** గృహ నిర్మాణ ఆలోచనలు నిదానంగా కార్యరూపం దాలుస్తాయి. వ్యాపారాలు కొంత లాభిస్తాయి.

**కన్య :** ఉద్యోగాలలో ఎదురైన చికాకులు కొంతవరకు తీరుతాయి. దూరప్రాంతాల నుండి విలువైన సమాచారం అందుకుంటారు.

**తుల :** జీవిత భాగస్వామి నుండి ధనలాభం పొందుతారు. ప్రముఖుల నుండి శుభ ఆహ్వానాలు అందుతాయి.

**వృశ్చికం:** వ్యాపారాలలో లాభాలు పొందుతారు. ఉద్యోగాలలో పనిభారం తగ్గుతుంది. వస్తు, వస్త్రాలు లాభాలు.

**ధనుస్సు:** ఆదాయానికి మించిన ఖర్చులు పెరుగుతాయి. ఆకస్మిక ప్రయాణాలలో నూతన పరిచయాలు పెరుగుతాయి.

**మకరం:** కుటుంబంలో ఎదురైన సమస్యలు కొంత వరకు తీరుతాయి. ఆరోగ్యం పట్ల జాగ్రత్త అవసరం.

**కుంభం:** వ్యాపారాలలో ఆటంకాలు ఎదురైన అధిగమిస్తారు. ఉద్యోగాలలో ఒత్తిడులు తొలగుతాయి.

**మీనం:** బంధువులను కలిసి ఆనందంగా గడుపుతారు. విందు, వినోదాలలో పాల్గొంటారు. కార్యజయం.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



హనుమకొండలోని వేయి స్తంభాల ఆలయంలో బుధవారం శివలింగానికి అభిషేకం చేస్తున్న సుందరీమణులు

## రామప్ప 'రమణీ'యం..

>> కలెక్టర్ ప్రావీణ్య, వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద, వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే ఇతర అధికారులు స్వాగతం పలికారు. టూరిజం శాఖ ఏర్పాటు చేసిన బస్సుల్లో హరిత కాకతీయ హోటల్ నుంచి వెయ్యి స్తంభాల ఆలయం చేరుకున్నారు. అక్కడ అధికారులు రెడ్ కార్పెట్ వేసి స్వాగతం పలికారు. అక్కడ ఉన్న మీడియా కు సుందరి మణులు చేతులు ఊపుతూ దేవాలయ ప్రాంగణం లో కి వచ్చారు. ముందుగా దేవాలయం లోకి వెళ్ళే ముందు అక్కడ ఏర్పాటు చేసిన నీటితో సుందరి మణులు స్వయంగా కాళ్ళు కడుక్కొని తుడుచుకొన్నారు. పిదప టూరిజం శాఖ అధికారి వెయ్యి స్తంభాల ఆలయం ప్రాముఖ్యత ,దేవాలయం చరిత్ర సుందరి మణుల కు వివరించారు. అతడు చెప్పిన దేవాలయ నిర్మాణం, చరిత్ర సుందరి మణులు ఆసక్తిగా విన్నారు. దేవాలయ విశిష్టత విన్న తర్వాత ఆలయంలోకి వెళ్ళారు. ఆలయ ప్రధాన అర్చకులు సుందరి మణుల కు ప్రత్యేక పూజలు నిర్వహచ్చారు. అనంతరం మంత్రోత్స వాలతో ఆశీర్వచనం చేసారు. అక్కడి నుండి వరంగల్ లోని వరంగల్ కోట కు వెళ్ళారు.

# ఆ ప్రాజెక్టులు పేకమేడలే

>> నాగార్జునసాగర్ ఎన్ని ఉపద్రవాలు వచ్చినా ఇప్పటికీ చెక్కు చెదరలేదని, కానీ కాళేశ్వరం మూడేళ్ళలోనే కట్టడం, కూలడం రెండూ జరిగిపోయాయని చెప్పారు. లక్ష కోట్లతో కట్టిన కాళేశ్వరంతో అదనంగా 50 వేల ఎకరాలకు కూడా సాగునీరు ఇవ్వలేదని, కనీసం మట్టి పరీక్షలు కూడా చేయకుండా ప్రాజెక్టు నిర్మించిన ఘనత మాజీ సిఎం కెసిఆర్‌ది సిఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. కట్టిన మూడేళ్లలో కుప్పకూలిన ప్రాజెక్టు భూ ప్రపంచంలో కాళేశ్వరం మాత్రమేనని చెప్పారు. ఎలా కట్టకూడదో, ఎలా కడితే ప్రజలకు నష్టం జరుగుతుందో అనే దానికి ఉదాహరణ కాళేశ్వరం అని చెప్పారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టులు కట్టిన చోట కనీసం సాయిల్ టెస్ట్ చేయలేదని చెప్పారు. 80 వేల పుస్తకాలు చదివిన వ్యక్తి ఇంజనీరుగా మారి కట్టిన కాళేశ్వరం పరిస్థితి ఇదని కెసిఆర్‌పై పరోక్ష విమర్శ చేశారు. ఇంజనీర్ల పని ఇంజనీర్లే చేయాలి.. రాజకీయ నాయకుల పని రాజకీయ నాయకులే చేయాలని చెప్పారు. ఇంజనీర్లు తమ విచక్షణతోనే పనిచేయాలని, పరిమిత జ్ఞానంతో రాజకీయ నాయకులు చెప్పే మాటలు వింటే నష్టపోయేది మీరే అని కొత్త ఇంజనీర్లకు సూచించారు. గత ప్రభుత్వ హయాంలో లోపభూయిష్ట నిర్మాణాలతో ప్రాజెక్టులు పూర్తి చేస్తే ఎప్పుడు ఏది కూలుతుందో తెలియని పరిస్థితి ఏర్పడిందని, ఎవరి నిర్లక్ష్యంతో ఎస్ఎల్బీసీ పూర్తి కాలేదో అందరికీ తెలుసునని చెప్పారు. ఎస్ఎల్‌బిసి టన్నెల్ ప్రపంచంలోనే అద్భుత టన్నెల్, పదేండ్లలో 10 కిలోమీటర్లు కూడా తవ్వకపోవడంతో ఇప్పుడు టన్నెల్ కూలిపోయిందని పేర్కొన్నారు. గ్రావిటీ మీద నల్లగొండకు నీరందించే ప్రాజెక్టును గత ప్రభుత్వం పూర్తి చేయలేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజల బిగ్గెస్ట్ సెంటుమెంట్ నీళ్లు, నీళ్లు అందించే సాగునీటి ప్రాజక్టుల నిర్మాణంలో జాగ్రత్తలు పాటించాలని స్పష్టం చేశారు. ఎసెల్బీసీ, సీతారామ, దేవాదుల, నెట్టెంపాడు, సమ్మక్క సారక్క ప్రాజెక్టులను మొదటి ప్రాధాన్యతగా తీసుకుని పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. 2 లక్షల కోట్లు ఖర్చుపెట్టినా తెలంగాణలో ఉమ్మడి రాష్ట్రంలో మొదలు పెట్టిన ప్రాజెక్టులు పూర్తి కాలేదని, తెలంగాణ వచ్చి పదేళ్లయినా ప్రాజెక్టులు ఇంకా ఎందుకు పూర్తి కాలేదని ప్రశ్నించారు. ఆ నిధులు ఎవరి జేబుల్లోకి వెళ్లాయి?మేధావులు, ఉద్యోగులు ఈ విషయంపై ఆలోచన చేయాలని పిలుపునిచ్చారు. ప్రాజెక్టులను పూర్తి చేయాలనే సంకల్పంతో మా ప్రభుత్వం పనిచేస్తుందని, అందుకే నీటిపారుదల శాఖలో ఉద్యోగ ఖాళీలను భర్తీ చేస్తున్నామని చెప్పారు.ఈ పదిహేను నెలల్లో ఒక నీటిపారుదలశాఖలోనే 1161 ఉద్యోగా ఖాళీలను భర్తీ చేశామని తెలిపారు. తెలంగాణ పునర్నిర్మాణంలో భాగస్వాములు కాబోతున్న ఇంజనీర్లందరికీ అభినందనలు తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన వారు వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన వారేనని, రైతులను ఆత్మగౌరవంతో బతికేలా చూస్తున్నామని చెప్పారు. నీళ్ల కోసమే తెలంగాణ ఉద్యమం పుట్టిందని తెలిపారు. నీళ్ల కోసం మొదలైన మన ఆకాంక్షనే రాష్ట్రాన్ని సాధించి పెట్టిందన్నారు. ఇది ఉద్యోగం కాదు.. ఒక భావోద్వేగం.. ఆ భావోద్వేగానికి మీరే ప్రతినిధులు...భావోద్వేగంతో కొన్ని పార్టీలు రాజకీయ లబ్ది పొందాయని గత బిఆర్ఎస్ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. గత ప్రభుత్వం ఉద్యోగాలు ఇవ్వడం లేదని ధర్నాలు, కానీ తమ ప్రభుత్వంలో ఉద్యోగాలు వద్దని ధర్నాలు చేసేలాగా ఇస్తున్నామన్నారు. గ్రూప్-1 ఉద్యోగులకు నియామక పత్రాలు ఇచ్చే ముందే కొందరు దురుద్దేశంతో అడ్డుకున్నారని, కోర్టులో కేసు వేసి 563 ఉద్యోగాలు అడ్డుకోవాలని ప్రయత్నం చేశారని పేర్కొన్నారు, గ్రూప్1 ఉద్యోగ నియామకాలను అడ్డుకోవడం వెనక ఉన్న రాజకీయ నాయకులు ఎవరో ప్రజలకు తెలుసునని చెప్పారు, త్వరలోనే గ్రూప్స్ ఉద్యోగాల నియామకాలు పూర్తి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.




బుధవారం న్యూఢిల్లీలో ప్రధాని మోడీకి వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న ఆప్ నాయకులు, కార్యకర్తలు

## కోర్ అర్బన్ రీజియన్‌లో సులభతరంగా అనుమతుల ప్రక్రియ

### పౌర సేవలపై సిఎం ఎ.రేవంత్ రెడ్డి సమీక్ష

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే14:** తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో వివిధ రకాల నిర్మాణాలు, ఇతర సదుపాయాల కల్పనకు సంబంధించిన అనుమతుల ప్రక్రియ సులభతరంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించి పూర్తి అధ్యయనంతో సాధ్యమైనంత త్వరగా నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. కోర్ అర్బన్ రీజియన్ పరిధిలోని పౌర సేవలు, అనుమతులపై రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి బుధవారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు. ఔటర్ రింగు రోడ్డు పరిధిలోని జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ పరిధిలోని కోర్ అర్బన్ రీజియన్‌లో వివిధ రకాల నిర్మాణాలకు ప్రజలు పలు విభాగాలకు దరఖాస్తులు చేసుకొని ఆయా కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందన్నారు.కోర్ అర్బన్ రీజియన్ లో సర్వీస్ సెక్టార్ ను పూర్తిగా సరళతరం చేయాలని అధికారులకు సూచించారు. ఏదైనా నిర్మాణం లేదా గృహాలు, వాణిజ్య సముదాయా లకు అవసరమైన సేవలకు ఒకే ప్లాట్‌ఫాంపై దరఖాస్తు అందజేస్తే వారికి అవసరమైన సేవలన్నింటికి సింగిల్ విండోలో అనుమతి లభించేలా ఉండాలన్నారు. ఇందుకు రెవెన్యూ, పురపాలక, జల వనరులు, నీటి సరఫరా, మురుగు నీటి పారుదల, పోలీసు, అగ్నిమాపక, విద్యుత్ తదితర విభాగాలు సంయుక్తంగా పని చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. సమీక్షలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్రపురపాలక, పట్టణాభివృద్ధి శాఖ కార్యదర్శి ఇలంబర్తి, ముఖ్యమంత్రి కార్యదర్శి మాణిక్ రాజ్, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్, హైదరాబాద్ మెట్రో వాటర్ బోర్డు ఎండీ అశోక్ రెడ్డి, టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ, మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ ఇ.వి.నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 25న విఆర్‌ఓ, విఆర్‌ఎలకు పరీక్ష

### జిపిఓ పోస్టుల భర్తీకి ఏర్పాట్లు

**హైదరాబాద్, మే 14, ప్రభాతవార్త:** ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి రెవెన్యూ గ్రామానికి ఒక్క జీపీవో (గ్రామ పాలన ఆఫీసర్)ఉండేలా చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా ఇప్పటికే పూర్వపు వీఆర్వో, వీఆర్ఎల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. వారందరికీ స్క్రీనింగ్ టెస్ట్ పెట్టేందుకు సమాయాత్తమవుతున్నది. ఈ నెల 25న పరీక్ష పెట్టనున్నారు. ఇప్పటికే ప్రతి జిల్లాలోనూ పరీక్షా కేంద్రాన్ని ఎంపిక చేయాలని కలెక్టర్లకు ఆదేశాలు అందాయి.పరీక్ష కేంద్రం, దాని నిర్వహణకు నోడల్ అధికారిని డిప్యూట్ చేయాలని సూచించారు. తొలుత టీజీపీఎస్సీ ద్వారా పరీక్ష నిర్వహించాలని నిర్ణయించారు. ఐతే పలు పరీక్షల నిర్వహణతో తీరిక లేకుండా ఉన్నారు. ఈ క్రమంలో కలెక్టర్ల నేతృత్వంలోనే ప్రతి జిల్లాలో పరీక్షను పూర్తి చేయనున్నారు. పరీక్ష ఏ పద్ధతిన ఉంటుందన్న అంశంపై అభ్యర్థులకు సందేహాలు ఉన్నాయి. ఐతే జిపివో చేయబోయే విధులు, బాధ్యతలపైనే ప్రశ్నలు ఉంటాయని అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఈ నెలాఖరులోగానే జీపీవోల ఎంపిక ప్రక్రియ పూర్తయ్యే అవకాశం ఉంది.

## కొత్తగా ఎన్ని ఎకరాలకు నీళ్లిచ్చారు?: హరీష్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే14:** కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా 20లక్షల ఎకరాలకు (కొత్త, స్థిరీకరణ) సాగునీరు అందించినట్లు అసెంబ్లీ సాక్షిగా మీరు విడుదల చేసిన శ్వేతపత్రంలోనే ప్రకటించారు. మళ్లీ ఇప్పుడు 50వేల ఎకరాలకు కూడా నీళ్లు ఇవ్వలేదని గోబెల్స్ ప్రచారం చేస్తున్నావని సిఎం రేవంత్‌రెడ్డిపై బిఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్‌రావు విమర్శలు చేశారు. మీకు చిత్తశుద్ధి ఉంటే, మీ 18 నెలల పాలనలో కొత్తగా ఎన్ని ఎకరాలకు నీళ్లు ఇచ్చారో శ్వేతపత్రం విడుదల చేయాలని బిఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు.ఎస్ఎల్‌బీసీ విషయంలో మొసలి కన్నీరు కారుస్తున్న ముఖ్యమంత్రికి మూడు నెలలు కావొస్తున్నా సొరంగంలో కూరుకుపోయిన వారి జీవితాలు గుర్తుకురావడం లేదా? అని ప్రశ్నించారు.

9 ఏళ్ల బిఆర్ఎస్ పాలనలో రూ.3900 కోట్లు ఖర్చు చేసి 12 కిలోమీటర్ల టన్నెల్ పనులు పూర్తి చేసింది వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. ఆరు ప్రాజెక్టులు పూర్తి చేసి, ఆరున్నర లక్షల ఎకరాలకు నీళ్లు ఇస్తమని అసెంబ్లీ సాక్షిగా చెప్పి మాట తప్పారు. మీ నిర్లక్ష్యం వల్ల పెద్దవాగు తెగిపోయింది, ఎస్ఎల్బీసీ కుప్ప కూలింది. వట్టెం పంపు హౌజ్ మునిగిపోయింది. పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో మేజర్, మీడియం, మైనర్ ఇరిగేషన్ కింద, 17.24 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు క్రియేట్ చేశామన్నారు. 31.50 లక్షల ఎకరాలు స్థిరీకరణ చేశాం. మొత్తంగా 48 లక్షల ఎకరాలకు నీళ్ళు అందించి, సాగును బాగు చేశామన్నారు.

## 70 శాతం వాటా మనదే

>> కుమార్ రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్ తో పాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ఇరిగేషన్ శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా, కార్యదర్శి ప్రశాంత్ పాటిల్, ఈఎన్సీ అనిల్ కుమార్ పాల్గొన్నారు.

## మాట్లాడుకుందాం!

>> కుదుర్చుకుందాం కొత్త వ్యాపారంచేద్దాం అని వారికి చెప్పానని వారిరువురూ కూడా అంగీకరించారన్నారు. అందువల్లనే యుద్ధం నిలిచిపోయిందని ఇదిలాగే కొనసాగాలని ఆశిద్దామని అన్నారు. ఒప్పందం విషయంలో అమెరికా మధ్యవర్తిత్వం వహించిందని ట్రంప్ పేర్కొనడం శనివారం నుంచి ఐదోసారి కావడం గమనార్హం. సౌదీ పర్యటనలో అదే వ్యాఖ్యలు చేసిన ట్రంప్, ఆ తర్వాత మళ్లీ పాత పాటే పాడారు. అద్భుతమైన రెండు దేశాల మధ్య శాంతి నెలకొనడానికి, వాణిజ్య ఒప్పందాలు చేసుకోవడానికి భారత్, పాకిస్థాన్‌ను ఒప్పించామని ట్రంప్ తెలిపారు. అది గత అద్భుతమైన వారంలోనే జరిగిందని చెప్పారు. ఇది యుద్ధాల కాలం కాదని తాను భావిస్తున్నట్లు వ్యాఖ్యానించారు. రెండు దేశాల్లో మంచి నాయకులు ఉన్నారని కొనియాడారు. భారత్, పాక్ బలమైన అణ్వాయుధ దేశాలని, వాటి వద్ద శక్తిమంతమైన ఆయుధాలు ఉన్నాయని అన్నారు. అణ్వాయుధాల కంటే వాణిజ్య ఒప్పందాలు గొప్ప అన్నారు. యుద్ధం జరిగితే లక్షలాది మంది చనిపోవచ్చని తెలిపారు. అందుకే తాను, వైస్ ప్రెసిడెంట్ జేడీ వాన్స్, విదేశాంగ కార్యదర్శి మార్కో రుబియో కలిసి ఓ మంచి పని చేశామని తెలిపారు. ఒక టీమ్‌గా ఉన్నామని, వాణిజ్య ఒప్పందాలు చేసుకుందామని తామే ప్రతిపాదించినట్లు తెలిపారు. అణ్వాయుధాల కంటే వాణిజ్య ఒప్పందాలు గొప్ప విషయంగా వర్ణించారు. అక్కడికి కొన్ని గంటల ముందు, సౌదీ అరేబియాలోని రియాద్‌లో తనకు యుద్ధం ఇష్టం లేదని, శాంతిని సృష్టించే వ్యక్తిగా, ఐక్యంగా ఉండాలని కోరుకుంటున్నానని ట్రంప్ తెలిపారు. భారత్ పాక్ మధ్య ఒప్పందం కుదిరేందుకు వాణిజ్యాన్ని ఉపకరణంగా వినియోగించానని చెప్పారు. అణు క్షిపణుల వాణిజ్యం చేయొద్దని చెప్పానన్నారు. మే 10న రెండు దేశాలు కాల్పుల విరమణ ఒప్పందం కుదుర్చుకున్నాయి. వాటిలో అమెరికాదే కీలక పాత్ర ట్రంప్ కొన్నిరోజుల నుంచి చెప్పుకుంటూ వస్తున్నారు.

## రాష్ట్రానికి 'నైరుతి'

>> అత్యధిక వర్షపాతాన్ని ఇచ్చేది నైరుతి రుతుపవనాలే కావడంతో దీనిపైనే రైతుల ఆశతో ఎదురు చూస్తున్న తరుణంలో చురుగ్గా కదులుతున్న రుతుపవనాలు మే 27 నాటికి కేరళను తాకనున్నాయని ప్రకటించింది. ఈ క్రమంలో జూన్ 12న తెలంగాణలోకి నైరుతి రుతుపవనాలు ఎంట్రీ ఇవ్వనున్నట్లు వాతావరణ శాఖ పేర్కొంది. రాష్ట్రంలో ఈసారి సాధారణం కంటే అధికంగా వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు పేర్కొంది. ఈ ఏడాది ముందుగానే వచ్చిన రుతుపవనాలతో ఒక్క తెలంగాణ రాష్ట్రంలో మాత్రమే కాకుండా దేశ వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు స్పష్టం చేసింది. నైరుతి ఆగమన నేపథ్యంలో మరో వారం రోజుల్లో తెలంగాణ రాష్ట్రంలో అధిక ఉష్ణోగ్రతల ప్రభావం ముగిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. ద్రోణి ప్రభావంతో పాటు రుతుపవనాల ప్రభావంతో రాష్ట్రంలో వచ్చే మూడు రోజులు మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. తెలంగాణలోని ఆదిలాబాద్, కొమరం భీం, నిర్మల్, నిజామాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్ నగర్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల్ జిల్లాలలో అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో గంటకు 50 నుండి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులతో కూడిన వడగండ్ల వర్షం కురిసే అవకాశం ఉంది. ఇప్పటికే తెలంగాణ లోని 12 జిల్లాలకు వాతావరణ శాఖ అధికారులు ఆరెంజ్ అలెర్ట్ ప్రకటించారు. మంచిర్యాల, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్ గిరి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి జిల్లాలలో అక్కడక్కడ గంటకు 30 నుండి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులతో కూడిన వడగండ్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

# గవర్నర్ దత్తత గ్రామాల్లోనూ ఇందిరమ్మ ఇళ్లు: మంత్రి పొంగులేటి

**హైదరాబాద్,మే14,ప్రభాతవార్త:**రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మతో రెవెన్యూ, హౌసింగ్,సమాచార పౌరసంబంధాల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బుధవారం మర్యాద పూర్వకంగాభేటీ అయ్యారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన భూభారతి చట్టం అమలు,ఇందిరమ్మ ఇండ్ల పథకం గురించి గవర్నర్‌కి మంత్రి వివరించారు. ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి ఈ ఏడాది ప్రతినియోజకవర్గానికి 3500 చొప్పున రాష్ట్ర వ్యాప్తంగా 4.50లక్షల ఇండ్లను మంజూరు చేస్తున్నామని తెలిపారు.గవర్నర్ ఆలోచన, సిఎం సూచనల మేరకు గిరిజన నియోజకవర్గాలకు అదనంగా 500నుంచి700 ఇండ్లను మంజూరు చేస్తున్నామని,అదే విధంగా ఐటిడిఎ పరిధిలో చెంచు కుటుంబాలకు పదివేల ఇండ్లను మంజూరు చేస్తున్నామన్నారు.మొదటిదశలో అత్యంత నిరుపేదలకు ప్రాధాన్యతాక్రమంలో ఇండ్లను మంజూరు చేస్తున్నామని తెలిపారు.గవర్నర్ దత్తత తీసుకున్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పూసుకుంట గ్రామం,గోగులపూడి,ఆదిలాబాద్ జిల్లా భుర్కి,మంగ్లీ,నాగర్ కర్నూల్ జిల్లా అప్పాపూర్,బౌరాపూర్,గ్రామాల్లో కూడా ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేశామన్నారు.రాష్ట్రంలో గత పదేళ్లుగా నెలకొన్న భూసమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించాలన్న లక్ష్యంతో



గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మతో రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి భేటీ

తీసుకువచ్చిన భూభారతి చట్టాన్ని ఈనెల 5వ తేదీ నుంచి 28 మండలాల్లో అమలు చేస్తున్నామన్నారు.ఎలాంటి రుసుము లేకుండానే ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు.గవర్నర్‌ని కలిసిన వారిలో ఖమ్మం పార్లమెంట్ స భ్యుడు రామసహాయం రఘురామ్‌రెడ్డి, ఐడిసి ఛైర్మన్ మువ్వ విజయబాబు, హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ విపి గౌతమ్ తదితరులు ఉన్నారు.

## మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డికి

# సుప్రీంకోర్టు ముందస్తు బెయిల్

### మొయినాబాద్ భూకబ్జాకేసు దర్యాప్తునకు పూర్తిగా సహకరించాలని షరతు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, మే14:** బిఆర్ఎస్‌కు చెందిన ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డికి సుప్రీం కోర్టులో ఊరట లభించింది. మొయినా బాద్ వద్ద ప్రైవేటు భూమిని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారన్న కేసులో జీవన్‌రెడ్డికి సుప్రీం ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. మొయినాబాద్ భూ వ్యవహారంలో జీవన్‌రెడ్డి పిటిషన్ కొట్టేసి, దర్యాప్తునకు పూర్తిగా సహకరిం చాలని తెలంగాణ హైకోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే. గతంలో ఇదే భూ వివాదానికి సంబంధించి జీవన్‌రెడ్డి దాఖలు చేసుకున్న పిటీషన్‌ను తెలంగాణ హైకోర్టు కొట్టివేసింది.దర్యాపు ప్రక్రియకు సంపూర్ణంగా సహక రించాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ ఆదేశాలను సుప్రీంకోర్టులో జీవన్ రెడ్డి సవాల్ చేశారు.ఈపిటిషన్‌పై బుధవారం సుప్రీంలో విచారణ జరిగింది. ఈసందర్భంగా జీవన్‌రెడ్డి తరఫున వాదానలు వినిపించిన న్యాయవాది ఇదే కేసుకు సంబంధించి ఆయన కుటుంబసభ్యులకు ఇప్పటికే బెయిల్ లభించిందని సుప్రీంకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఇరుపక్షాల వాదనలు విన్న జస్టిస్ పార్థివాలా నేతృత్వంలోని ధర్మాసనం ముందస్తుబెయిల్ మంజూరు చేస్తూ తుది ఉత్త ర్వులు జారీ చేసింది.అయితే దర్యాప్తునకు పూర్తిగా సహకరించాలని, విచారణ ప్రక్రియలో ఎటువంటి ఆటంకాలు కల్పించరాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఒకవేళ దర్యాప్తునకు సహరించకపోతే సంబంధిత విచారణాధికారులు చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకునే వెసులుబాటును సుప్రీంకోర్టు కల్పించింది.

# అదనపు సౌకర్యాల కోసం గాలి పిటిషన్

**హైదరాబాద్, మే 14, ప్రభాతవార్త:** ఓబుళాపురం గనుల అక్రమ మైనింగ్ వ్యవహారంలో సిబిఐ కోర్టు ఆదేశాల మేరకు ఏడేళ్ల జైలు శిక్షకు గురై చంచల్‌గూడ జైల్లో ఖైదీగా వున్న కర్నాటకకు చెందిన బిజెపి ఎంఎల్ఏ గాలి జనార్ధన్ రెడ్డి జైల్లో తనకు అదనపు వసతులు కావాలని నాంపల్లి కోర్టులో బుధవారం నాడు పిటిషన్ దాఖలు చేశారు. 14 ఏళ్లుగా సాగిన ఓబుళాపురం గనుల కేసు విచా రణకు సిబిఐ కోర్టు ఈ నెల ఆరవ తేదీన ముగింపు పలుకుతూ గాలి జనార్ధన్ రెడ్డి సహా ఆ యన సోదరుడు శ్రీనివాస్ రెడ్డి, వీరి సన్నిహితుడు మఫజ్ అలీ ఖాన్, గనుల శాఖ మాజీ డైరక్టర్ రాజగోపాల్‌కు ఏడేళ్ల జైలు శిక్ష విధించడం తెలిసిందే. అదే రో జున నలుగురిని సిబిఐ అధికారు లు భద్రత మధ్య చంచల్‌గూడ జైలుకు తరలించారు, ప్రస్తుతం వీరంతా జైల్లో సాధారణ ఖైదీ లుగానే వున్నారు. అయితే గాలి జనార్ధన్ రెడ్డి తనకు ఆరోగ్య కారణాలరీత్యా అదనపు వసతులు కావాలని కోర్టును అభ్యర్థించారు. ఈ పిటిషన్‌ను కోర్టు విచారణకు స్వీకరించింది. దీనిపై సిబిఐ కౌంటర్ దాఖలు చేయనుంది. ఒకవేళ గాలి జనార్ధన్ రెడ్డికి అదనపు వసతులు విషయంలో సిబిఐ అభ్యంతరం వ్యక్తం చేస్తే ఈ విషయమై విచారణ సాగనుంది.

## యుపిపిఎస్‌సి ఛైర్మన్‌గా మాజీ ఐఎఎస్ అజయ్‌కుమార్



**న్యూఢిల్లీ, మే 14:** రిటైర్డ్ ఐఎఎస్ అధికారి మాజీ రక్షణ శాఖ కార్యదర్శి అజయ్ కుమార్‌ను కేంద్రం యూపిపిఎస్‌సి ఛైర్మన్‌గా నియమించింది. ఈమేరకు వ్యక్తిత్వ శిక్షణ మంత్రిత్వశాఖ ఉత్తర్వులు జారీచేసింది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము డా. అజయ్‌కుమార్‌ను యుపిపిఎస్‌సీ ఛైర్మన్‌గా నియమించేందుకు ఆమోదం తెలిపారని డిఓపిటి తెలిపింది. 1985 బ్యాచ్ కేరళ కేడర్ ఐఎఎస్ అధికారి. ఆయన విధుల్లో చేరినప్పటినుంచి ఆయన సర్వీసుకాలం అమలవుతుందని ఆయనకు తెలిపారు. కుమార్‌కు ముందుపనిచేసిన ప్రీతి సుదాన్ పదవీకాలం గతనెల 29వ తేదీతో ముగిసింది. మనోజ్‌సోని రాజీనామా తర్వాతనే సూదన్ ణియామకం జరిగింది. అప్పటివరకూ ఆమె ఆరోగ్యశాఖ కారనయదర్శిగా పనిచేసారు. 2024 జులైలో ఆమె యుపిపిఎస్‌సి ఛైర్మన్‌గా నియమితులయ్యారు. అయితే మనోజ్‌సోని వ్యక్తిగత కార ణాలతోనే రాజీనామాచేయడంతో ఆయన పదవీకాలం ముందుగానే రాజీనామా చేసారు. 2017నుంచి 2023 మేవరకూ కమిషన్‌లో సభ్యునిగా పని చేసారు. ఆయన ఆకస్మిక రాజీనామాపై కాంగ్రెస్‌పార్టీ కూడా నిలదీసింది. మాజీ ఐఎఎస్ అధికారి పూజాఖేద్కర్ వివాదం వెలుగులోకి రాకముందే సోని రాజీనామా చేసారు. తదనంతరం ప్రీతిసూదన్ పదవిలోకి రాగా ఆమె పదవీ కాలం గతనెల 29తో పూర్తి అయింది. దీనితో పూర్తికాలపు యుపిపిఎస్‌సి ఛైర్మన్‌గా ఇపుడు అజయ్‌కుమార్ నియమితులయ్యారు.


## భారత రక్షణ రంగ ఎగుమతుల్లో భారీ పెరుగుదల

# రికార్డు స్థాయిలో 34 రెట్ల వృద్ధి

**హైదరాబాద్, మే 14, ప్రభాతవార్త:** భారత రక్షణ రంగం ఆత్మనిర్భర్ భారత్ స్ఫూర్తితో అద్భుత ప్రగతి సాధిస్తోంది. 2024..2025 ఆర్థిక సంవత్సరంలో రక్షణ రంగానికి సంబంధించిన ఎగుమతులు 23,622 కోట్ల రూపాయలకు చేరి సరికొత్త చరిత్ర సృష్టించాయి. దేశ రక్షణ శాఖ చరిత్రల ఇది అత్యధికం కావడం గమ నార్హం. గత ఏడాది అంటే 2023...2024 సంవత్సరా నికి 21 వేల 083 కోట్ల రూపాయల మేరకు వున్న రక్షణ రంగ ఎగుమతులు ఈ ఏడాది 12.04 శాతం వృద్ధిని నమోదు చేశాయి. 2013...2014లో కేవలం 686 కోట్ల రూపాయల మేరకే రక్షణ రంగ ఎగుమతులు చేసిన భారత్ గడచిన పదేళ్ల కాలంలో దీని ని ఏకంగా 34 రెట్లకు పెంచుకోగలగడం గమనార్హం. ఇది మేక్ ఇన్ ఇండియా కార్యక్రమ పటిష్టతకు నిదర్శనమని రక్షణ శాఖ వెల్లడించింది. భారత్ ప్రస్తుతం సు మారు 80 దేశాలకు రక్షణ ఉత్పత్తులను ఎగుమతి చేస్తుండగా వచ్చే 2029 నాటికి దీనిని 50 వేల కోట్ల రూపాయలకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంది. రక్షణ రంగ ఎగుమతుల్లో ప్రైవేటు సంస్థల వాటా 15,233 కోట్ల రూపాయల కాగా ప్రభుత్వ రంగ సంస్థల వాటా 8,389 కోట్ల రూపాయలుగా వుంది. ప్రభుత్వ రంగ సంస్థల ఎగుమతులు గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది 42.85 శాతం పెరగడం విశేష ం. దేశీయ తయారీ రంగాన్ని ప్రోత్సహించడం ద్వారా రక్షణ రంగ ఉత్పత్తులకు విదేశాల్లో భారీ గిరాకి ఏర్పడింది. మందుగుండు సామాగ్రి, ఆయుధాలు, విడిభాగాలు వంటి ఉత్పత్తులకు భారత్ పెట్టింది పేరుగా రక్షణ శాఖ వెల్లడించింది. ఆసియా దేశాలతో పాటు ఆఫ్రికా దేశాలకు భారత రక్షణ రంగ ఉత్పత్తులను ఎగుమతులు చేస్తోంది. రక్షణ రంగ ఉత్పత్తుల్లో ఎగుమతుల్లో పురోగతి సాధించడంవల్ల విదేశాల నుంచి కీలక ఆయుధాల దిగుమతులు భారీగా తగ్గాయి.

# కాంగ్రెస్‌లో బిఆర్ఎస్ విలీనం పక్కా

### రేవంత్ స్థానంలో కెసిఆర్ సిఎం ఖాయం
### హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనం
### జూన్ 2 కాదంటే డిసెంబరు 9న తేదీలలో విలీనం
### ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్ సంచలన వ్యాఖ్యలు



**హైదరాబాద్, మే 14 ప్రభాతవార్త:** తెలంగాణలో కాంగ్రెస్, బిఆర్ఎస్ మధ్య డీల్ కుదిరిందని, త్వరలో ఈ రెండు పార్టీలు విలీనం కాబోతున్నాయంటూ బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ ఎన్.వి.ఎస్.ఎస్.ప్రభాకర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. రేవంత్‌రెడ్డి స్థానంలో కెసిఆర్ సిఎం అవుతారరంటూ ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో కలకలం రేపుతున్నాయి. త్వరలో కాంగ్రెస్‌లో బిఆర్ఎస్ విలీనం కాబో తుందని, దీనికి తేదీలు ఫిక్స్ అయ్యాయన్నారు. జూన్ 2 లేదంటే డిసెంబర్ 9 తర్వాత విలీనం పక్కా అన్నారు. కెటిఆర్ నాయకత్వంలో పనిచేస్తారన్న మాజీ మంత్రి హరీష్ వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనమన్నారు. కాంగ్రెస్‌లో బిఆర్ఎస్ విలీనం ఖాయమంటూ ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. తెలంగాణ రాజకీయాల్లో ఈ అంశం హాట్‌టాపిక్‌గా మారింది. గతంలో బిఆర్ఎస్, కాంగ్రెస్ ఒకటే అంటూ చాలా సార్లు బిజెపి ఆరోపణలు చేసింది. ఎన్‌విఎస్ఎస్ ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలు కొంత బలాన్ని చేకూర్చినట్లైంది. బుధవారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. బిఆర్ఎస్-కాంగ్రెస్ విలీనం జూన్ 2 తర్వాత జరుగుతుందా? లేదంటే డిసెంబర్ 9 తర్వాతనా అన్నదే ప్రశ్న..! అన్నారు. మాజీ మంత్రి హరీష్ రావు ఇటీవల చేసిన వ్యాఖ్యలు ఇందుకు నిదర్శనం అన్నారు. కెటిఆర్ నేతృత్వంలో పనిచేస్తున్నాను హరీశ్‌రావు వ్యాఖ్యపై స్పందిస్తూ, గత పదేళ్ల పాలనంతా కెసిఆర్ ఆధ్వర్యంలో సాగిందనేది స్పష్టంగా ఉండగా, ఇప్పుడు అకస్మాత్తుగా ఈ ప్రకటన ఎందుకు వచ్చిందన్నది సమాజం ఎదురు చూస్తున్న అంశమన్నారు. ఒకవైపు రాజీ జరిగింది, సోనియమ్మ మాట నిలబెట్టుకుంది, ఇక మిగిలింది విలీనమే తరువాయి అన్నారు. అదేవిధంగా ముఖ్యమంత్రి మార్పు కూడా జరుగుతుందని ఆయన జోస్యం చెప్పారు. రేవంత్‌రెడ్డి స్థానంలో కెసిఆర్ సిఎం అవుతారన్నారు. కవిత కేసు విషయంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రముఖ న్యాయవాదిని రాజ్యసభకు పంపడం, రెండు పార్టీల మధ్య అంతర్గత ఒప్పందాన్ని స్పష్టంగా చూపిస్తుందని అభిప్రాయపడ్డారు.


తెలంగాణ ప్రభుత్వం
రెవెన్యూ (భూసేకరణ) విభాగము

ఫారం-VII
(డిక్లరేషన్ / రూఢీ ప్రకటన)

(భూసేకరణ పునరావాస, పునరావాస కల్పనలో పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం-2013, (కేంద్ర చట్టం 30/2013) యొక్క సెక్షన్ 19(1) మరియు రాష్ట్ర రూల్ నం. 25(1) అనుసరించి)

కలెక్టర్ ఫైల్ నం.: G1/1358/2019 తేది: 09.05.2025
ప్రత్యేక ఉప కలెక్టర్ గారి ఫైల్ నం: B/65/2023 తేది: 01.05.2025
గెజిట్ నెం: 47/2025 తేది: 09.05.2025

తెలంగాణ ప్రభుత్వం/జిల్లా కలెక్టర్, సిద్దిపేట గారి ఆదేశానుసారం ఈ దిగువ నిర్దిష్టపరచిన సిద్దిపేట జిల్లా, సిద్దిపేట (అర్బన్) మండలములోని తడకపల్లి గ్రామ పరిధిలో ఉన్న భూమి విస్తీర్ణం ఎ.103.09 గుంటల ప్రజా ప్రయోజనము నిమిత్తము అనగా కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణములో భాగంగా అనంతగిరి రిజర్వాయర్ నుండి కొమురవెల్లి మల్లన్న సాగర్ రిజర్వాయర్ ప్యారాలాల్ కాలువ నిర్మాణ నిమిత్తము ఈ దిగువ చూపిన భూమి అవసరం అయి ఉన్నదని భావించినందున భూసేకరణ పునరావాస, పునరావాస కల్పనలో పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం 2013లోని సెక్షన్ 19(1) అనుసరించి ఈ ప్రకటన జారీ చేయనైనది.

కావున సిద్దిపేట జిల్లా, సిద్దిపేట (అర్బన్) మండలములోని తడకపల్లి గ్రామ పరిధిలో ఉన్న భూమి విస్తీర్ణం ఎ.103.09 గుంటలు గల భూమి ఈ క్రింది అనుబంధములో చూపిన దానిని పైన చూపబడిన ప్రాజెక్టు నిర్మాణమునకు అవసరమైనందున భూసేకరణ నిమిత్తము ప్రకటన (డిక్లరేషన్) జారీచేయనైనది.

షెడ్యూల్-1

గ్రామము : తడకపల్లి మండలం : సిద్దిపేట అర్బన్ జిల్లా : సిద్దిపేట

| క్రమ సంఖ్య | నోటిఫికేషన్ క్ర.సంఖ్య | సర్వే నం. | పట్టా/ప్రభుత్వ | భూసేకరణ చేయు విస్తీర్ణం | భూమి పట్టాదారు మరియు తండ్రి/భర్త పేరు | తూర్పు | పడమర | ఉత్తరం | దక్షిణం | నిర్మాణాలు (రకము, సంఖ్య) బోర్లు/పైపులు ఏరియా/బావి/బోర్/చెట్లు మొదలగు ఇతరములు |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 1 | 671 | పట్టా | 2.09 | నందుపల్ల వెంకటరెడ్డి తండ్రి: సిద్దారెడ్డి | 672, 673 | వెంకటాపురం శివారు | పిల్లాపల్లి శివారు | 670 | 1-బోరు, 6-టేకు, 10-వేప |
| | | | మొత్తం | 2.09 | | | | | | |
| 2 | 2 | 670 | పట్టా | 0.02 | గద్దం లింగయ్య తండ్రి: భూమయ్య | 674, 668 | వెంకటాపురం శివారు | 673 | 664, 668 | |
| | | | | | గద్దం రాములు తండ్రి: భూమయ్య | 674, 668 | వెంకటాపురం శివారు | 673 | 664, 668 | |
| | | | | | గద్దం పద్మ తండ్రి: ఆంజనేయులు | 674, 668 | వెంకటాపురం శివారు | 673 | 664, 668 | |
| [illegible] | | | | | | | | | | |
| | | | మొత్తం | 2.36 | | | | | | |
| 51 | 59 | 329 | పట్టా | 0.06 1/2 | గిరబోయిన రాములు తండ్రి: కిష్టయ్య | బందారమర్ల శివారు | 330 | 332 | బందారమర్ల శివారు | |
| | | | | 0.00 1/2 | బండోజి సరస్వతి భర్త: | బందారమర్ల శివారు | 330 | 332 | బందారమర్ల శివారు | |
| | | | | 0.20 1/2 | హాజిమ్ ఆయిలయ్య | బందారమర్ల శివారు | 330 | 332 | బందారమర్ల శివారు | |
| | | | మొత్తం | 0.27 1/2 | | | | | | |
| పూర్తి మొత్తం | | | | 103.09 | | | | | | |

చట్టం నం. 30 ఆఫ్ 2013 సెక్షన్ 15 క్రింద, తెలిపిన విధంగా ఆసక్తి గల వ్యక్తులను సంప్రదించి తగు విచారణ చేపట్టిన తరువాత మరియు భూసేకరణ పై వచ్చిన అభ్యంతరాలను పరిశీలించిన పిదప ఇట్టి రూఢీ ప్రకటన (డిక్లరేషన్) జారీ చేయనైనది.

కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణములో భాగంగా అనంతగిరి రిజర్వాయర్ నుండి కొమురవెల్లి మల్లన్న సాగర్ రిజర్వాయర్ ప్యారాలాల్ కాలువ నిర్మాణము కొరకు సిద్దిపేట జిల్లా సిద్దిపేట (అర్బన్) మండలములోని తడకపల్లి గ్రామ పరిధిలోని ఇట్టి భూసేకరణ వారి వారి కమతాలలో అతి స్వల్ప విస్తీర్ణమునకు పరిమితమైనందున మరియు ఇట్టి కాలువ నిర్మాణము వలన వారి వారి మిగిలిన భూములకు నీటి సరఫరా పెరిగి, జీవనోపాధులు మెరుగు అవుతున్నందు వలన మరియు ఇట్టి భూసేకరణ వలన ఎలాంటి ఇతర కుటుంబాల జీవనోపాధులు గాను, ఆవాసాలు గాను ఎలాంటి ప్రభావితం కానందున, పునరావాస మరియు పునరావాస వర్తించదు.

భూసేకరణ తలపెట్టిన భూమిలో బొగ్గు, ఇనుము, స్లేట్ మరియు ఇతర ఖనిజములు ఇట్టి భూములలో లేదా క్రింద భాగములో లభ్యమైనచో ఆ ఖనిజాలు ప్రాజెక్టు నిర్మాణమునకు ఉపయోగమున్న పక్షములో వాటిని స్వీకరించబడును లేనిచో స్వీకరించబడవు.

పైన చూపిన భూసేకరణ చేయు భూముల యొక్క ప్లాన్ భూసేకరణ యొక్క ప్రత్యేక ఉప-కలెక్టర్, భూసేకరణ విభాగము-1, సిద్దిపేట గారి కార్యాలయము పనివేళలో పరిశీలించుకొను నిమిత్తము అందుబాటులో ఉండును.

సం/-. తహశీల్దారు, సిద్దిపేట (అర్బన్) మండలము
సం/-ప్రత్యేక ఉప కలెక్టర్, (భూసేకరణ) కాళేశ్వరం ప్రాజెక్ట్, యూనిట్-1,సిద్దిపేట
సం/- అదనపు కలెక్టర్, సిద్దిపేట జిల్లా
సం/-. జిల్లా కలెక్టర్, సిద్దిపేట

DIPR RO.NO: 89/LA/PP/Advt/Pub/2025-26

సంపదకి అహంకారం తోడైతే, అన్ని దుర్గుణాలూ వరుసగా ఉత్పన్నమవుతాయి. వాటి ఫలితం మనిషి నాశనమే.

-గోల్డ్‌స్మిత్

# రేపటి సుస్థిరత కోసం సేంద్రియ వ్యవసాయం

**భారతదేశ స్మార్ట్ సిటీల మార్కెట్ 2025 నాటికి 100 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని అంచనా. ఈ సాంకేతిక పురోగతులు సుస్థిరమైన పరిష్కారాలను రూపొందించడంలో భారతదేశం పెరుగుతున్న సామర్థ్యాన్ని తెలియజేస్తాయి. సుస్థిరత్వం కేవలం సాంకేతికతకు మాత్రమే పరిమితం కాదు. సమాజం కూడా పర్యావరణ స్పృహతో ప్రవర్తించాల్సిన అవసరం ఉంది. గ్రీన్ క్రెడిట్ ఇనిషియేటివ్ వ్యక్తులు, సమాజాలు పర్యావరణ పరిరక్షణలో చురుకుగా పాల్గొనడానికి ప్రోత్సాహాన్నిస్తుంది. లైఫ్ స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ ఉద్యమం స్థిరమైన జీవనశైలిని ప్రోత్సహిస్తుంది. సిక్కిం ప్రపంచంలోనే మొట్టమొదటి పూర్తిగా సేంద్రియ రాష్ట్రంగా మారడం వంటి విజయవంతమైన సేంద్రియ వ్యవసాయ కార్యక్రమాలు సమాజం కృషికి నిదర్శనం. వ్యక్తులు, సమాజాలు చురుకుగా పర్యావరణ పరిరక్షణలో పాల్గొంటేనే దీర్ఘకాలిక విజయం సాధ్యమవుతుంది.**

**డి జె మోహన రావు**

నేడు భారతదేశం అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది. ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా నిలుస్తోంది. అయితే ఈ ప్రగతి పర్యావరణ పరిరక్షణతో ముడిపడి ఉండాలన్నది నేటి తక్షణావసరం. ఆర్థికాభివృద్ధి, పర్యావరణ సమతుల్యత ఒకదానికొకటి విడదీయరాని అంశాలు. ఈ నేపథ్యంలో, సుస్థిరమైన భవిష్యత్తును సాధించడానికి ఆవిష్కరణల పాత్ర అత్యంత కీలకం. 'సుస్థిరమైన రేపటి కోసం ఆవిష్కరణల శక్తి' అనే ఈ నినాదం కేవలం ఆకాంక్ష కాదు, ఇది మనం చేసి కర్తవ్యం. ప్రభుత్వం, పరిశ్రమలు, వ్యక్తులు, సమాజాలు ఇలా ప్రతిఒక్కరూ కలిసి రావాల్సిన సమయం ఇది. భారతదేశం ఒక విశాలమైన, వేగంగా అభివృద్ధి చెందుతున్నదేశం. ఇక్కడ పర్యావరణ సవాళ్లు ఎన్నోఉన్నాయి. అదే సమయంలో ఆవిష్కరణలకు అపారమైన అవకాశాలు కూడాఉన్నాయి. మన జనాభా ఎక్కువ, అభివృద్ధి అవసరాలు మెండుగా ఉన్నాయి. కాబట్టి సుస్థిరత్వం అనేది మన అభివృద్ధి వ్యూహంలో ఒక అంతర్భాగంగా ఉండాలి. ఆర్థికాభివృద్ధిని పర్యావరణ క్షీణత నుండి వేరు చేయడానికి ఆవిష్కరణలు అత్యంత ఆవశ్యకమైన మార్గాన్ని అందిస్తాయి. భారతదేశం సుస్థిరత్వం దిశగా అనేక చర్యలు తీసుకుంటోంది. ముఖ్యంగా పునరుత్పాదక ఇంధన రంగంలో గణనీయమైన పురోగతి సాధించింది. 2014-15లో 24 గిగావాట్లుగా ఉన్న పునరుత్పాదక ఇంధన సామర్థ్యం 2024-25 నాటికి 136 గిగావాట్లకు చేరుకుంది. 2030 నాటికి 500 గిగావాట్ల లక్ష్యాన్ని చేరుకోవాలని భారత్ సంకల్పించింది. శిలాజ ఇంధనాలపై ఆధారపడటాన్ని తగ్గిస్తూ, 2023-24లో శిలాజేతర ఇంధన సామర్థ్యం మొత్తం సామర్థ్యంలో 45శాతానికి పెరిగింది. 2014-15లో ఇది కేవలం 29శాతంగా ఉండేది. జాతీయ సౌర మిషన్ వంటి ప్రభుత్వ కార్యక్రమాలు ఈ విషయంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. అంతేకాకుండా, ప్రభుత్వం 19,744 కోట్ల రూపాయల వ్యయంతో ప్రతిష్టాత్మకమైన జాతీయ గ్రీన్ హైడ్రోజన్ మిషన్‌ను ప్రారంభించింది. ఇప్పటికే ఐదు రాష్ట్రాలు స్వంతంత్ర గ్రీన్ హైడ్రోజన్ విధానాలను ప్రవేశపెట్టాయి. స్వల్ప రాయితీలతోనే పునరుత్పాదక ఇంధన రంగం వృద్ధి చెందుతుండటం విశేషం. ఈ చర్యల ద్వారా భారతదేశం స్వచ్ఛమైన ఇంధన పరివర్తనలో ప్రపంచ నాయకత్వ స్థానాన్ని పొందుతోంది. ఇది కేవలం కర్బన ఉద్గారాలను తగ్గించడమే కాకుండా, దేశ ఇంధన భద్రతను కూడా పెంపొందిస్తుంది. 2030 నాటికి 50 శాతం శిలాజేతర ఇంధన సామర్థ్యాన్ని చేరుకోవాలనే లక్ష్యానికి ఇది అనుగుణంగా ఉంది. వ్యవసాయ రంగంలో కూడా సుస్థిరతను సాధించడానికి అనేక ఆవిష్కరణలు చోటుచేసుకుంటున్నాయి. పంటల ఆరోగ్యాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకోవడానికి, నీటిపారుదల, తెగుళ్ల నియంత్రణ కోసం కృత్రిమ మేధస్సు, డ్రోన్లు, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ వంటి అధునాతన సాంకేతికతలను ఉపయోగిస్తున్నారు. ఫ్యార్మోనాట్ వంటి సంస్థలు ఉపగ్రహ ఆధారిత వ్యవసాయ యాజమాన్య పరిష్కారాలను అందిస్తున్నాయి. సేంద్రియవ్యవసాయ పద్ధతులకు ప్రభుత్వం ప్రోత్సాహాన్ని పెంచుతోంది. దీని ద్వారా రసాయన ఎరువులు, పురుగుమందుల వాడకం తగ్గి, పర్యావరణానికి మేలు జరుగుతోంది. వినియోగదారుల నుండి సేంద్రియ ఉత్పత్తులకు పెరుగుతున్న డిమాండ్‌ను ఇది తీరుస్తుంది. ఖచ్చితమైన వ్యవసాయ పద్ధతుల ద్వారా పంట దిగుబడి 10-20 శాతం పెరిగే అవకాశం ఉంది. నీరు, ఎరువుల వినియోగం 30-40 శాతం వరకు తగ్గుతుంది. ఈ విధంగా సాంకేతికతను వ్యవసాయంలో ఉపయోగించడం ద్వారా ఆహార భద్రతను పెంపొందించడం



తోపాటు, నీటి వంటి విలువైన వనరులను కూడా సంరక్షించవచ్చు. ఇది సుస్థిర అభివృద్ధి లక్ష్యం2 (ఆకలిలేని ప్రపంచం), లక్ష్యం 15 (భూమిపై జీవం)కు దోహదం చేస్తుంది. భారతదేశంలో వ్యర్థాల నిర్వహణ కూడా ఒక పెద్ద సవాలు. అయితే ఈ రంగంలోనూ అనేక ఆవిష్కరణలు వస్తున్నాయి. ప్లాస్టిక్ వ్యర్థాలను రీసైకిల్ చేయడానికి అధునాతన సాంకేతికతలు (మెకానికల్, కెమికల్) అందుబాటులోకి వస్తున్నాయి. వస్తువుల తయారీదారులు తమ ఉత్పత్తుల వ్యర్థాల బాధ్యత తీసుకోవాలనే 'ఎక్స్‌టెండెడ్ ప్రొడ్యూసర్ రెస్పాన్సిబిలిటీ' విధానం ఈ దిశగా ఒక ముఖ్యమైన ముందడుగు. భారతదేశంలో ప్రతి సంవత్సరం సుమారు 7,793 కిలో టన్నుల వస్త్ర వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నాయి. ఈ వ్యర్థాలను తిరిగి ఉపయోగించడంపై దృష్టి సారించడం చాలా అవసరం. ఎలక్ట్రానిక్ వ్యర్థాల (ఈవ్యర్థాలు) రీసైక్లింగ్‌లోనూ గణనీయమైన పురోగతి ఉంది. అటెరో రీసైక్లింగ్ వంటి సంస్థలు విలువైన లోహాలను తిరిగి పొందడానికి అధునాతన సాంకేతికతలను ఉపయోగిస్తున్నాయి. వ్యర్థాలను సమర్థవంతంగా వేరు చేయడానికి కృత్రిమ మేధస్సు ఆధారిత వ్యవస్థలు అభివృద్ధి చేయబడుతున్నాయి. 2030 నాటికి భారతదేశ ఈవ్యర్థాలు రెట్టింపు అవుతాయని అంచనా. వ్యవసాయ వ్యర్థాలైన బయోమాస్‌ను శక్తి ఉత్పత్తికి (బయోగ్యాస్, బయోసిఎన్‌జి, బయోఫ్యూయల్) ఉపయోగించడం కూడా పెరుగుతోంది. ఈ రంగానికి ప్రభుత్వ రాయితీలు లభిస్తున్నాయి. జల వనరుల నిర్వహణలోనూ వినూత్నమైన విధానాలు మరింత ఊతమిస్తున్నాయి. ఈవిధంగా వ్యర్థాలను విలువైన వనరులుగా గుర్తించి, వాటిని సమర్థవంతంగా రీసైకిల్ చేయడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించవచ్చు. ఇది సుస్థిర అభివృద్ధి లక్ష్యం 12 (బాధ్యతాయుతమైన వినియోగం ఉత్పత్తి)కు అనుగుణంగా ఉంది. సుస్థిరమైన భవిష్యత్తు కోసం భారతదేశం అనేక అత్యాధునిక సాంకేతిక ఆవిష్కరణలను అందిపుచ్చుకుంటోంది. సౌరశక్తి రంగంలో రెండు వైపులా కాంతిని గ్రహించే బైఫేషియల్ సోలార్ ప్యానెళ్లు, గ్రిడ్ స్థిరత్వం కోసం ఎ ఐ ఆధారిత సౌర సూచనలు, భూమి వినియోగాన్ని తగ్గించే తేలియాడే సౌర విద్యుత్ క్షేత్రాలు వంటివి అభివృద్ధి చేయబడుతున్నాయి. పవన శక్తిలో కఠినమైన వాతావరణ పరిస్థితులను తట్టుకునే టర్బైన్ల తయారీ, బలమైన గాలులు వీచే సముద్ర తీరాలలో పవన క్షేత్రాల ఏర్పాటు, పనితీరును మెరుగుపరచడానికి డేటా అనలిటిక్స్ వినియోగం వంటి ఆవిష్కరణలు జరుగుతున్నాయి. గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి, పునరుత్పాదక ఇంధనాన్ని ఉపయోగించి నీటిని విడగొట్టడం ద్వారా, ఉక్కు, రవాణా వంటి కష్టతరమైన రంగాలను డీకార్బనైజ్ చేయడానికి, భారతదేశ ఇంధన భద్రతను పెంచడానికి ఒక గొప్ప సామర్థ్యాన్ని కలిగి ఉంది. జాతీయ గ్రీన్ హైడ్రోజన్ మిషన్ 2030 నాటికి 5 మిలియన్ మెట్రిక్ టన్నుల ఉత్పత్తిని లక్ష్యంగా పెట్టుకుంది. ఖచ్చితమైన వ్యవసాయంలో పంటల పర్యవేక్షణ, పిచికారీ కోసం డ్రోన్లు, నేల ఆరోగ్యం కోసం సెన్సార్లు, వ్యక్తిగతీకరించిన సలహా కోసం ఫార్మోనాట్ సలహా వ్యవస్థలు ఉపయోగిస్తున్నారు. స్మార్ట్ సిటీలలో కృత్రిమ మేధ, ఇంటర్నెట్ ఆఫ్‌థింగ్స్ ఉపయోగించి విద్యుత్ పంపిణీని ఆప్టిమైజ్ చేయడం, ట్రాఫిక్‌ను సమర్థవంతంగా నిర్వహించడం, వ్యర్థాల సేకరణను క్రమబద్ధీకరించడం వంటివి జరుగుతున్నాయి. భారతదేశ స్మార్ట్ సిటీల మార్కెట్ 2025 నాటికి 100 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని అంచనా. ఈ సాంకేతిక పురోగతులు సుస్థిరమైన పరిష్కారాలను రూపొందించడంలో భారతదేశం పెరుగుతున్న సామర్థ్యాన్ని తెలియజేస్తాయి. సుస్థిరత్వం కేవలం సాంకేతికతకు మాత్రమే పరిమితం కాదు. సమాజం కూడా పర్యావరణ స్పృహతో ప్రవర్తించాల్సిన అవసరం ఉంది. గ్రీన్ క్రెడిట్ ఇనిషియేటివ్ వ్యక్తులు, సమాజాలు పర్యావరణ పరిరక్షణలో చురుకుగా పాల్గొనడానికి ప్రోత్సాహాన్నిస్తుంది. లైఫ్ స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ ఉద్యమం స్థిరమైన జీవనశైలిని ప్రోత్సహిస్తుంది. సిక్కిం ప్రపంచంలోనే మొట్టమొదటి పూర్తిగా సేంద్రియ రాష్ట్రంగా మారడం వంటి విజయవంతమైన సేంద్రియ వ్యవసాయ కార్యక్రమాలు సమాజం కృషికి నిదర్శనం. వ్యక్తులు, సమాజాలు చురుకుగా పర్యావరణ పరిరక్షణలో పాల్గొంటేనే దీర్ఘకాలిక విజయం సాధ్యమవుతుంది.

# సరస్వతీ నమస్తుభ్యం!

చదువుల తల్లి సరస్వతీ దేవి నేడు నది అంతర్వాహినిగా భక్తజనులందరికీ సాక్షాత్కరిస్తోంది. ప్రాచీన కాలంలోనే త్రివేణి సంగమంలో అంతర్లీనంగా ఉండిపోయిన సరస్వతీ నది ఈసారి పుష్కరాల రూపంగా మనకు కనిపిస్తుంది. ఏటా వసంత పంచమి రోజున సరస్వతీ దేవి సర్వజనుల పూజలందుకుంటుంది. సరస్వతీ నమస్తుభ్యమంటూ ప్రతి నిత్యం తెలుగునాట విద్యార్థిని విద్యార్థులు తొలి నమస్కారం ఆ ఆశ్రిత కల్పవల్లికే సమర్పించడం ఆనవాయితీ. మేధో వృద్ధి కోసం విద్యార్థులు, జ్ఞానసముపార్జన కోసం ఉపాధ్యాయులు జ్ఞానార్జన కోసం పండితులు, సృజనాత్మకత కోసం కళాకారులు ఆ దేవికే నిత్య పూజానివేదించడం తెలిసిందే. పురాణాల్లో గంగా, యమున, సరస్వతులకు నదీ స్థానం ఉంది. త్రివేణీ సంగమమనగానే ఆ మువ్వురి సంగమమే. గంగా యమున కలిసి పారినా సరస్వతీనది అంతర్లీనంగా ఉందని ప్రాచీన పురాణ సంపద నుంచి సేకరించిన వివరాలు ఆనోటా ఈనోటా జనశ్రుతిగా మారాయి. భారతీయ సంస్కృతిలో నదీస్నానమంటే ఎంతో పవిత్రమైన ఆచారం. నదీజలాలు మన శరీరాన్ని శుభ్రపరచి మనసును ప్రశాంతంగా ఉంచుతుందని నమ్ముతాం. ఇలా స్నానం చేసేటప్పుడు 'ఓం గంగేచ యమునేచైవ గోదావరి సరస్వతీ నర్మదే సింధు కావేరి జలేస్మిన్ సన్నిధమ్ కురు' అనే మంత్రాన్ని పఠిస్తారు. స్నానవిధి కూడా ప్రత్యేకంగా ఉంటుంది. ఈ కారణం చేతనే శాస్త్ర పెద్ద వయసు వాళ్లు పుష్కరాల సమయంలోనేకాకుండా, పుణ్య దినాల్లోనూ స్నానమాచరించి దీపం పెడతారు. పుణ్య ఫలం దక్కుతుందని ప్రతీతి. ఈమధ్య పై శ్లోకంలో ఉచ్ఛరించే సింధు, సరస్వతీ నదుల ప్రస్తావన దేశకాల మాన పరిస్థితుల కారణంగా విస్తృత ప్రచారంలోకి వచ్చాయి. ఒకటి దాయాది వివాదంలో మరొకటి పుష్కరాల సందర్భంగా. ఈ మధ్యనే మహాకుంభమేళా జరిగిన రోజుల్లో యమునా తీరాన ఉన్న సూక్ష్మదీర్ఘ కథాక్రమంలో దాదాపు నదుల ప్రస్తావన, చరిత్రల గురించి విశేషంగా తెలుసుకున్నాము. భారతీయ సంప్రదాయంలో పుష్కరాలకు ఎంతో విశిష్టత ఉంది. ప్రతి 12 సంవత్సరాలకు నదులన్నిటికీ పుష్కరాలువస్తాయి. పుష్కరుడు కొలువై ఉన్న సమయానికే పుణ్యదినాలుగా భావిస్తుంటాము. అందుకే ఆ రోజుల్లోనే భక్తులు నదీ స్నానమాచరించుటకు ఏర్పాట్లు చేస్తారు. ఈ తరుణంలో శరీర శుద్ధికే కాకుండా పితృదేవతల ఆశీస్సులకు, పాపప్రక్షాళనకు పుణ్యనదీస్నానం మంచిదని పురాణేతిహాసాల ప్రస్తావన. నదీ స్నానంతోపాటు తర్పణం, జపం, దానం తదితర పుణ్యకార్యాలు కూడా గతించిన వారికి శాశ్వత బ్రహ్మలోకం సంప్రాప్తిస్తుందన్నది భక్తుల విశ్వాసం. ఇప్పుడు చార్‌ధామ్ యాత్రలు, పుణ్యక్షేత్రాల సందర్శనలకు అంతిమంగా మోక్షమార్గాన్నే సూచిస్తాయి. బ్రహ్మ బృహస్పతికిచ్చిన వరం ప్రకారం బృహస్పతి మేషం నుండి మీనం వరకు ఒక్కోరాశిలోనూ పన్నెండు రోజులుంటారు. ఏడాది పొడవునా మధ్యాహ్నం రెండు ముహూర్తాల సమయం పుష్కరుడు బృహస్పతిలో కలిసి ఉంటాడు. ఆ సమయంలో నదీస్నానం చేయడం పుణ్యప్రదం. వేదాల్లో సరస్వతీ నదిని అత్యంత పవిత్రంగా భావిస్తారు. ఋగ్వేదం ఆమెను, అమ్బితమే, నదీతమే, దేవితమే' అని స్తుతిస్తుంది. అంటే తల్లులలో కెల్లా గొప్ప తల్లి, నదులలోకెల్లా అతి పవిత్రమైనది. దేవతలలో శ్రేష్ఠమైనది అని అర్థం. ఆమె జ్ఞానానికి, వివేకానికి ప్రతీక. విద్యాధిదేవత, సంగీతానికి అధిపతి, వాక్కును ప్రసాదించే వాగ్దేవి శక్తిగా పూజలందుకుంటుంది. 'పంచవింశ బ్రాహ్మణం' ప్రకారం సరస్వతీ నది మహాప్రబలమైన నది. విస్తృత భూగర్భాన్వేషణలు ప్రాతిపదికగా సరస్వతీ నది పెక్కుసార్లు తన ప్రవాహ దిశను మార్చుకుంది, క్రీ.పూ 1900ప్రాంతంలోపూర్తిగా ఎండిపోయిందని అంచనా. మహాభారత యుద్ధకాలం నాటికి శుష్కించి ఎడారిలో కలిసిపోయినట్టు పౌరాణికులు చెబుతారు. కేదారంవద్ద పశ్చిమదిశగా తిరిగి, భూగర్భంలో అంతర్వాహినిగా ప్రవహిస్తుంది. ఋగ్వేదంలోనూ, వేదాల్లోనూ ఇతిహాసాలకు పవిత్ర నదిగానున్న సరస్వతీదేవికి గురువారం నుంచి పుష్కర సమయం మొదలవుతుంది. దక్షిణ భారత దేశంలో తెలంగాణ ప్రాంతంలో గోదావరి, ప్రాణహిత నదులతోపాటు సరస్వతీ నది కూడా కాళేశ్వరం వద్ద కలుస్తుందని చరిత్రకారులు నిర్ధారించారు. దాంతో పుష్కరాలు విశేషంగా నిర్వహించడానికి వీలుగా తెలంగాణ ప్రభుత్వం సకల ఏర్పాట్లు చేస్తోంది. భక్తులు రావడం పుణ్యనదీస్నానాలు చేయడం, జపతప తర్పణాలు నిర్వహించడంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఏర్పాట్లు చేయడం, పుష్కరదినాల్లో సౌకర్యాల కల్పనలో సమయస్ఫూర్తితో సంయమనంతో వ్యవహరించే అధికారగణాన్ని నియమించాల్సిన బాధ్యత పాలకుల మీద ఉంది. ఎక్కడో ఏదో జరిగిందనకుండా, జరుగుతుందనేదే ఇక్కడ జరగకూడదని భక్తుల వినతి. మొన్నటి మహా కుంభమేళా, నిన్నటి సింహాచలం దుర్ఘటన, అటు మొన్నటి తిరుపతిలో తొక్కిసలాటలన్నీ నిర్వాహకులకు గుణపాఠాలు కావాలి. అక్కడి అనుభవాలతో మరో అవాంఛనీయాలను రానీయకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. కాళేశ్వరంలో నదీస్నాన ఘాటీల పొడవు పెంచి నూతన ఘాటీలను విస్తరించారు. దాదాపు రోజూ లక్ష మందికి పైగా జనం నదీస్నానాలకు వస్తారని అంచనాలున్నందున ఆలోచించారు. ప్రత్యామ్నాయ ఘాటీలు ఏర్పాటు చేయడమే కాదు సరస్వతీదేవి జ్ఞానదీపాలను ఇంటికి తీసుకెళ్లే మార్గం సుగమం చేయాలి.

మాట్లాడిన మాట, వదిలిన బాణం, జరిగినకాలం, వదులుకున్న అవకాశం, ఈ నాలుగు వెనక్కిరావు.



ప్లినీ

సంతృప్తే మనిషికి సహజమైన సంపద. భోగాలు, విలాసాలు కృత్రిమమైన దారిద్ర్యం వంటివి.



సోక్రటీస్

## ప్రజావాక్కు



### పాకిస్థాన్‌ను నమ్మకూడదు

అమెరికా చేస్తున్న భారత్ పాకిస్థాన్ల మధ్య సంధి ప్రయత్నాలు ఎందుకు అర్థం చేసుకోవాలి. అమెరికా పాక్‌తో వ్యాపారసంబంధాలు ఎప్పటినుండో కొనసాగుతున్నాయి. అవి దెబ్బతినకుండా ఉండటం కోసమే ఈ ప్రయోగాలు. 1947,1965, 1971, 1999 సంవత్సరాలలో పాక్ తో పూర్తిస్థాయి యుద్ధాలు జరిగి పాక్ కోలుకోలేని విధంగా దెబ్బతిన్నా దానికి బుద్ధి రాలేదు. దాని కూడా. భారత అధీన రేఖవద్ద 2016,2019లో పాక్ తీవ్ర ప్రతిఘటనను ఎదుర్కొనవలసి వచ్చింది. తివిరి ఇసుమున తైలంబు తీయవచ్చు కాని మూర్ఖుని మనసు రంజింప చేయలేమని కవులు ఏనాడో చెప్పారు. ప్రధాని మోడి పాక్‌ను ఏమని హెచ్చరిస్తున్నారంటే ఉగ్రవాదులను అప్పచెప్పమని, వారు ఆక్రమించిన కాశ్మీర్‌లోని భారత భూభాగాన్ని తమ అధీనంలోకి ఇవ్వాలని అన్నారు. ఈ మాట ప్రజలకు నచ్చినట్లు లేదు. నడుస్తున్న యుద్ధాన్ని పొడిగించి మన ప్రాంతాన్ని మనం తెచ్చుకోవడంలో తాత్సారం దేనికి?

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### మణుగూరు ప్యాసింజర్ మళ్లీ నడపాలి

కాజీపేట నుండి భద్రాచలం రోడ్డు వరకు, భద్రాచలం రోడ్డు నుండి కాజీపేట వరకు 158 కిలోమీటర్ల ప్రయాణం గతంలో నడిచిన మణుగూరు ప్యాసింజర్ రైలును తిరిగి పునః ప్రారంభించాలి. ఉమ్మడి వరంగల్ జిల్లా ఖమ్మం జిల్లా పరిధిలోని కాజీపేట, వరంగల్, నెక్కొండ, కేసముద్రం, మహబూబాబాద్, గార్ల, డోర్నకల్, కారేపల్లి, భద్రాచలం రోడ్డు, మణుగూరు, ప్రధాన రైల్వేస్టేషన్లతో పాటుగా హాల్టింగ్‌రైల్వే స్టేషన్లలో కూడా గ్రామీణ ప్రాంతాల ప్రయాణికులకు ఈ ప్యాసింజర్ రైలు అనుకూలంగా ఉంటుంది. కూలీలకు, విద్యార్థులకు, చిరు వ్యాపారులకు తక్కువ టికెట్ ధరతో పేద ప్రయాణికులకు అనుకూలంగా ఉంటుంది. గతంలో నడిచిన మణుగూరు ప్యాసింజర్ రైలు కరోనా వైరస్ కారణంగా నిలిపివేయడం జరిగింది. దాదాపు ఐదారేళ్లుగా అన్ని రైళ్లు పునః ప్రారంభించడం జరిగింది. కానీ ఈమణుగూరు ప్యాసింజర్ రైలును మాత్రం నిలిపివేయడం జరిగింది. ప్రయాణికుల అవసరాల నిమిత్తం రైల్వే అధికారులు తిరిగి పునః ప్రారంభించాలి.

-ఈదునూరి వెంకటేశ్వర్లు, నెక్కొండ, వరంగల్ జిల్లా

### రుణాలు మంజూరు చేయాలి

ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన రాజీవ్ యువవికాసం పథకం యువకులకు ఒకవెలుగు రేఖ గ్రామీణ ప్రాంత ప్రజలకు ఒకతారక ఒక్కొక్క కోటిమంది మహిళలకు రుణాలు మంజూరుచేస్తూ యువకులకు రుణాలు మంజూరుచేస్తూ రాష్ట్రం సిద్ధించిన జూన్ 2న కొత్త ప్రయాణంలోకి యువకులను తీసుకెళ్ళే ప్రయత్నం జరుగుతున్నది. యువకులకు వివిధ ఆదాయాల వ్యాపారాలకు అధిపతులు చేసే ప్రయత్నం ఈ పథకంద్వారాసాగుతుంది. దీనిప్రధాన ఉద్దేశం నిరుద్యోగాన్ని పెంచడం ద్వారా ఉత్పత్తికి అవకాశం కల్పించడమే.

-బి. అవినాష్, జనగామ

### ఆరోగ్యమే మహాభాగ్యం

ప్రపంచంలో ఊబకాయంతో బాధపడుతున్న వాళ్లు కోట్లల్లు. మనదేశంలో కూడా తక్కువేమీకాదు. ఈ ఒబెసిటీకి ప్రధాన కారణం వ్యాయామలేమి. జంక్‌ఫుడ్ ఎక్కువ తీసుకోవడం అని నిపుణులు చెబుతుంటారు. మంచి ఆరోగ్యం పొందాలంటే రోజు తిండి నిద్ర ముఖ్యంగా మానసిక ప్రశాంతత ఎంతో అవసరం. రోజుకు కనీసం పది నిమిషాలపాటు ధ్యానం చేయాలి. కష్టాలు కలతలు ఉండవని గ్రహించాలి. నీరు ఎక్కువగా తాగాలి. శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలి. పొగతాగడం, మందు వగైరాలకు వెంటనే స్వస్తిపలకాలి. అప్పుడు వృత్తిలో కూడా ఎదగడానికి ఆస్కారం ఎంతో ఉంది.

-ఆర్.వెంకటేష్ చరన్, బెంగళూరు

### అభివృద్ధి అంటే ఇదేనా?

అభివృద్ధి చెందుతున్న దేశంలో పరిశ్రమలు, వాహనాలు ఎక్కువ కావడంతో గాలి, నీరు కలుషితమై ప్రజలు అనేక వ్యాధులబారిన పడుతున్నారు. ఈ కలుషితమైన గాలిని పీల్చడం వల్లక్యాన్సర్ అనే భయంకరమైన వ్యాధి ప్రజలను పట్టి పీడిస్తోంది. జల కాలుష్యం వల్ల చాపమేస్తే సిక్క తాగడానికివీలుపడిపోతున్నారు ప్రజలు. ఈశుద్ధ తాగడం వల్ల ఆరోగ్యాలకి మందినికనీ తెలిసినా తప్పడం లేదు.

-కె. నాగేంద్ర, హైదరాబాద్

### ఆహార పదార్థాల కల్తీ

తెలుగు రాష్ట్రాలలో ఆహార పదార్థాల కల్తీ విపరీతంగా పెరిగిపోతూ వున్నది. ముఖ్యంగా హోటల్స్, బేకరీలు, స్వీట్ సెంటర్లలో ఎక్కువగా కల్తీపదార్థాలు విక్రయిస్తున్నారు. ఆహార పదార్థాలలో రుచి కోసం రంగులు కలపడం, మసాలాలు అధికంగా వాడటంవల్ల అవి తిన్నవారు మృత్యువాత పడుతున్నారు. అధికారుల తనిఖీలు లేకపోవడం వల్ల ఇవి జరుగుతున్నాయి.

-కె. సతీష్ రెడ్డి, భూపాలపల్లి జిల్లా

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపదలిచే రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరించగలరని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# దేశ రక్షణలో జవాన్, దేశ పోషణలో కిసాన్

**జి. అజయ్ కుమార్**

ఒకరిది భూమి కోసం సాహసం, మరొకరిది భూమితో సహవాసం.. సైనికుడు సరిహద్దుల్లో విపత్కర పరిస్థితుల్లో అయిన వారిని ఆత్మీయులను వదిలి శత్రువులపై నిరంతరం యుద్ధం చేస్తే రైతు పుడమి ఒడిలో ప్రకృతి ఒడిలో విత్తనానికి ఆకలిగాలతో స్వేదం విడిచి సాగు యుద్ధం సాగిస్తాడు. దేశానికి నిస్వార్థంగా సేవ చేసే ఈ ఇద్దరి ప్రస్థానం అందరికీ ఎంతో గర్వకారణం. ఇటీవల పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత సైన్యం ఆపరేషన్ సిందూర్ ద్వారా ఉగ్ర మూకలను మట్టుపెట్టింది. ఈ ఆపరేషన్‌లో మురళి నాయక్ లాంటి జవాన్లు ప్రాణాలను పణంగా పెట్టి, దేశభద్రత కోసం పోరాడిన విధానం చేసిన త్యాగం మాటల్లో చెప్పలేనిది. ఇలా ఎంతో మంది మహాత్మ సైనికులు కూడా యుద్ధ భూమిలో వారి తెగువను చూపిస్తున్నారు. వీరందరి ధైర్య సాహసాలు ఎందరికో స్ఫూర్తిదాయకం ఇలాంటి ఎన్నో సందర్భాల్లో, ఎంతో మంది ప్రాణాలు కోల్పోయినా కూడా దేశ రక్షణ కోసం ముందుండి నిలబడే ఒకే ఒక్కరు సైనికులు. సైనికుడి జీవితం త్యాగానికి, క్రమశిక్షణకు నిదర్శనం, ఇన్ని ఊరిని అయిన వారిని అందర్నీ వదిలేసి దేశ రక్షణకు ముందుండి. ఎండకు, వానకు, మంచుకు తట్టుకుని ఎన్ని కఠోర పరిస్థితులు వచ్చినా యుద్ధం వచ్చినా వెనక్కి తగ్గకుండా దేశపు ప్రతి అంగుళాన్ని కాపాడేందుకు నిద్రలేని రాత్రులు గడుపుతూ, దేశ భద్రత కోసం తన ప్రాణాన్ని తృణప్రాయంగా త్యాగం చేసే ధైర్య



వంతుడు జవాన్. రైతు దేశ ప్రజల కడుపు నింపే దేవుడు. అతని చేతుల్లోనే అందరి జీవితం, అతడు స్వేదం చిందించి సేద్యం చేస్తేనే అందరికి ఆహారం. వాతావరణ మార్పులు, ప్రకృతి వైపరీత్యాలు, పెరిగిన పెట్టుబడి ఖర్చులు, ధరల లేమి లాంటి ఎన్నో ఒడిదొడుకులను ఎదుర్కొంటూ, దేశానికి ఆహారాన్ని అందించేందుకు రైతు నిత్యం కృషి చేస్తాడు. అతని శ్రమకి వెలకట్టలేం. సైనికుడు లేకపోతే దేశం శత్రువుల ఆక్రమణలోకి వెళుతుంది. అన్నదాత లేకపోతే ప్రజలు ఆకలితో అలమటించాల్సి వస్తుంది. ఒకరు దేశానికి రక్షణ గోడగా నిలిస్తే, మరొకరు దేశానికి కావలసిన ఆహారాన్నిఅందిస్తారు. ఇద్దరూ దేశానికి వెలకట్టలేని సంపద వారిని గౌరవించుకోవడం, వారి పట్ల బాధ్యతగా ఉండడం అందరి కర్తవ్యం. దేశం వీరి మీద ఆధారపడినప్పుడు, దేశం కోసం వీరు ఎంతో చేస్తున్నప్పుడు, అందరూ కూడా వారి పట్ల బాధ్యతగా ఉండాలి. జవాన్లకు గౌరవం ఇవ్వడం, వారికి ఆర్థిక భరోసాను, భద్రతను కల్పించడం, వారి ఆస్తులకు రక్షణ కల్పించడం, వారి కుటుంబాలకు భరోసానివ్వడం, పింఛన్లు లాంటివి వారి త్యాగాలకు కొంతమేర అయినా ఊరటనిచ్చే కల్పిస్తాయి. రైతులను గౌరవించడం, వారికి ఆర్థిక భద్రత, పంటలకు మద్దతు ధరలు, రైతు బీమాలు, ప్రభుత్వ రాయితీలు కల్పించడం, రైతులకు పింఛన్లు ఇవ్వడం, రైతు కుటుంబాలకు భరోసా కల్పించడం వంటివి రైతుల ఆర్థిక అభివృద్ధికి దోహదం చేస్తాయి. ఇవన్నీ సమాజంగా, ప్రభుత్వంగా అందరూ కలసి చేయాల్సిన కనీస బాధ్యత.

# పాకిస్థాన్‌కు పక్కలో బల్లెంలా బలూచిస్థాన్

**డా: బుర్ర మధుసూదన్ రెడ్డి**

పాకిస్థాన్ నైరుతి ప్రాంతంలో అగ్రభాగమైన బలూచిస్థాన్ అనాదిగా పాక్ ప్రభుత్వానికి, పాక్ ఆర్మీకి కొరకరాని కొయ్యగానే మారుతూ వస్తున్నది. పాకిస్థాన్‌లో 44 శాతం భూభాగాన్ని కలిగిన బలూచిస్థాన్ ప్రాంతంలో ఖరీదైన ఖనిజ, గ్యాస్, ఇతర తీరప్రాంత విలువైన నిల్వలున్నాయి. దాదాపు 25కోట్ల పాకిస్థాన్ జనాభాలో దాదాపు 4 శాతంగా, అనగా 1.5 కోట్ల జనాభా ఉన్న బలూచిస్థాన్, 44 శాతం భూభాగాన్ని కలిగి ఉంది. ఈ ప్రాంత సహజ వనరులను యథేచ్ఛగా వాడుకుంటున్న పాకిస్థానీ ప్రభుత్వం తమ ప్రాంతానికి రాజకీయంగా ప్రాధాన్యం ఇవ్వకపోవడం, ఆర్థికంగా ఈ ప్రాంతం నుంచి లాభపడడం, సామాజికంగా పాక్ ఆర్మీ బలూచిస్థానీలను అణచి వేయడం జరిగిందని బిఎల్ఏ చెబుతున్నది. తమ ప్రాంతాన్ని 1948లో బలవంతంగా పాకిస్థాన్‌లో విలీనం చేసుకున్న నాటి నుంచి నేటి వరకు బలూచిస్థాన్‌కు తగిన ప్రాధాన్యం ఇవ్వకపోవడంతో తమ ప్రాంతం వెనకబడి పోయిందని, ఇక్కడ పేదరికం రాజ్యమేలుతోందని బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ (బిఎల్ఏ) తో పాటు ఇతర బలూచిస్థానీ సంస్థలు గత కొన్నేళ్లుగా స్వతంత్ర దేశం కావాలని పోరాడుతున్నది. గత కొన్నేళ్లుగా బలూచిస్థాన్‌పై మిలటరీ ఉక్కుపాదం మోపుతూ స్థానిక ప్రజలపై విపరీతమైన అణిచివేతను గురి చేశారని నేడు బిఎల్ఏ ఆవేశంతో ఆరోపిస్తున్నారు. గత కొన్నేళ్లుగా తమ ప్రాంతం కోసం పోరాటం చేస్తున్న విద్యార్థులు, యువత, జర్నలిస్టులు, రాజకీయ నాయకులను విపరీతంగాహింసిస్తూ పాక్ భద్రతాదళాలు చంపివేస్తూ బిఎల్ఏ స్వతంత్ర ఉద్యమాన్ని అదుపు చేయడానికి విపరీతమైన ప్రయత్నాలు చేస్తూ వస్తున్నది. ఎక్కడ దీర్ఘకాలం పాటు అణచి వేత ఉంటుందో అక్కడి బాధితులు ప్రజలు పిడికిలి బిగించి విప్లవ శంఖారావం పూరిస్తారని నేడు బిఎల్ఏ రుజువు చేస్తున్నది. ప్రస్తుతం భారత్ ప్రకటించిన ఆపరేషన్ సిందూర్‌తో పాక్ భద్రతా దళాలు మొత్తం ఇండియా సరిహద్దులపై తరలించడంతో బలూచిస్థాన్‌లో బిఎల్ఏ రెచ్చిపోయి పాక్ భద్రతా దళాలు, పోలీసులను తరిమి తరిమి కొట్టడం జరుగుతోంది. దీనికి తోడుగా బలూచిస్థాన్‌లో ప్రధాన నగరమైన క్వెట్టాను బిఎల్ఏ ఆక్రమించడం కూడా జరిగింది. బలూచిస్థాన్‌లోని విలువైన సహజ వనరులు కావాలి కాని బలూచిస్థాన్ అవసరం లేదు అన్నట్లుగా పాకిస్థానీ ప్రభుత్వాలు, భద్రతాదళాలు గత కొన్నేళ్లుగా ప్రవర్తిస్తూ వస్తున్నాయని బిఎల్ఏ ఆరోపిస్తున్నది. బలూచిస్థాన్ పక్షాన మాట్లాడిన ప్రతి ఒక్కరిని తీవ్రవాదులు లేదా 'విదేశీ ఏజెంట్లు'గా ముద్రవేసి శిక్షలు ఖరారు చేయడం, కాల్చి చంపడం, చిత్రహింసలు పెట్టడం కొనసాగుతున్నట్లు అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థలు సహితం పేర్కొంటున్నాయి. తాజాగా పాక్‌కు చెందిన పోలీస్ స్టేషన్లు, మిలటరీ క్యాంపులు లాంటి ముఖ్యమైన 39 వ్యూహాత్మక ప్రదేశాలపై



బిఎల్ఏ బాంబులతో దాడి చేసి నాశనం చేసినట్లు కూడా తెలుస్తున్నది. తమ ప్రాంతాన్ని స్వతంత్ర దేశంగా ప్రకటించాలని పోరాటం చేస్తూ, గాయాల పాలవుతూ, ప్రాణాలు కోల్పోతూ దీర్ఘకాలం నుంచి పోరాడుతున్న బిఎల్ఏకు నేడు ఆపరేషన్ సిందూర్ ఓ మంచి అవకాశాన్ని ఇచ్చినట్లు అయింది. దీనిని ఆసరాగా చేసుకొని పాక్ భద్రతాదళాలు ప్రభుత్వ యంత్రాంగాలపై దాడులు చేస్తూ ఆయా ప్రాంతాలను విజయవంతంగా తమ అధీనంలోకి తీసుకోవడం కొనసాగుతున్నది. గత కొన్ని రోజులుగా బలూచిస్థాన్ ప్రాంతంలోని పాక్ భద్రతాదళాల క్యాంపులు లేదా స్థావరాలు లక్ష్యంగా బిఎల్ఏ, ఇతర సాయుధ గ్రూపులు దాడులు చేస్తూ, సర్వనాశనం చేస్తూ ముందుకు సాగుతున్నాయి. తమ ప్రాంత వనరులను దోచుకుంటున్న పాకిస్థానీ ప్రభుత్వ యంత్రాంగాలపై బిఎల్ఏ దాడులను పెంచడం జరుగుతున్నది. బలూచిస్థాన్‌లో జరుగుతున్న ఆందోళనలకు కారణం కేవలం 1,500 మంది బలూచిస్థాన్ వాసులు మాత్రమే అని ఇస్లామాబాద్ ఆరోపిస్తున్నది. కొన్ని నెలలుగా 14 మంది పాకిస్థానీ భద్రతాదళాలను బిఎల్ఏ మట్టుబెట్టడం మనం చూశాం. బలూచిస్థాన్ అమూల్య సహజ వనరులపై కన్నేసిన పాకిస్థాన్ 1948లో తమ ప్రాంతానికి చెందిన కలాత్, ఖరన్, లాస్ బెల్, మక్రాన్, బలూచిస్థాన్ ఏజెన్సీ లాంటి పలు రాచరిక రాజ్యాలను తమలో విలీనం చేసుకున్నారని, తమ వనరులను వాడుకుంటూ తమ ప్రాంత అభివృద్ధిని విస్మరించిన పాక్ పాలకులకు ఎదురుగా బిఎల్ఏ లాంటి పలు విమోచన సంస్థలు అనాదిగా శాంతియుతంగా, సాయుధ దళాలుగా ఏర్పడి పోరాడుతూ వస్తున్నాయి. బలమైన పాకిస్థానీ మిలటరీ ముందు బిఎల్ఏ లాంటి సాయుధ సంస్థలు ఓడిపోతూ, తిరిగి పోరాడుతూ వస్తున్నారు. గత నాలుగు నెలలవరకు పాక్ ప్రభుత్వాలు ఈ ప్రాంతాన్ని విస్మరించడంతో తమ ప్రాంత స్వాతంత్ర్య కోసం పోరాటాలు క్రమంగా తీవ్రరూపం దాల్చడం జరిగింది. దీనికి తోడుగా నేడు పాకిస్థానీ మిలటరీతో పాటు చైనా నిర్మిస్తున్న బెల్ట్ అండ్ రోడ్డు ఇనిషియేటివ్ ద్వారా చైనాపాకిస్థాన్ ఎకనమిక్ కారిడార్ నిర్మాణం కూడా బిఎల్ఏ పోరాటానికి అడ్డురావడం జరిగింది. ఈ పోరాటాలను అదుపు చేయడానికి పాకిస్థాన్ వాడని పద్ధతి లేదు, చేయని మానవ హక్కుల ఉల్లంఘన లేదు. ఈ పోరాటంలో బలూచిస్థానీ సాయుధ మహిళలు కూడా నడుం బిగించడం వారి అణచివేతను రుజువు చేస్తున్నది. 2024లో బలూచిస్థానీ విమోచన పోరాటంలో పాక్ మిలటరీ చేతుల్లో 383 మంది ప్రాణాలు కోల్పోవడం జరిగింది. ఆపరేషన్ సిందూర్‌తో తట్టుకోలేకపోతున్న పాక్ భద్రతాదళాలు, మరో వైపు బిఎల్ఏ దెబ్బకు ముందు నుయ్యి వెనుక గొయ్యి చందంగా నలిగిపోతున్నది, నష్టపోతున్నది. బలూచిస్థాన్ ప్రాంత సమగ్రాభివృద్ధి, రాజకీయ ప్రాధాన్యం, తగు ఆర్థిక వనరుల కేటాయింపులు కావాలని కోరినప్పటికీ పాక్ పాలకులు పెడచెవిన పెట్టడం జరిగింది. తను తవ్వుకున్న గోతిలో తానే పడుతున్నట్లుగా నేడు పాకిస్థాన్ ఒక వైపు భారత దాడులను తట్టుకోలేక, మరో వైపు బిఎల్ఏ ఆక్రమణలను నిలువరించలేక, మరోవైపు ప్రజల వ్యతిరేకతను మూటకట్టుకుంటూ, మరోవైపు ఉగ్రమూకలను అదుపు చేయలేక చేతులెత్తేసిన కాల్పుల విరమణ అంటూ భారతమాత కాళ్ల బేరానికి రావడం, మళ్లీ కాల్పుల విరమణను ఉల్లంఘించి పాక్ దాడులు చేయడం, భారత సహనాన్ని పరీక్షించడం, ఎస్400తో పాటు బ్రహ్మోస్ ప్రతాపాలను రుచి చూడడం, ఓటమిని అంగీకరించకనే ఒప్పుకున్నట్లు అవుతున్నది.

# యుపిలో ఆరో సెమికండక్టర్ యూనిట్


## రూ.3706 కోట్లతో ఏర్పాటు, నెలకు 3.6 కోట్ల చిప్‌ల ఉత్పత్తిసామర్థ్యం

### కేబినెట్ భేటీ వివరాలను వెల్లడించిన కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్



**న్యూఢిల్లీ, మే 14:** మన దేశంలో సెమీ కండక్టర్ల రంగాన్ని మరింత ప్రోత్సహించాలని కేంద్ర కేబినెట్ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. ఇందుకోసం ఉత్తరప్రదేశ్‌లో రూ.3,706 కోట్లతో 6వ సెమీ కండక్టర్ యూనిట్ ఏర్పాటుకు కేంద్రం ఆమోదం తెలిపినట్లు చెప్పారు. ఈ యూనిట్ ఏర్పాటుతో రెండు వేల మందికిపైగా ఉపాధి లభించనున్నట్లు కేంద్రమంత్రి తెలిపారు. సెమీ కండక్టర్ల యూనిట్‌లో నెలకు 3.6 కోట్ల చిప్‌ల ఉత్పత్తి జరుగుతుందని అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు. అంతేకాకుండా 270 వర్సిటీల్లో విద్యార్థులకు సెమీ కండక్టర్ల సాంకేతికతపై శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం సెమీ కండక్టర్ల సాంకేతికతపై 70 స్టార్టప్‌లు పనిచేస్తున్నాయని ఆయన అన్నారు. అంతేకాదు పరిశ్రమల అవసరాల మేరకు విద్యార్థులు సన్నద్ధం అవుతున్నారని అశ్వినీ వైష్ణవ్ వివరించారు. కొత్త విద్యా విధానంద్వారా అకడమిక్ విద్యను, పరిశ్రమలను అనుసంధానం చేయనున్నట్లు మంత్రి తెలిపారు. టెలికామ్ విభాగం కోసం యూనివర్సిటీల్లో 5జీ ల్యాబ్‌లు, సెంటర్ ఆఫ్‌ఎక్సలెన్స్, ఇన్‌క్యూబేటర్ల ఏర్పాటు జరుగుతోందన్నారు. సెమీ కండక్టర్ల పరికరాలు కూడా భారత్‌లో తయారీకి కృషి చేస్తున్నామని కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. విద్యాసంస్థల్లో సెమీకండక్టర్ల సాంకేతికతపై శిక్షణ ఇస్తున్నాం. ఫలితంగా ఇప్పటికే కొందరు విద్యార్థులు చిప్‌లను రూపొందించారు. అందులో 20 చిప్‌లను నిపుణులు, ఇంజినీర్లు ఎంపిక చేశారు. వాటిని మొహాలీలోని సెమీకండక్టర్ ల్యాబ్‌లో ఉత్పత్తి చేశారు. ఇది గణనీయమైన మార్పు. గతంలోని విద్యార్థులు పుస్తకాలల్లో మాత్రమే ఇలాంటివి అధ్యయనం చేసేవారు. ప్రస్తుతం వారు వాస్తవ సాధనాలు, పరికరాలతో పనిచేస్తున్నారు. జాతీయ విద్యా విధానంద్వారా పరిశ్రమలను, విద్యను అనుసంధానించాలనేది ప్రధాని నరేంద్ర మోడీ దార్శనికత. యూపీలోని జెవార్ విమానాశ్రయానికి సమీపంలో హెచ్‌సిఎల్, ఫాక్స్‌కాన్‌లు జాయింట్ వెంచర్‌గా ఈ సెమీకండక్టర్ యూనిట్‌ను ఏర్పాటు చేయనున్నాయి. 2027లో ఇక్కడ ఉత్పత్తి ప్రారంభించనున్నాయి. హార్డ్‌వేర్ అభివృద్ధి, తయారీలో హెచ్‌సిఎల్‌కు సుదీర్ఘ చరిత్ర ఉంది. ఎలక్ట్రానిక్స్ తయారీలో ఫాక్స్‌కాన్‌కు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉంది. ఈ రెండూ కలిసి యమునా ఎక్స్‌ప్రెస్‌వే ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ అథారిటీలోని జెవార్ విమానాశ్రయం సమీపంలో సెమీకండక్టర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తాయి. ఈ యూనిట్ నెలకు 20,000 వేఫర్‌ల సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది.

ఇది నెలకు 36 మిలియన్ల (3.6 కోట్ల) చిప్‌లను తయారు చేయగలుగుతుందని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు. ఈ జెవార్ ప్లాంట్‌లో ఉత్పత్తి చేసిన చిప్‌లను మొబైల్ ఫోన్స్, ల్యాప్‌టాప్స్, ఆటోమొబైల్స్, పిసిలు మొదలైన వాటిలో ఉపయోగిస్తారు. వాస్తవానికి భారత్‌లో సెమీకండక్టర్ పరిశ్రమ ఇప్పటికీ ప్రారంభదశలోనే ఉంది. దీనిని ఇంకా విస్తరించాల్సిన అవసరం ఉంది. కొవిడ్ సమయంలో చిప్‌ల కొరత ఏర్పడింది. దీనితో జాతీయ భద్రత సహా, స్వదేశీ ఆవిష్కరణల కోసం దేశీయంగా సెమీకండక్టర్ల తయారీ ప్రాముఖ్యతను ప్రభుత్వం గుర్తించింది. అందుకే ఆ లోటును పూడ్చడానికి కృషిచేస్తోంది. ప్రస్తుతం 60శాతం సెమికండక్టర్లపరికరాలను అమెరికా కంపెనీలే ఉత్పత్తి చేస్తున్నాయి. ఈ సాంకేతికతపై దాదాపు 70 స్టార్టప్‌లు పని చేస్తున్నట్లు కేంద్ర మంత్రి వివరించారు. కొత్త విద్యావిధానంలో అకడమిక్ విద్య, పరిశ్రమల అనుసంధానానికి అవకాశాలు ఎక్కువన్నారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థులు తయారవుతున్నారన్నారు. 270 విద్యాసంస్థల్లో విద్యార్థులకు సెమికండక్టర్ల సాంకేతికతపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులురఊపొందించిన చిప్‌లను మొహాలిలో ఉత్పత్తిచేసారని, వాటితయారీలో గణనీయమైన మార్పులు వచ్చాయన్నారు.టెలికాం విభాగంకోసం యూనివర్సిటీలో 5జి ల్యాబ్‌లు ఏర్పాటుచేస్తున్నామన్నారు. ప్రస్తుతం యూనివర్సిటీల్లో ఇంక్యుబేటర్ల ఏర్పాటు జరుగుతోందన్నారు.



# రాష్ట్రపతిని కలిసిన త్రివిధ దళాధిపతులు

## ఆపరేషన్ సిందూర్‌పై సమగ్ర నివేదిక

**న్యూఢిల్లీ, మే 14:** పహల్గాంవ్ దాడి తర్వాత భారత త్రివిధ దళాలు చేపట్టిన ఆపరేషన్ సింధూర్ కార్యాచరణను రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు త్రివిధ దళాధిపతులు వివరించారు. బుధవారం త్రివిధ దళాల అధిపతులతోపాటు చీఫ్‌ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ రాష్ట్రపతి ద్రౌపది ముర్మును మర్యాదపూర్వకంగా కలిసి మొత్తం నివేదిక ఇచ్చారు. ఆపరేషన్ సింధూర్ అమలు, పహల్గాం ఉగ్రదాడికి భారత్ ఆర్మీ స్పందించిన విధానం, జమ్ము కాశ్మీర్ దాడులపైనా త్రివిధ దళాలు స్పందించిన తీరును రాష్ట్రపతికి వివరించారు.

సిడిఎస్ జనరల్ అనిల్‌చౌహాన్ తోపాటు ఆర్మీస్టాఫ్ చీఫ్ ఉపేంద్ర ద్వివేది, ఎయిర్‌చీఫ్ మార్షల్ ఎపిసింగ్, అడ్మిరల్ దినేష్ కె త్రిపాఠిలు రాష్ట్రపతిని కలిసి సమగ్ర వివరణ ఇచ్చారు. త్రివిధ దళాలు సమన్వయంతో ఆపరేషన్ సింధూర్ నిర్వహించామని, పాకిస్తాన్‌లోను, పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోను ఉన్న ఉగ్రస్థావరాలను ధ్వంసంచేసినట్లు వివరించారు. సరిహద్దు ఉగ్రవాదం అంతంచేసేందుకు ముందు వాటి మౌలికవనరులను ధ్వంసంచేసే లక్ష్యంతోనే దాడులు చేసామన్నారు. ఆపరేషన్ సింధూర్‌లో భారత దళాలు అనితర సాధ్యమైన పనితీరును చూపించాయని, వృత్తినైపుణ్యం, ధైర్యసాహసాలు, మెరుపు దాడులు చేసి భారత ప్రతిష్టను మరింత ఇనుమండిపచేసారని సరిహద్దుల భద్రతలో త్రివిధ దళాల పాత్ర అమోఘమని ప్రశంసించారు.


తెలంగాణ ప్రభుత్వం
పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం
జిల్లా పంచాయత్ ఇంజనీర్ కార్యాలయం PIU డివిజన్ వికారాబాద్
ఇ-మెయిల్ : eeprvkb@yahoo.co.in, కాంట్రాక్ట్ నం. 9177539599
సంక్షిప్త టెండర్ ప్రకటన నం: T1/7-9/2025-26, తేది: 14.05.2025
పనుల యొక్క సంఖ్య (3) వికారాబాద్ డివిజన్ పని. మొత్తం అంచనా ధర రూ.22.50 లక్షలు. షెడ్యూల్స్ జారీ ప్రారంభ తేదీ: 14.05.2025 నుండి ముగింపు తేదీ: 21.05.2025, మ.3.00గం.కు. తదుపరి వివరాలు జిల్లా పంచాయతీరాజ్ PIU డివిజన్ వికారాబాద్ నుండి పొందవచ్చును.
సం/-. జిల్లా పంచాయత్‌రాజ్ ఇంజనీర్, PIU డివిజన్, వికారాబాద్.
DIPR.NO. 1863-PP/CL/ADVT/1/2025-26 తేదీ: 14.05.2025



राष्ट्रीय सहकारी विकास निगम
NCDC
Assisting Cooperatives. Always!
International Year of Cooperatives 2025
నేషనల్ కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఈ క్రింది దాని కొరకు టెండర్ ఆహ్వానిస్తోంది
సహకార్ టాక్సీ ప్రోజెక్ట్‌కు ఆన్‌లైన్ క్యాబ్ అగ్రిగేషన్ సొల్యూషన్ యొక్క డిజైన్, అభివృద్ధి, ఆచరణ మరియు నిర్వహణ నిమిత్తం సాంకేతిక భాగస్వామి యొక్క ఆన్‌బోర్డింగ్
ప్రి బిడ్ సమావేశం : 23 మే 2025 దాఖలు యొక్క చివరి తేది : 25 జూన్ 2025
మరిన్ని ఎక్కువ వివరాలకు : https://ncdc.in వీక్షించండి



తెలంగాణ ప్రభుత్వం
మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయం, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా
ఆసక్తి యొక్క వ్యక్తీకరణ (EOI)
Lr.No.MCB/E1/RDP/2025-26, తేది: 13.05.2025
బోడుప్పల్ మునిసిపల్ కార్పొరేషన్ వ్యక్తిగత కన్సల్టెంట్‌లు/ఏజెన్సీలు/సంస్థలు నుండి ఈ మునిసిపల్ కార్పొరేషన్‌లో ప్రతిపాదిత రోడ్‌లకు రోడ్ అభివృద్ధి ప్లాన్లు (RDPs) యొక్క తయారీకి ప్రతిపాదన నిమిత్తం ఆసక్తి వ్యక్తీకరణ కోరుతోంది. ఆసక్తి గల పార్టీలు అటువంటి స్వభావ తరహాలో అనుభవం గలవారు. 1) కవరింగ్ లెటర్. 2) ఏ ప్రభుత్వ సంస్థలో అయినా జాబితాలో ఉన్న కన్సల్టెంట్‌లు/ఏజెన్సీలు/సంస్థలు అయి ఉండవలెను. (రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్). 3) పాన్ కార్డ్ మరియు తాజా IT రిటర్న్‌లు. 4) తాజా GST రిటర్న్‌లు. 5) ఇదే తరహా స్వభావం గల పని అనుభవం (కనీసం 50 కిమీలు యొక్క పొడవుతో ఏ ప్రభుత్వ సంస్థలో అయినా పని చేసి ఉండవలెను. 6) టెక్నికల్ బిడ్‌లో అర్హత పొందిన ఏజెన్సీ, వాటి ఫైనాన్షియల్ ప్రతిపాదన మాత్రమే తెరువవచ్చును. 7) టెండర్ ప్రతిపాదనకు అర్హత పొందటానికి, ఫైనాన్షియల్ ప్రతిపాదనను ప్రత్యేక వేరు ఎన్వలప్ కవర్‌లో దాఖలు చేయవలెను. కన్సల్టెంట్‌లు/సంస్థలు వారి అనుభవానికి సంబంధించిన డాక్యుమెంట్‌లు మరియు అన్ని ఇతర డాక్యుమెంట్‌లను బోడుప్పల్ మునిసిపల్ కార్పొరేషన్, మునిసిపల్ కమిషనర్ పేరిట తీసిన నాన్ రిఫండబుల్ రూ.2,000 (రెండు వేల రూపాయలు మాత్రమే) DD రూపంతోసహా 19.05.2025న లేదా ముందు మ.12.00 గం. వద్ద దాఖలు చేయవలెను. వాటినా అదే రోజున మ.03.00 గం.లకు తెరువబడును. ఆసక్తి గల పార్టీలకు సవివర నిబంధనల యొక్క రిఫరెన్స్ మరియు ఫైనాన్షియల్ బిడ్ నమూనాను వారి అభ్యర్థనపై ఇవ్వబడును. తదుపరి వివరాలకు కార్యాలయ వేళలలో మునిసిపల్ కమిషనర్‌ను సంప్రదించవచ్చును.
సం/- మునిసిపల్ కమిషనర్, బోడుప్పల్ మునిసిపల్ కార్పొరేషన్
DIPR.No.1829-PP/CL/Advt/1/2025-26, తేది: 14.05.2025



భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్
(భారత ప్రభుత్వ రంగ సంస్థ)
రామచంద్రాపురం, హైదరాబాద్ - 502032
మానవ వనరుల నిర్వహణ
ప్రకటన నం. : PTMC/2025/02
BHEL, HPEP, హైదరాబాద్ వారు అర్హులైన అభ్యర్థుల నుండి పార్ట్ టైమ్ మెడికల్ కన్సల్టెంట్‌లు (PTMC), సూపర్ స్పెషలిస్ట్‌లు (న్యూరాలజీ, ఆన్‌కాలజీ, కార్డియాలజీ, గ్యాస్ట్రోఎన్‌టిరాలజీ, నెఫ్రాలజీ) స్పెషలిస్ట్‌లు (ఆప్తమాలజీ, పెడియాట్రిక్స్, రేడియాలజీ, సర్జరీ) మరియు MBBS (ఒక సంవత్సరం అనుభవంతో)గా నియమించబడటానికి దరఖాస్తులు కోరబడుతున్నారు. ఈ నియామకం పూర్తిగా తాత్కాలిక ప్రాతిపదికపై ఒక సంవత్సర కాలానికి. (ఆవశ్యకత మరియు పని సామర్థ్యంపై ఆధారపడి విస్తరింపబడుతుంది) స్థానాన్నిబట్టి వేతనం ఒక్కొక్క గంట ప్రాతిపదికన ఉంటుంది. ఆసక్తి గల మరియు అర్హత గల అభ్యర్థులు మా వెబ్‌సైట్స్ https://hpep.bhel.com మరియు https://careers.bhel.in పై అందుబాటులో ఉన్న సవివర ప్రకటనను దరఖాస్తు ఫారం యొక్క దాఖలు మరియు ఇతర వివరాలకు సంబంధించి సంప్రదించవచ్చును.




# తుర్కియే పాక్ దోస్తీ జిందాబాద్

## ఆదేశ అధ్యక్షుడు ఎర్డొగాన్ వింత వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ, మే 14:** కాల్పులసమయంలో పాకిస్థాన్‌కు సాయం అందించిన తుర్కియేకు పాక్‌ప్రధాని షెహబాజ్‌షరీఫ్ ఆదేశ ప్రధానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈక్రమంలోనే షరీఫ్‌ను ఆదేశ అధ్యక్షుడు ఎర్డొగాన్ అభినందించారు. అంతేకాకుండా పాకిస్థాన్ మాకు నిజమైన మిత్రదేశం అన్నారు.

గతంలోలాగా భవిష్యత్తు లోనూ అండగా ఉంటామన్నారు. పాక్‌ప్రధానిని విలువైన మిత్రుడిగా ఎర్డొగాన్ అభివర్ణించారు. నావిలువైన మిత్రుడు షెహబాజ్ షరీఫ్, తుర్కియే పాకిస్థాన్‌లమధ్య సోదరభావం అనేది నిజమైన స్నేహానికి నిదర్శనం. ప్రపంచంలో కొన్నిదేశాలు మాత్రమే దీన్ని కొనసాగిస్తాయి.

తుర్కియలోలాగే పాకిస్థాన్‌లో శాంతి, సుస్థిరతను కోరుతున్నాం. వివాదాల పరిష్కా రంలో చర్చలు, రాజీకి ప్రాధాన్యం ఇస్తున్న పాక్‌ప్రభుత్వ విధానం అభినందనీయం అన్నారు. గతంలో మంచి, చెడు సమయాల్లోలాగే భవిష్యత్తులోనూ పాక్‌కు అండగా నిలుస్తామని పాకిస్థాన్ తుర్కియే దోస్తీ జిందాబాద్ అని ఆదేశ అధ్యక్షుడు ఎర్డొగాన్ వ్యాఖ్యలు చేసారు. ఆపరేషన్ సింధూర్‌ను భారత్ చేపట్టి పాక్‌పైమూకుమ్మడి దాడులు చేయగా పాకిస్థాన్‌కు ఆయుధ సాయంచేసి తుర్కియే అండగా నిలిచింది.

డ్రోన్లతో సహా యుద్ధనౌకను కూడా పంపించింది. వీటితోపాటు సైనికసాయం కూడా అందించింది. ఇలా శత్రుదేశానికిసాయంచేస్తున్న తుర్కియేపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతోంది. పలు ట్రావెల్ ఏజెన్సీలు ఆదేశానికి బుకింగ్‌లు నిలిపివేయగా అక్కడి యాపిల్ దిగుమతులను కూడా పూణె వ్యాపారులు బహిష్కరించారు.

# బిఎస్ఎఫ్ జవాన్‌ను భారత్‌కు అప్పగించిన పాక్ ఆర్మీ



**న్యూఢిల్లీ, మే 14:** అనుకోకుండా భారత సరిహద్దు దాటి పాక్‌వైపునకువెళ్లి అక్కడి సైన్యం అదుపులో ఉన్న బిఎస్ఎఫ్ జవానును ఎట్టకేలకు పాక్ ఆర్మీ విడుదలచేసింది. నిర్ణీత సాంప్రదాయాలను అనుసరించి భారత జవానను సరిహద్దుల్లో భారత్ దళాలకు అప్పగించారు. ఉదయం 10.30 గంటలకు బిఎస్ఎఫ్ కానిస్టేబుల్ పూర్ణమ్ కుమార్‌షాను పాకిస్థాన్ ఆర్మీ ఆట్టారి వాఘా సరిహద్దువద్ద అప్పగించిందని బిఎస్ఎఫ్ వెల్లడించింది. విధినిర్వహణలో ఉండగానే కొందరు రైతులతో కలిసి అనుకోకుండా ఫిరోజ్‌పూర్ సెక్టార్‌లో గతనెల 23న సరిహద్దు దాటి ఆవలికి వెళ్లిపోయాడు. ఉదయం 11.50 గంటలకు జరిగిన ఈ సంఘటనతో రేంజర్స్ వెంటనే ఆతడిని అదుపులోనికి తీసుకుని ఆచూకీ కూడా తెలియనీయకుండా దాచిపెట్టారు. అప్పటినుంచి భారత్‌ఆర్మీ ఫ్లాగ్‌మార్చ్‌చేసి బిఎస్ఎఫ్ జవానును అప్పగించాలని శతవిధాలా ప్రయత్నాలుచేస్తూనే వచ్చింది. చివరకు పాక్ ఆర్మీ జవానును అప్పగించింది. పంజాబ్ ఫ్రాంటియర్ బిఎస్ఎఫ్ ఐజి అతుల్ ఫుల్జేలే మాట్లాడుతూ జవాను అప్పగింత సామరస్యపూర్వకంగా పూర్తి అయిందని అన్నారు. 40 ఏళ్ల పూర్ణమ్‌షా సరిహద్దుదాటి పోవడంతో రేంజర్స్ వెంటనే అదుపులోకి తీసుకున్నారు. సరిగ్గా పహల్గాంవ్‌లో జరిగిన ఉగ్రదాడిలో 26 మందిపర్యాటకులు మృతిచెందిన మరుసటిరోజే ఈ సంఘటన జరిగింది. పశ్చిమబెంగాల్‌లోని హుగ్లీ ప్రాంతానికి చెందిన షా జల్లోక్ సరిహద్దులో కిసాన్‌గార్డ్ డ్యూటీలో ఉన్నాడు. బిఎస్ఎఫ్ 182 బెటాలియన్ ఆతడిని ఈప్రాంతంలో డిప్యూటేషన్‌పై నియమించింది. ఆ తర్వాతకొన్ని రోజులముందే మరోప్రాంతానికి తరలించింది. జవాన్‌నురెజిమెంట్‌లోని అడ్వాన్స్ టీమ్‌లో ఉంచింది. అయితే జవానుకు ఆ ప్రాంతంపై పూర్తి అవగాహన లేకపోవడంవల్లనే సరిహద్దును దాటి పాక్‌వైపునకు వెళ్లిపోయాడని బిఎస్ఎఫ్ చెపుతోంది. కేంద్ర ప్రభుత్వం, బిఎస్ఎఫ్ హైకమాండ్ ఆతడిని వెనక్కి తీసుకువచ్చేందుకు కృషిచేయడంపై ధన్యవాదాలు తెలిపారు.

గడచిన రెండు వారాలు మాకుటుంబం అంతా నిద్రలేని రాత్రులుగడిపామని, మా పూర్ణం శ్రేయస్సు కోసం భగవంతునికి ప్రార్థనలుచేసామని, ఆ దేవుడు మా ప్రార్థనలను ఆలకించాడని కుటుంబ సభ్యులు తెలిపారు. భారత్ పాకిస్తాన్ కాల్పుల విరమణ తర్వాతనే పూర్ణమ్‌షా భారత్‌కు తిరిగిరావడం భారత సంప్రదింపుల శక్తిసామర్థ్యాలకు నిదర్శనంగా నిలిచింది.

## రాఫెల్ విమానాలే నడుపుతుంటే

# మహిళలపై ఎందుకు వివక్ష?

### కేంద్రంపై సుప్రీం అసహనం



**న్యూఢిల్లీ, మే 14:** ఇండియన్ ఆర్మీలోని జడ్జి అడ్వొకేట్ జనరల్ (లీగల్) బ్రాంచీ పోస్టుల్లో మహిళా అధికారులు తక్కువగా ఉండటంపై సుప్రీంకోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. ఆ పోస్టులకు స్త్రీపురుష నిష్పత్తి వర్తించదని నిబంధన ఉన్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం దీనిని ఎందుకు అనుసరించడం లేదని అడిగింది. రఫేల్ లాంటి అత్యాధునిక యుద్ధ విమానాలనే అమ్మాయిలు నడుపుతున్నప్పుడు, మరి వారికి లీగల్ పోస్టులను ఎందుకు ఇవ్వడం లేదని కేంద్రాన్ని సూటిగా ప్రశ్నించింది. భారత సైన్యంలోని జడ్జి అడ్వొకేట్ జనరల్ లీగల్ పోస్టుల కోసం ఇటీవల నిర్వహించిన పరీక్షల్లో అర్షునూర్ కౌర్, ఆస్థ త్యాగి అనే ఇద్దరు మహిళా అధికారులు వరుసగా 4, 5వ ర్యాంకులు సాధించారు. అయినప్పటికీ వారిని విధుల్లోకి తీసుకోలేదు. దీనితో వాళ్లిద్దరూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. పురుష అభ్యర్థులకన్నా తమకు మెరిట్ ఎక్కువగాఉన్నా, మహిళల కోటాల్లో ఖాళీలు లేవంటూ తమను ఎంపిక చేయలేదని ఆవేదన వ్యక్తంచేశారు. అయితేమొత్తం 6 పోస్టులు మాత్రమే ఉన్నాయని, అందులో మహిళలకు 3 పోస్టులు మాత్రమే కేటాయించామని, అందుకే మెరిట్ ఉన్నప్పటికీ తమను ఎంపిక చేయలేదని ఉన్నతాధికారులు చెప్పారని వారిద్దరూ అన్నారు. వీరి పిటిషన్‌పై జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ మన్మోహన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం కీలక వ్యాఖ్యలుచేసింది. భారత వాయుసేనలో మహిళలురఫేల్ యుద్ధ విమానాలను నడిపేందుకు అనుమతి ఉన్నప్పుడు, ఇండియన్ ఆర్మీలోని లీగల్ బ్రాంచీల్లో పురుషుల కంటే మహిళలను ఎక్కువసంఖ్యలో విధుల్లోకి తీసుకోవడంలో కష్టం ఏముంది? స్త్రీపురుష భేదంతోసంబంధం లేకుండా అవితటస్థ పోస్టులను కేంద్రం చెబుతోంది. అలాంటప్పుడు మెరిట్ సాధించిన మహిళలకు ఎందుకు పోస్టులను కేటాయించడం లేదు? స్త్రీపురుష సమానత్వం అంటే మహిళలకు, పురుషులకుసమాన అవకాశాలుకల్పించడంకాదు. అబ్బాయిలైనా, అమ్మాయిలైనా అర్హత ఉంటే అవకాశం ఇవ్వడమే" అని సుప్రీం బెంచ్ వ్యాఖ్యానించింది. అనంతరం దీనిపై తీర్పును రిజర్వ్ చేసింది.

# నిఘా ఉపగ్రహ ప్రయోగానికి సిద్ధమైన షార్

## ఇప్పటికే షార్‌ను చేరుకున్న ఇఒఎస్-9 ఉపగ్రహం

### పిఎస్ఎల్‌వి-సి61 నిర్మాణం చకచకా: ఇస్రో ఛైర్మన్ వి. నారాయణన్

**శ్రీహరికోట (తడ), మే 14 ప్రభాతవార్త:** భారతదేశ భద్రతే లక్ష్యంగా ఇస్రో మరో ఉపగ్రహ ప్రయోగానికి సిద్ధమవుతోంది. ఈ నెల 18న తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని సతీష్‌ధవన్ అంతరిక్ష కేంద్రం మొదటి ప్రయోగ వేదిక నుంచి ఇఒఎస్-09 ఉపగ్రహాన్ని ప్రయోగించేందుకు శాస్త్రవేత్తలు సిద్ధమయ్యారు. భారత్‌కు ఎంతో పేరుప్రఖ్యాతులు తీసుకొచ్చిన పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికల్ (పిఎస్ఎల్‌వి) ద్వారా ఈ ఉప గ్రహ ప్రయోగం జరుపుతున్నారు. పిఎస్ ఎల్‌వి-సి61 పేరుతో రాకెట్‌ను నాలుగు దశలుగా నిర్మించారు. గత ఏడాది చివరలో పిఎస్ ఎల్‌వి-సి60 రాకెట్ ప్రయోగం జరిగిన తర్వాత ఇన్నాళ్లకు మరో పిఎస్ఎల్‌వి రాకెట్ షార్ నుంచి ఎగరనుంది. మధ్యలో ఇస్రో 100వ రాకెట్ జిఎస్ఎల్‌వి-ఎఫ్15ను ప్రయోగించి ఉన్నారు. ఇదిలావుంటే సరిహద్దుల్లో ఇటీవల నెలకొన్న కొన్ని ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ఇస్రో ఈ నిఘా ఉపగ్రహం అవసరాన్ని గుర్తించి చకచకా ఏర్పాట్లతో ప్రయోగం చేసేందుకు సిద్ధమైంది. ఇప్పటికే ఉపగ్రహం శ్రీహరికోటను చేరింది. ఇక్కడ ఉన్న అన్ని రాకెట్ నిర్మాణ దశల సౌక ర్యాలను ఉపయోగించుకుని పిఎస్ఎల్‌వి-సి61ని నిర్మాణపరంగా పనులు పూర్తిచేశారు. ఈ ఉప గ్రహ లక్ష్యం ఏదైనప్పటికీ ప్రస్తుతం అవసరమైన ఉపగ్రహం. దీనికి తగ్గట్లే ఇస్రో ఛైర్మన్ వి.నారా యణన్ ఇటీవల ఒక కార్యక్రమంలో మాట్లా డుతూ ఇస్రో ప్రయోగాల వలన దేశానికి రక్షణ సేవలు కూడా అందుతున్నాయని ప్రకటించి ఉన్నారు. ఇప్పటికే పది ఉపగ్రహాలు అంతరిక్షం నుంచి తమ పని తాము చేసుకుపోతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం ఇఒఎస్-09 పేరుతో ప్రయోగిస్తున్న భూపరిశీలన ఉపగ్రహం కూడా అత్యంత శక్తివంతంగా సరిహద్దు ప్రాంతాలను, అందులో ఉగ్రవాద కదలికలను పసిగట్టే సామర్థ్యం కలిగిఉందని ఇస్రో వర్గాలు పేర్కొంటున్నాయి. వచ్చే ఐదేళ్లలో కనీసం 52 నిఘా ఉపగ్రహాలను భూకక్ష్యలోకి ప్రవేశపెట్టి భారతీయ రక్షణ రంగానికి విలువైన సేవలు అందిస్తామని కూడా ఇస్రో వర్గాలు తెలిపి ఉన్నాయి. ఈ ఉపగ్రహాలు శత్రువుల పనితీరును పసిగట్టేందుకు సరిహద్దులను పర్యవేక్షించేందుకు సైనిక కార్యకలాపాల సమయంలో త్రివిధ దళాలకు సాయపడేందుకు ఉపయోగపడతాయని ఇస్రో వర్గాల నుంచి సమాచారం. అందుకే ప్రస్తుతం ఉపగ్రహ ప్రయోగంపై దేశం మొత్తం ఆసక్తిగా ఎదురు చూస్తోంది. మరో వైపు షార్‌లో భద్రత ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. ఇటీవల సిఐఎస్ఎఫ్ దళాలు, స్థానిక పోలీసుల సమన్వయంతో మాక్‌డ్రిల్ నిర్వహించారు. యుద్ధ వాతావరణం ప్రస్తుతం లేదని భావిస్తున్నా షార్‌ను మరింత భద్రత కల్పించి కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారు. దేశ భద్రతను కాపాడు కోవాలంటే దేశంలోని 7వేల కిలోమీటర్ల సువిశాల సముద్ర తీరప్రాంతాన్ని నిరంతరం పర్యవేక్షించాలని, అత్యాధునిక ఉపగ్రహాల, డ్రోన్ల సాంకేతిక పరిజ్ఞానం లేకపోతే అనేక వ్యూహాత్మక లక్ష్యాలను మనం చేరుకోలేమని ఇస్రో ఛైర్మన్ నారాయణన్ ఇప్పటికే స్పష్టంచేశారు. ఇఒఎస్09 ఉపగ్రహం రీశాట్ 1బి సేవలు అందించనుంది. ఇప్పటికే రీశాట్ 1ఎ ఉపగ్రహంఅంతరిక్షం నుంచి మన దేశ రక్షణ కార్యక్రమాలు పర్యవేక్షిస్తోంది. ఎటువంటి వాతావరణ పరిస్థితుల్లో అయినా భూ ఉపరితలాన్ని అత్యంత స్పష్టతతో కూడిన హైరిజల్యూషన్ ఫొటోలను తీసి పంపే సామర్థ్యం ఈ ఉపగ్రహానికి ఉంది. ఇందులో అమర్చిన సి బ్యాండ్ సింతటిక్ అపార్చ్ రాడార్ ప్రధాన ప్రత్యేకత కాగా, ఈ రాడార్ సాయంతో పగలు లేదా రాత్రి అనే తేడాలేకుండా సునిశిత విశ్లేషణ చేసే సామర్థ్యం ఈ ఉపగ్రహంలోని ఉపకరణాలకు ఉంది. కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ పార్లమెంటరీ స్థాయీసంఘం సభ్యులు ఉపగ్రహ ప్రయోగాన్ని వీక్షించేందుకు శ్రీహరికోటకు రానున్నట్లు తెలిసింది. ఈ ఉపగ్రహ ప్రయోగ ప్రాధాన్యత దృష్ట్యా మరికొంత మంది విఐపిలు ఇస్రో ఛైర్మన్‌తో పాటు ఇతర సీనియర్ శాస్త్రవేత్తలు రాకెట్ ప్రయోగ సమయంలో షార్‌లోనే ఉండబోతున్నారు.




బహిరంగ ప్రకటన
గౌరవనీయ నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ బెంచ్ హైదరాబాద్ వద్ద వారి ఎదుట C.A. (CAA) NO.15/230/HDB/2025 కంపెనీల చట్టం, 2013 (2013 యొక్క 18) యొక్క విషయంలో సెక్షన్‌లు 230 నుండి 232 యొక్క విషయంలో మరియు కంపెనీల చట్టం, 2013 యొక్క అన్ని ఇతర వర్తించే ఏర్పాట్లు మరియు గోల్డెన్ ఆర్గానిక్ ప్రొడక్ట్ లిమిటెడ్ (మొదటి ట్రాన్స్‌ఫెరర్ కంపెనీ) యొక్క విలీనం యొక్క పథకం యొక్క విషయంలో మరియు నవశక్తి స్పిన్ టెక్స్ లిమిటెడ్ (రెండవ ట్రాన్స్‌ఫెరర్ కంపెనీ) మరియు సత్యా హైబ్రిడ్ సీడ్ ప్రైవేట్ లిమిటెడ్ (మూడవ ట్రాన్స్‌ఫెరర్ కంపెనీ) మరియు విక్టార్ బయోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ (నాల్గవ ట్రాన్స్‌ఫెరర్ కంపెనీ)తో శివశక్తి అగ్రిటెక్ లిమిటెడ్ (ట్రాన్స్‌ఫెరీ కంపెనీ) మరియు వారి సంబంధిత వాటాదారులు మరియు రుణదాతలు
శివశక్తి అగ్రిటెక్ లిమిటెడ్, కంపెనీల చట్టం, 1956 నిబంధనల ప్రకారం స్థాపించబడిన ఒక కంపెనీ, CIN: U15100TG1998PLC028724 కలిగి ఉంది మరియు దాని రిజిస్టర్డ్ కార్యాలయం ఇ.నం.7-1-621/98-621/34, 4వ అంతస్తు, శివశక్తి టవర్స్, U.T.I. బ్యాంక్ ఎదురుగా, సంజీవ రెడ్డి నగర్, హైదరాబాద్, తెలంగాణ, ఇండియా - 500038 వద్ద ఉంది, దీని డైరెక్టర్ శ్రీమతి లీలావతి గోనుగుంట్లచే (DIN: 00035560), ఫోన్: +91-9866778837, ఇమెయిల్: taxation@sivashakthi.net ద్వారా ప్రాతినిధ్యం.
...దరఖాస్తుదారు / ట్రాన్స్‌ఫెరీ కంపెనీ
హైదరాబాద్ వద్ద గౌరవనీయ జాతీయ కంపెనీ చట్టం ట్రిబ్యునల్ బెంచ్ ఆదేశాల ప్రకారం, శివశక్తి అగ్రిటెక్ లిమిటెడ్/దరఖాస్తుదారు/ట్రాన్స్‌ఫెరీ కంపెనీ యొక్క సురక్షితం కాని రుణదాతల ట్రిబ్యునల్ సమావేశం యొక్క నోటీసు మరియు ప్రకటన.
01.05.2025 నాటి ఉత్తర్వు ద్వారా, గౌరవనీయ నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ యొక్క హైదరాబాద్ బెంచ్, శివశక్తి అగ్రిటెక్ లిమిటెడ్ యొక్క అన్‌సెక్యూర్డ్ క్రెడిటార్ల సమావేశం నిర్వహించాలని ఆదేశించిందని ఇందుమూలంగా నోటీసు ఇవ్వబడింది. గోల్డెన్ ఆర్గానిక్ ప్రొడక్ట్ లిమిటెడ్ (ఫస్ట్ ట్రాన్స్‌ఫరర్ కంపెనీ) మరియు నవశక్తి స్పింటెక్స్ లిమిటెడ్ (సెకండ్ ట్రాన్స్‌ఫరర్ కంపెనీ) మరియు సత్య హైబ్రిడ్ సీడ్ ప్రైవేట్ లిమిటెడ్ (థర్డ్ ట్రాన్స్‌ఫరర్ కంపెనీ) మరియు విక్టర్ బయోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ (ఫోర్త్ ట్రాన్స్‌ఫరర్ కంపెనీ)ల సమ్మేళన పథకాన్ని శివశక్తి అగ్రిటెక్ లిమిటెడ్ (ట్రాన్స్‌ఫరీ కంపెనీ)తో మరియు వారి సంబంధిత వాటాదారులు మరియు క్రెడిటార్లతో పరిగణనలోకి తీసుకుని, అవసరమైతే మార్పుతో లేదా లేకుండా ఆమోదించడానికి.
సదరు ఉత్తర్వు మరియు దానిలో నిర్దేశించిన విధంగా, శివశక్తి అగ్రిటెక్ లిమిటెడ్ యొక్క అన్‌సెక్యూర్డ్ క్రెడిటార్ల సమావేశం 18.06.2025 (జూన్ 18వ రోజు 2025) ఉదయం 11:00 గంటలకు ఇ.నం.7-1-621/98-621/34, 4వ అంతస్తు, శివశక్తి టవర్స్, యు.టి.ఐ. బ్యాంక్ ఎదురుగా, సంజీవ రెడ్డి నగర్, హైదరాబాద్, తెలంగాణ, ఇండియా 500038 వద్ద ఉన్న దరఖాస్తుదారు కంపెనీ రిజిస్టర్డ్ కార్యాలయంలో జరుగుతుందని ఇందుమూలంగా నోటీసు ఇవ్వబడింది, ఆ తేదీ, సమయం మరియు ప్రదేశంలో దరఖాస్తుదారు కంపెనీ యొక్క అన్‌సెక్యూర్డ్ క్రెడిటార్లు హాజరు కావాల్సిందిగా అభ్యర్థించారు.
కంపెనీల చట్టం, 2013లోని సెక్షన్లు 230(3), 232(1) మరియు (2) మరియు 102 కింద పేర్కొన్న పథకం మరియు వివరణాత్మక ప్రకటన కాపీలను, కంపెనీల (రాజీలు, అమరికలు మరియు అమాల్గమేషన్లు) నియమాలు, 2016లోని నిబంధన 6తో చదువబడే, దరఖాస్తుదారు కంపెనీ యొక్క రిజిస్టర్డ్ కార్యాలయంలో ఉచితంగా పొందవచ్చును.
శివశక్తి అగ్రిటెక్ లిమిటెడ్ యొక్క అన్‌సెక్యూర్డ్ క్రెడిటార్ల సమావేశానికి హాజరు కావడానికి మరియు ఓటు వేయడానికి అర్హత ఉన్న వ్యక్తులు స్వయంగా లేదా ప్రాక్సీ ద్వారా లేదా అధీకృత ప్రతినిధుల ద్వారా ఓటు వేయవచ్చు. అయితే సూచించిన ఫారమ్‌లోని అన్ని ప్రాక్సీలను సమావేశానికి 48 గంటల ముందు దరఖాస్తుదారు కంపెనీ రిజిస్టర్డ్ కార్యాలయంలో జమ చేయాలి.
దరఖాస్తుదారు కంపెనీ రిజిస్టర్డ్ కార్యాలయం నుండి ప్రాక్సీ ఫారాలను ఉచితంగా పొందవచ్చు.
సమావేశం జరిగే స్థలంలో పోలింగ్ పత్రం ద్వారా ఓటింగ్ నిర్వహించబడుతుంది.
గౌరవనీయులైన నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్, హైదరాబాద్ వద్ద బెంచ్ శ్రీమతి విస్మయ M S, న్యాయవాది ఛైర్‌పర్సన్‌గా మరియు శ్రీమతి సుమన్ బిజార్నియా PCS స్క్రూటినైజర్‌గా సదరు సమావేశానికి నియమించింది.
పైన పేర్కొనబడిన విలీన యొక్క పథకం, సమావేశం ఆమోదించబడితే అది నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ యొక్క ఆ తర్వాతి అనుమతికి లోబడి ఉంటుంది
సం/-
విస్మయ M S.
న్యాయవాది, ఛైర్‌పర్సన్,
శివశక్తి అగ్రిటెక్ లిమిటెడ్ యొక్క అన్‌సెక్యూర్డ్ క్రెడిటార్ల యొక్క ట్రిబ్యునల్ ఏర్పాటు సమావేశం
తేదీ: 15 మే, 2025
స్థలం: హైదరాబాద్



## పుష్కరాల పోస్టర్‌ను ఆవిష్కరించిన మంత్రి కొండా సురేఖ

**హైదరాబాద్, మే 14, ప్రభాతవార్త :** తెలంగాణలోని భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో మే 15 నుండి 26 వరకు జరగనున్న సరస్వతి నది పుష్కరాలు కోసం తెలంగాణ కాలుష్య నియంత్రణ బోర్డు అధికారిక పోస్టర్‌ను అటవీ, పర్యా వరణ, దేవాదాయ శాఖమంత్రి కొండా సురేఖ విడుదల చేశారు. ఈ సందర్భంగా పర్యవరణ పరిరక్షణ ఆవశ్యకతను సూచించే తెలంగాణ కాలుష్య నియం త్రణ బోర్డు అధికారిక పోస్టర్‌ను మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నదులను పరిరక్షించడం, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించడం, బట్టలు ఉతకడం, వ్యర్థాల నిర్వహణ, నీటి కాలుష్యం నుండి చర్మ వ్యాధులను నివారించడానికి పరిసరాలను శుభ్రంగా ఉంచడం అవసరాన్ని నొక్కి చెప్పారు. ప్రజా రవాణాను ఉపయోగించడం వల్ల వాహన కాలుష్యం, రద్దీ తగ్గుతుందన్నారు. మనం సమిష్టి బాధ్యత తీసుకొని పర్యావరణాన్ని, పుష్కరాల పవిత్రతను కాపాడుకోవడానికి చేతులు కలపాలని మంత్రి కొండా సురేఖ అన్నారు.

## 28 (2బి) బార్లకు దరఖాస్తుల ఆహ్వానం

### జూన్ 6 వరకు స్వీకరణ

**హైదరాబాద్,మే 14, ప్రభాతవార్త:** రాష్ట్రంలో 28(2బి)బార్లకు దరఖాస్తులను ఆహ్వానిస్తూ ఎక్సైజ్‌శాఖ బుధవారం నోటిఫికేషన్ జారీ చేసింది. జిహెచ్ఎంసి పరిధిలో 24 బార్లకు, మహబూబ్ నగర్, బోధన్, నిజామాబాద్, సరూర్‌నగర్ జల్‌పల్లి మునిసిపాలిటీలో ఒక్కొక్క బార్‌కు దరఖాస్తులను ఆహ్వానించింది. గతంలో 2బి బార్లకు పిలిచిన దరఖాస్తులతో బార్‌కు లైసెన్స్ పొంది, ఫీజులు చెల్లించక పోవడం,ఇతర కార ణాలతో రద్దు చేసిన 16బార్లకు, 2బి బార్లకు లైసెన్స్‌లు పొంది 90రోజుల్లో అవసరమైన డాక్యుమెంటేషన్, ఫీజులు చెల్లించకుండా బార్ల నిర్వహణకు ముందుకురాని 12 బార్లను తిరిగి పునరుద్ధరణకు ప్రొహిబిషన్ ఎక్సైజ్‌శాఖ దరఖాస్తులను ఆహ్వానించింది.ప్రతి దరఖాస్తు ఫారం రుసుం రూ.1లక్షగా ఖరారు చేశారు.దరఖాస్తులతో పాటు రూ.1లక్షను డి.డి. చెల్లించాల్సి ఉంటుందని,డి.డి రూపంలో చెల్లించిన డబ్బు నాన్ రిఫండబుల్‌గా(తిరిగి చెల్లించడం ఉండదని,)ఎక్సైజ్‌శాఖ నోటిఫికేషన్‌లో పేర్కొంది.2బి బార్లకు పిలిచిన దరఖాస్తుల ఆహ్వానంలో28 బార్లకు ఒక్కొక్కరు ఎన్ని దరఖాస్తులైనా చేసుకోవచ్చునని,జిహెచ్ఎంసీతోపాటు ఇతర మునిసిపాలిటీల్లోని 2బి బార్లకు ఎవ్వరైనా దరఖాస్తులు చేసుకోవచ్చునని పేర్కొన్నారు. డి.డిలతో పాటు దరఖాస్తులను ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమి షనర్ కార్యాలయం,హైదరాబాద్, రంగారెడ్డి డిప్యూటి కమిషనర్ కార్యాలయాల్లోను మిగిలిన అయా ప్రాంతాల్లో దరఖాస్తులను అందించాల్సి ఉంటుందని ఎక్సైజ్‌శాఖ అధికారులు తెలిపారు. ఎక్సైజ్‌శాఖ వెబ్‌సైటలో దరఖాస్తుల నమూనా, నియమ నిబంధనలు ఉంటాయని పేర్కొంది. 2బి బార్లకు దరఖాస్తులను ఈ నెల 15 నుంచి జూన్ 6తేదీవరకు స్వీకరించనున్నట్లు ఎక్సైజ్ అధికారులు పేర్కొన్నారు.

## హామీలు ఇచ్చి మాట మారుస్తున్న రేవంత్

### సిపిఎం రాష్ట్రకార్యదర్శి జాన్ వెస్లీ

**ఉగ్రవాదాన్ని అణచివేయాలి: జాతీయ ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.బేబీ**

**మావోయిస్టులతో చర్చలు జరపాలి: పొలిట్‌బ్యూరో సభ్యుడు బివి రాఘవులు**

**హైదరాబాద్,మే 14, ప్రభాతవార్త:** హామీలు నెరవేర్చకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట మారుస్తున్నారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ విమర్శించారు.ఎన్నికల ముందు ఇష్ట మొచ్చినట్లు రేవంత్‌రెడ్డి వాగ్దానాలు ఇచ్చారని,అప్పుడు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి రేవంత్ రెడ్డికి తెలియదాని నిలదీశారు. హైదరాబాద్‌లో బుధవారం ఆయన సిపిఎం జతీయ కార్యదర్శి ఎం.ఎ బేబి, సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యడు బివి రాఘవులతో కలిసి మీడియాతో మాట్లాడారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హామీలు అమలు చేయకుంటే కాంగ్రెస్‌కు ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. అనంతర సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఎం.ఎ బేబీ మాట్లాడుతూ ఉగ్రవాదానికి సిపిఎం వ్యతిరేకమని ఉగ్రవాదాన్ని కేంద్ర ప్రభుత్వం అణచివేయాలన్నారు. భారత్-పాక్ కాల్పుల విరమణపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటన చేయడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు.కాల్పుల విరమణలో ఇతర దేశం మధ్యవర్తిత్వం అనవసరమని,భారత్‌పాక్ మధ్య ఉద్రిక్తత వాతావరణం నేపథ్యంలో కేంద్రం ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు ఏర్పాటు చేసి ఆపరేష్ సిందూర్ వివరాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఆపరేషన్ కగార్‌ను ఆపడం శుభపరిణామమని సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బి.వి. రాఘవులు అన్నారు. మావోయిస్టులతో కేంద్రం చర్చలు జరపాలని డిమాండ్ చేశారు.



బుధవారం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్

## అబద్ధాల ప్రచారంలో బిజెపి దిట్ట

### బిఆర్ఎస్ కాంగ్రెస్‌లో విలీనం కాకపోతే బిజెపి దుకాణం బంద్ చేస్తారా?: ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్

**హైదరాబాద్, మే 14,ప్రభాతవార్త:** బిఆర్ఎస్‌లో కాంగ్రెస్ ఎందుకు విలీనం అవుతుంది,అబద్ధాలు ప్రచారం చేయడంలో బిజెపి వాళ్ళు దిట్ట అంటూ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ అన్నారు .బుధవారం గాంధీ భవన్‌లో ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ మాట్లాడుతూ నియంతలకు అబద్ధాల మీద బాగా ప్రేమ ఉంటుందని, డిసెంబర్‌లోగా బిఆర్ఎస్ కాంగ్రెస్‌లో విలీనం కాకపోతే ఎన్‌విఎస్ ప్రభాకర్ తన పార్టీదుకాణంను తెలంగాణలో బంద్ చేసుకొంటారా అని నిలదీశారు. బిజెపి వాళ్లకు మోకాళ్ళలో మెదడు ఉండటంతో చాలా జోక్‌గా మాట్లాడుతుంటారని అద్దంకి అపహాస్యంచేశారు. బిజెపిలో మూడు వర్గాలు ఉన్నాయని ఈటెల రాజేందర్, బండి సంజయ్, కిషన్ రెడ్డివర్గాలలో ఏ వర్గం వద్ద ఆశ్రయం పొందుతున్నావని ఎన్ వి ఎస్ ఎస్‌ప్రభాకర్‌ను అద్దంకి అడిగారు. ఎన్ వి ఎస్ ఎస్ ప్రభాకర్ ఎవరు చెప్పారు నీకు,జూన్ 2 లేదా డిసెంబర్‌లో బిఆర్ఎస్ కాంగ్రెస్ లో విలీనం అవుతోందని,అలా కాకపోతే బిజెపిని రాష్ట్రంలో నిషేధిస్తారా అని ఆయన అన్నారు. మాతో పోరాటం మీకు చేత కావడం లేదా అని దయాకర్ నిలదీశారు. బిజెపి, బిఆర్ఎస్ డిఎన్ఎ ఒక్కటే అందుకే బిజెపి నీ రాష్ట్రంలో జనాలు తొక్కి పెట్టారు అని ఆయన అన్నారు. ఎన్ వి ఎస్ ఎస్ ప్రభాకర్ గతంలో ఇలాగే కారు కూతలు కూశావు అప్పుడు ఏమైందో నీకు తెలుసు అని ఆయన అన్నారు. ఎన్ వి ఎస్ ఎస్ ప్రభాకర్ నీతో ఎవరు మాట్లాడించారు చెప్పు అని ప్రశ్నించారు.ఈ టర్మ్ కాదు వచ్చే టర్మ్ కూడా రేవంత్ రెడ్డి మళ్ళీ సిఎం అవుతారని బిజెపి వాళ్లకు క్లారిటీ ఉంది.అందుకే ఇలా మాట్లాడుతున్నారు.ఎప్పటికీ బిఆర్ఎస్, కాంగ్రెస్ కలవదని జోస్యం చెప్పారు. అది రాహుల్ గాంధీ చెప్పారని ఆయన వివరించారు. బిజెపితో బిఆర్ఎస్ కు చీకటి రాజకీయ ఒప్పందం ఉందని నిందించారు. బిఆర్ఎస్ గెలవని చోట బిజెపి ఎంపీలు ఎలా గెలిచారని ప్రశ్నించారు.ఆంధ్రాలో బిజెపికి బిటీమ్‌లు వైసీపీ,టీడీపీ, జనసేన ఇక్కడ బిఆర్ ఎస్‌అని ఆయన అన్నారు.

కమలం కాడకు గులాబీ పువ్వునీ అంటుకట్టారని అన్నారు. కేసీఆర్ తీసి నిన్ను పక్కకు పెట్టినప్పుడు కూడా ఇన్ని మాటలు మాట్లాడలేదు కదా ఈటెల రాజేందర్ ఇప్పుడు మాట్లాడుతున్నావని అన్నారు.

## ఇళ్లులేని పేదలకు త్వరలో 100 గజాల స్థలం: మంత్రి పొంగులేటి



మంత్రి పొంగులేటికి వినతిపత్రాన్ని సమర్పిస్తున్న రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య తదితరులు

**హైదరాబాద్, మే 14 ప్రభాతవార్త:** గ్రేటర్ హైదరా బాద్ పరిధిలో ఇల్లు లేని పెదలకు ఎంక్వైరీ చేసి 100 గజాల ఇంటి స్థలం కేటాయిస్తామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హామీఇచ్చారు.బుధవారం ఎంపీ ఆర్ కృష్ణయ్య సచివాలయంలో మంత్రిని రాష్ట్ర బి.సి సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ నీలం వెంకటేష్, రాజేందర్, అనం తయ్య, భాకు రవి, నిమ్మల వీరన్న, రామ మూర్తి గౌడ్, అంజి గౌడ్, రమేశ్ యాదవ్, కౌశిక్, చిరంజీవి, బాలయ్యలతో కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. ఘట్‌కేసర్ మండలం కాచవన్ సిం గారంలో మూడువేల మందికి 15 సం వత్సరాలు క్రితం ఇళ్ళపట్టాలు ఇచ్చారని, స్థల వివాదం వల్ల పట్టా లు పెండింగ్‌లో పెట్టరని, అలాగే హయత్‌నగర్ మండలం తట్టి అన్నారంలో 3 వేల మందికి పట్టా ఇచ్చి 2వేల మందికి పొజిషన్ ఇచ్చి వెయ్యిమందిని పెండింగ్‌లో పెట్టారని మంత్రికి విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం కోర్టు కేసు పరిష్కారమైనందున పట్టాలు ఇచ్చి పెండింగ్ పెట్టిన వారికి 4వేల మందికి పొజిషన్ ఇవ్వాలని మంత్రిని కోరారు.

## 17 నుంచి రాష్ట్రంలో తిరంగా యాత్ర

### బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు



**హైదరాబాద్, మే 14 ప్రభాతవార్త:** ఆపరేషన్ సిందూర్ విజయవంతం సందర్భంగా భారత సైనికుల త్యాగాలను స్మరించుకుంటూ, భారత జవాన్ల వీరోచిత పోరాటానికి సెల్యూట్ చేస్తూ తిరంగాయాత్ర కార్యక్రమంలలో పాల్గొనాలని నిర్ణయించడం జరిగిందని బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. తిరంగా యాత్ర కార్యక్రమం సంబంధించి జరిగిన సమావేశంలో భాగంగా రాష్ట్ర కార్య దర్శులు ఎస్.ప్రకాష్ రెడ్డి, మాధవి, సీనియర్ నాయకుడు ఎన్. గౌతంరావు, రాష్ట్ర అధికార ప్రతినిధి సోలంకి శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాసం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా దేశం మొత్తం అప్రమత్తంగా ఉండాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పిలువునిచ్చారన్నారు.

ఆపరేషన్ సిందూర్ విజయవంతం అయిన సందర్భంగా వీర జవాన్లకు వందనాలు తెలుపుతూ, భారతదేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటిచెప్పిన అన్ని రక్షణ వ్యవస్థలను అభినందిస్తూ దేశ వ్యాప్తంగా తిరంగా యాత్రలు నిర్వహించాలని భారతీయ జనతా పార్టీ నిర్ణయించడం జరిగిందన్నారు. తెలంగాణలో సిటిజన్స్ ఫోరం ఫర్ నేషనల్ సెక్యూరిటీ సం స్థతో కలిసి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నా మన్నారు. మే 17 సాయంత్రం 5 గంటలకు హైదరాబాద్ ట్యాంక్ బండ్ వద్ద అంబేద్కర్ విగ్రహం నుంచి తిరంగా యాత్ర ప్రారంభమవు తుందన్నారు. మే 18, 19, 20 తేదీల్లో అన్ని జిల్లా కేంద్రాల్లో, మే 21, 22, 23 తేదీల్లో అన్ని మున్సిపాలిటీలు మరియు అసెంబ్లీ నియోజకవర్గాల్లో తిరంగా యాత్రలు నిర్వహించబడతాయన్నారు.

## ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించండి

### సిఎస్‌ను కోరిన ఎమ్మెల్సీ మల్క కొమురయ్య

**హైదరాబాద్, మే 14 ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఉపాధ్యాయులకు సంబంధించి దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావును శాసనమండలి సభ్యులు మల్కా కొమురయ్య కోరారు. బుధవారం సిఎస్‌ను కలిసి ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతిపత్రం అందించారు. సంవత్సరాల తరబడి సమస్యలు పెండింగ్‌లో ఉండటం వల్ల ఉపాధ్యాయులు మనోవేదనకు గురవుతున్నారని వాటిని వెంటనే పరిష్కరించాలన్నారు. సుమారు రెండు దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న ఏకీకృత సర్వీస్ రూల్స్ రూపొందిస్తూ జూనియర్ లెక్చరర్ పదోన్నతులు కల్పించాలన్నారు.

## రైతు కష్టాలు పక్కన పెట్టి అందాల పోటీకి ప్రాధాన్యత?

### బిజెపి అధికార ప్రతినిధి ఎన్.వి.సుభాష్

**హైదరాబాద్, మే 14 ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం రైతు కష్టాలు పక్కన పెట్టి అందాల పోటీకి ప్రాధాన్యత? ఇవ్వడం ఏమిటని బిజెపి అధికార ప్రతినిధి ఎన్.వి. సుభాష్ మండిపడ్డారు. బుధవారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. 72వ మిస్ వరల్డ్ పోటీల పేరుతో తెలంగాణ సంస్కృతి, ఆధ్యాత్మికతను పక్కన పెట్టడం సరైనది కాదన్నారు. గతంలో ఈ-కార్ ఫార్ములా రేసింగ్‌ను వ్యతిరేకించిన సిఎం రేవంత్ రెడ్డి ఇప్పుడు మిస్ వరల్డ్ పోటీలతో ఈవెంట్లు చేయడం వెనుక మతలబేంటి? అంటూ ప్రశ్నించారు.తెలంగాణ రాష్ట్రంలో ఓవైపు అన్నదాత కన్నీళ్లు పెడుతుంటే అందాలపోటీకి కోట్లు ఖర్చు పెడతారా అన్నారు. ప్రజల సమస్యలు పక్కకు పెట్టి ప్రచార ఆర్భాటం ఘనంగా చేసుకుంటున్నారన్నారు. పర్యాటక అభివృద్ధి పేరుతో ప్రాచీనతను దెబ్బతీసే ప్రయత్నం చేయడం సిగ్గుచేటు అన్నారు. హైదరాబాద్ నగర ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించలేడు కానీ, మిస్ వరల్డ్ అందాల పోటీల పేరుతో వందల కోట్లు ఖర్చు చేస్తున్నాడన్నారు.

## కొనుగోలు కేంద్రాలను పర్యవేక్షించే సమయం మంత్రులకు లేదా?

### బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి

**హైదరాబాద్, మే 14 ప్రభాతవార్త:** రాష్ట్రంలో రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన వ్యవసాయ ఉత్పత్తులకు మంచి ధరలు లభించేలా కొనుగోలు కేంద్రాల్లో పరిస్థితిని పర్యవేక్షించి, అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేయడంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆయన సహచర మంత్రులు పూర్తిగా విఫలమయ్యారని బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి అన్నారు. బుధవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. వరి ధాన్యం కొనుగోలు విషయంలో గత కొంతకాలంగా కాంగ్రెస్ మంత్రులు, ప్రజాప్రతినిధులు కేవలం ఫోటోషూట్లకే పరిమితమవుతూ, మొక్కుబడిగా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారని, అక్కడ రైతులకు అవసరమైన సౌకర్యాలను కల్పించడంలో విఫలమయ్యారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైస్ మిల్లర్లతో చేతులు కలిపి, రైతులకు తీవ్రమైన అన్యాయం చేస్తుందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం వరి ధాన్యానికి మద్దతు ధర ప్రకటించడమే కాకుండా, కొనుగోలు ఖర్చులన్నింటినీ కూడా భరిస్తుందన్నారు. అయినప్పటికీ, రైతులు కొనుగోలు కేంద్రాలకు రాకుండా చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం అపూర్వ విజయాన్ని సాధించిందన్నారు. రాబోయే రోజుల్లో అన్ని వ్యవసాయ ఉత్పత్తులను కేంద్రమే కొనుగోలు చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లేఖ రాస్తామని చెబుతున్నారు. మరి కేంద్రం అన్నీ కొనుగోలు చేస్తే రాష్ట్ర ప్రభుత్వ పాత్ర ఏమిటి? అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు 40 శాతం కూడా రైతు రుణమాఫీ చేయలేదని, పంటల సమగ్ర భీమా పథకాన్ని అమలు చేయడంలో కూడా విఫలమైందన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం సకాలంలో సరిదిద్దుబాటు చర్యలు చేపట్టి, ధాన్యం కొనుగోలు విషయంలో రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

## ప్రభుత్వానికి హిందూ దేవాలయాలపై ఎందుకింత వివక్ష?

### బిజెపి ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్

**హైదరాబాద్, మే 14 ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వానికి భాగ్యలక్ష్మి అమ్మవారు కనబడలేదా అంటూ బిజెపి ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్ ప్రశ్నించారు. బుధవారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. మైనారిటీల సంతుష్టీకరణ కోసం హిందూ దేవాలయాలపై వివక్ష చూపుతున్నారన్నారు. ఓవైసీ, మజ్లిస్‌కు భయపడే సుందరీమణులను అమ్మవారి దేవాలయానికి తీసుకెళ్లలేదన్నారు. మిస్ వరల్డ్ పోటీ సందర్భంగా 109 దేశాల నుంచి హైదరాబాద్‌కు వచ్చిన సుందరీమణులను చార్మినార్, లాడ్‌బజార్, ఫలక్‌నుమా ప్యాలెస్‌లకు తీసుకెళ్లిన ప్రభుత్వం, అదే చార్మినార్ ప్రాంగణంలో ఉన్న భాగ్యలక్ష్మి దేవాలయాన్ని మాత్రం చూపించకపోవడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తారు. ఓవైసి, మజ్లిస్ పార్టీకి భయపడే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, విదేశీ అతిథులను, సుందరీమ ణులను భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయానికి తీసుకెళ్లేందుకు ధైర్యం చేయలేకపోయారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీకి, ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డికి హిందూ సంస్కృతి, ఆలయాల పట్ల ఉన్న చులకనభావం మరోసారి స్పష్ట మైందన్నారు.

గతంలో భాగ్యలక్ష్మి అమ్మవారిని స్వయంగా దర్శించుకుని ఆలయ విశిష్టతను కొనియాడిన రేవంత్‌రెడ్డి, ఇతర పార్టీల నాయకులకు చాలెంజ్ విసిరిన ముఖ్యమంత్రి ఇప్పుడు మాత్రం ఆ ఆలయాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేయడమే అందుకు నిదర్శనమన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో మైనారిటీ ఓట్ల కోసం, హిందూ దేవాలయాలను నిర్లక్ష్య చేయడం వంటి కుట్రలతో నిర్ణయాలు తీసుకుంటూ కాంగ్రెస్ పార్టీ హిందువులను మరింత విభజించే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు.

## స్పేస్ టెక్నాలజీలో ఇస్రో, ఎన్ఆర్ఎస్సీలతో ఓయు కీలక ఒప్పందం



ఒప్పంద పత్రాలను తీసుకుంటున్న వైస్ చాన్సలర్ ప్రొ.కుమార్ మొలుగరం

**హైదరాబాద్ (తార్నాక), మే 14 ప్రభాతవార్త :** స్పేస్ టెక్నాలజీ రంగంలో ఇస్రో, ఎన్ఆర్ఎస్సీలతో కీలక ఒప్పందం చేసుకుంది ఉస్మానియా విశ్వవిద్యాలయం. ఈ రంగంలో వస్తోన్న సరికొత్త మార్పులు, ఆవిష్కరణలకు అనుగుణంగా సామర్థ్యాల పెంపు, నైపుణ్యాభివృద్ధి విషయంలో శిక్షణ కోసం 5 సంవత్సరాల కాలపరిమితితో బుధవారం ఈ మేరకు పరస్పర అవగాహన ఒప్పందం కుదిరింది. ఓయూ ఉప కులపతి ఆచార్య కుమార్ మొలుగరం, ఎన్ఆర్ఎస్సీ , ఇస్రో నుంచి సీనియర్ శాస్త్రవేత్తలు ఈ మేరకు ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందంలో భాగంగా ఓయూ విద్యార్థులకు ఇంజినీరింగ్, టెక్నాలజీ విభాగంలో కొత్త డిగ్రీ, పీజీ కోర్సుల నిర్వహణకు సహాయం చేస్తుంది. సంయుక్త సర్టిఫికేట్లు, ఉమ్మడి పరిశోధనలు, అంటార్కిటికాలోని శాస్త్రవేత్తలతో లైవ్‌లో మాట్లాడించడం, ఎన్ఆర్ఎస్సీ అవుట్‌రీచ్‌లో భాగంగా విద్యా సామాగ్రి అభివృద్ధిపై కలసి పనిచేయనున్నారు. దీనిలో భాగంగా కొందరు ఓయూ విద్యార్థులకు ఎన్ఆర్ఎస్సీలో పరిశోధనలు చేసేందుకు అవకాశం కల్పిస్తారు. ఈ సందర్భంగా ఓయూ వీసీ ప్రొఫెసర్ కుమార్ మాట్లాడుతూ వర్సిటీలో మరికొన్ని విభాగాలతో కూడా ఎన్ఆర్ఎస్సీ ఈ తరహా ఒప్పందాలు చేసుకోవడానికి అవకాశాలు ఉన్నాయన్నారు. అనంతరం ఒప్పందం నోడల్ అధికారి, ఓయూ ఈసీఈ విభాగం ఆచార్యులు ప్రొ. పి. నవీన్ కుమార్ మాట్లాడుతూ ఓయూ ఇప్పటికే స్పేస్ అప్లికేషన్ సెంటర్ ఎస్ఏసీ అహ్మదాబాద్‌లో ఇదే తరహా ఒప్పందం చేసుకుందన్నారు.

అనంతరం ఎన్ఆర్ఎస్సీ డైరెక్టర్ డాక్టర్ ప్రకాష్ చౌహాన్ మాట్లాడుతూ ప్రస్తుతం పౌర, రక్షణ అవసరాలు రెండింటిలో స్పేస్ టెక్నాలజీ ముఖ్య భూమిక పోషిస్తోందన్నారు. అందుకు తగిన విధంగా మానవ వనరులను అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్ర మంలో ఓయూ నుంచి వీసీ ఆచార్య కుమార్ మొలుగరం, రిజిస్ట్రార్ ఆచార్య నరేష్ రెడ్డి, ఓఎస్‌డీ ఆచార్య జితేందర్ నాయక్, యూజిసి వ్యవహారాల డీన్ ఆచార్య లావణ్య, డీన్ ఫోలే ఆచార్య కృష్ణయ్య, ఎంవోయూ నోడల్ అధికారి ఆచార్య నవీన్ కుమార్, ఆచార్య శ్రీనగేష్, ఆచార్య మంగు, ఆచార్య విజయ, ఆచార్య రామకృష్ణ, ఆచార్య శేఖర్ తదితరులు పాల్గొన్నారు. ఎన్ఆర్ఎస్‌సీ, ఇస్రో నుంచి డాక్టర్ అపర్ణ, డాక్టర్ కె. చంద్ర శేఖర్, ఫయాజ్, డాక్టర్ పి. సత్యనారాయణ, డాక్టర్ ఆర్. శ్రీనివాస్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులపై హైడ్రా ఫోకస్

### క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్న కమిషనర్ రంగనాథ్

**హైదరాబాద్, మే 14, ప్రభాతవార్త:** ప్రజావాణి ఫిర్యాదులపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ విచారణ చేపట్టారు. బుధవారం క్షేత్ర స్థాయిలో పర్యటించి ఫిర్యాదులను పరిశీలించి కొన్నిటికి అక్కడికక్కడే పరిష్కారం చూపారు. మరికొన్ని ఫిర్యాదుల విషయంలో సంబంధిత అధికారులతో చర్చించి మరింత లోతైన విచారణ జరగాలని అధికారులను ఆదేశించారు.



ఈ క్రమంలో రంగారెడ్డి జిల్లా నుంచి పర్యటన మొదలు పెట్టి రాత్రి 7.30 గంటలకు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాతో పర్యటన ముగించారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్మెట్ మండలం కొహెడ గ్రామంలోని రాజాజీ నగర పేరిట వేసిన లేఔట్‌ను హైడ్రా కమిషనర్ బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం కొహెడ విలేజ్‌లోని కొత్త చెరువును సందర్శించారు. ఆతర్వాత మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని డాలర్ హిల్స్ కాలనీని సందర్శించిపార్కు స్థలాన్ని కబ్జా చేసి నిర్మాణాలు చేపడుతున్నారనే ఫిర్యాదును పరిశీలించారు.ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణాలు ఎలా చేపట్టారంటూ సదరు నిర్మాణ సంస్థపై ఆగ్రహం వ్యక్తంచేశారు. డాలర్ హిల్స్‌కాలనీకి వెళ్ళే మార్గంలో ఎలాంటి సెట్ బ్యాక్స్ లేకుండా నిర్మిస్తున్న 8 అంతస్తుల భవనాన్ని పరిశీలించారు. తర్వాత గుట్టల బేగంపేటలో రోడ్డును ఆక్రమించి నిర్మించిన 5 అంతస్తుల భవనాన్ని పరిశీలించారు. నిర్మాణ అనుమతులు పరిశీలించి రహదారి ఆక్రమణ లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. అనంతరం కూకట్‌పల్లిలోని డైమండ్ హిల్స్ లేఔట్ ను పరిశీలించారు. కోర్టులో తమకు అనుకూలంగా తీర్పు వచ్చినా ఫలితం లేకుండా పోయింది అని ప్లాట్ యజమానులు కమిషనర్ ముందు వాపోయారు. మొత్తం 9ఎకరాల్లో 70 ప్లాట్లతో లేఔట్ ఉండగా అక్కడ రోడ్స్, పార్కుల ఆనవాళ్ళ లేకుండా కబ్జాదారుడు ఆక్రమించేశాడని వాపోయారు. ఇరువైపుల వాళ్లను సమావేశపరిచి సంబంధిత పత్రాలను పరిశీలించాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు. తర్వాత దుండిగల్ మండలం బౌరంపేట విలేజ్ పరిధిలో జీపీఆర్ లేఔట్‌ను రంగనాథ్ పరిశీలించారు. లే ఔట్ మేరకు రోడ్స్, పార్కు స్థలాలను స్పష్టంగా చూపించాలని అధికారులను ఆదేశించారు.


## నల్లగొండ బిఎస్ఎన్ఎల్ సహకార పరపతి సంఘంలో

# రూ.20 కోట్ల గోల్‌మాల్

### మూడేళ్ల తరువాత సిఐడికి చిక్కిన నిందితుడు

**హైదరాబాద్, మే 14, ప్రభాతవార్త:** నల్లగొండ జిల్లా బిఎస్ఎన్ఎల్ సహకార పరపతి సంఘంలో 2022లో జరిగిన 20 కోట్ల రూపాయల గోల్ మాల్ వ్యవహారంలో మూడేళ్ల తరువాత అసలు నిందితుడు సిఐడికి చిక్కాడు. అప్పట్లో బిఎస్ఎన్ఎల్ ఉద్యోగులతో పాటు వారి కుటుంబీకులకు చెందిన లక్షలాది రూపాయల ను సహకార పరపతి సంఘంలో ఫిక్స్‌డ్ డిపాజిట్లుగా పెట్టగా సంఘం అధ్యక్షుడితో పాటు ఇతర సభ్యులు ఎఫ్‌డిలు చేసిన వారికి నకిలీ పత్రాలు ఇచ్చి 20 కో ట్ల రూపాయలను కాజేశారు. దీనిపై అప్పట్లోనే నల్లగొండ పట్టణ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదవగా అనంతరం ఈ కేసు సిఐడికి బదిలీ అయ్యింది. ఈ కేసులో అసలు నిందితుడిని తాజాగా సిఐడి కటకటాల్లో నెట్టింది. దీనికి సంబంధించిన వివరాలను సిఐడి డిజి శిఖా గోయల్ బుధవారం మీడియాకు వెల్లడించారు. నల్ల గొండ జిల్లాలో బిఎస్ఎన్ఎల్ ఉద్యోగులతో పాటు వారి కుటుంబీకులు తమ వద్ద వున్న డబ్బులను బిఎస్ఎన్ఎల్ సహకార పరపతి సంఘంలో ఎఫ్‌డిలుగా పెట్ట డం ఎప్పటి నుంచో ఆనవాయితీగా వస్తుంది. ఈ డబ్బులను సంఘం నాయకులు జాతీయ బ్యాంకుల్లో డిపాజిట్లుగా వుంచి అక్కడి నుంచే వచ్చే వడ్డీని సభ్యుల కు అందజేసేవారు. అయితే 2022 ఏప్రిల్ నెలలో సహకార పరపతిసంఘంలో బిఎస్ఎన్ఎల్ సభ్యులతో పాటు వారి కుటుంబ సభ్యులు ఎఫ్‌డిలుగా వుంచిన డబ్బులు గల్లంతాయని తేలడంతో సభ్యుల్లో ఆందోళన మొదలయ్యింది. అనంతరం తమ ఎఫ్‌డిలను తమకు తిరిగి ఇవ్వాలని బిఎస్ఎన్ఎల్ సభ్యులు ఆందో ళనకు దిగడంతో వివాదం ముదిరింది. కొందరు దీనిపై తమకు ఇచ్చిన ఎఫ్‌డిల రసీదులతో జాతీయ బ్యాంకులకు వెళ్లి ఆరా తీయగా ఈ రసీదులన్నీ నకిలీవని, అసలు సహకార పరపతి సంఘం నుంచి బ్యాంకుల్లో ఎలాంటి డబ్బులు డిపాజిట్ చేయలేదని తేలింది. దీంతో బిఎస్ఎన్ఎల్ ఉద్యోగులు ఆందోళనను ఉధృతం చేశారు. ఇదే సమయంలో 2022 ఏప్రిల్ 30వ తేదీన నల్లగొండ జిల్లా సహకార సంఘ అధికారి దీనిపై విచారణ చేయగా బిఎస్ఎన్ఎల్ ఉద్యోగుల సహకార ప రపతి సంఘంలో 20 కోట్ల రూపాయలు గల్లంతాయని తేలింది. దీనిపై సహకార అధికారి నల్లగొండ పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు సహకార పరపతి సంఘం అధ్యక్షుడుగా 15 ఏళ్లుగా కొనసాగుతున్న సిహెచ్. బిక్షంతో పాటు మరో ఏడుగురు సభ్యులపై ఐపిసి 409, 477ఎ, 420, రెడ్‌విత్ 120 బి సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. అనంతరం ఇటీవలే ఈ కేసు సిఐడికి బదిలీ అయ్యింది. కాగా ఈ కేసును పునర్ విచా రించిన సిఐడి దీనిపై లోతుగా దర్యాప్తు చేసి ఈ గోల్‌మాల్ వ్యవహారంలో అసలు ముద్దాయి నల్లగొండ పట్టణంలోని వివేకానందనగర్‌కు చెందిన బాషమల్ల అన ంతరావు (63)ని మంగళవారం అరెస్టు చేశారు. ఇతను బిఎస్ఎన్ఎల్‌లో సూపరింటెండెంట్ గా పనిచేసి పదవీ విరమణ పొందాడు. అప్పట్లో జరిగిన నేరంలో ఇతని పాత్రపై సిఐడి నమ్మదగ్గ ఆధారాలు సేకరించింది. నిందితుడిని కోర్టులో హాజరుపరిచి రిమాండుకు తరలించారు. నల్లగొండ సిఐడి విభాగం ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్ ఈ కేసును విచారిస్తున్నారు.

## రాష్ట్ర సమాచార కమిషనర్లుగా నలుగురు ప్రమాణ స్వీకారం



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మే14:** రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషనర్లుగా సీనియర్ జర్నలిస్టులు పివి శ్రీనివాస్, బొరెడ్డి అయోధ్యరెడ్డి, న్యాయవాదులు దేశాల భూపాల్, మోహిసినా పర్వీన్ ప్రమాణ స్వీకారం చేశారు. బుధవారం సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో వారితో రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ డాక్టర్ జి.చంద్రశేఖర్‌రెడ్డి ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి సిఎం రేవంత్‌రెడ్డి,ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, డిజిపి జితేందర్ హాజరయ్యారు. నూతనంగా ప్రమాణ స్వీకారం చేసిన ఆర్టీఐ కమిషనర్లకు సిఎం శుభాకాంక్షలు తెలిపారు.

వీరు పదవీ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి మూడేళ్ల పాటు లేదా వయసు 65 ఏళ్లు నిండే వరకు వారు రాష్ట్ర సమాచార హక్కు కమిషనర్లుగా కొనసాగుతారు. కాగా తెలంగాణలో గత కొంతకాలంగా ఆర్టీఐ కమిషన్ ఖాళీగా ఉంది. ఈ నేపథ్యంలో సిఎం రేవంత్‌రెడ్డి ఇటీవలే కమిషన్ నియామకానికి సెల క్షన్ కమిటీతో సమావేశం నిర్వహించారు. ఆర్టీఐ ప్రధాన సమాచార కమిషనర్‌గా ఐఎఫ్ఎస్ అధి కారి జి.చంద్రశేఖర్‌రెడ్డి వారం రోజుల క్రితమే బాధ్యతలు తీసుకున్నారు.

# విద్య వైద్యం పైనే ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

## ప్రజా ప్రభుత్వంలోనే ప్రతి పేద కుటుంబానికి సంక్షేమం ఎర్రుపాలెం, బోనకల్ మండలాల్లో రూ.62 కోట్ల అభివృద్ధి పనులకు'భట్టి' భూమి పూజలు



**మధిర, మే 14 ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంపదను సృష్టించడంతోపాటు సృష్టించిన సంపదను ప్రజలకు పంచుతామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. బుధవారం ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గ పరిధిలోని ఎర్రుపాలెం బోనకల్ మండలాల్లో రూ 52 కోట్ల అభివృద్ధి పనులకు ఆయన భూమి పూజలు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్లపాటు ఆర్థికంగా వెసులుబాటు ఉన్న ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడంలో గత పాలకులు విఫలమయ్యారని విమర్శించారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలోని 90 లక్షల రేషన్ కార్డు కలిగిన కుటుంబాలకు సంక్షేమ పథకాలను అమలు చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నదని అన్నారు. సన్న బియ్యం పంపిణీ తో పాటు 200 లోపు యూనిట్ల విద్యుత్తును ఉచితంగా 500 కే గ్యాస్ సిలిండర్లు అందిస్తున్నామని తెలిపారు. మహిళలకు ఆర్టీసీ లో ఉచిత ప్రయాణాన్ని కల్పించడం జరుగుతున్నదన్నారు. ప్రతి ఒక్కరికి వైద్యం అందించడం లక్ష్యంగా రూ 11600 కోట్లను వైద్యశాఖకు కేటాయించామని అన్నారు. ప్రతి పేదవానికి రూ.10లక్షల తో రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా ఆరోగ్య భద్రతకు భరోసాను కల్పించిన ఘనత ఈ ప్రభుత్వానికి అన్నారు. పేదవారి సొంటింటికలను నెరవేర్చేందుకు ప్రతి నియోజకవర్గంలో ఏడాదికి 3500 ఇందిరమ్మ గృహాలను నిర్మించనున్నట్లు తెలిపారు. రానున్న ఐదేళ్ల కాలంలో అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇంటిని కట్టిస్తామని ఆయన తెలిపారు. విద్యారంగాన్ని బలోపేతం చేసే దిశగా రూ.11,600 కోట్లతో రాష్ట్రంలో కొత్తగా రెసిడెన్షియల్ , ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ విద్యాసంస్థలను ఏర్పాటు చేసి మెరుగైన విద్యను అందించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. రైతు సంక్షేమానికి గాను రైతు పండించిన ప్రతి పంటను మద్దతు ధరతో కొనుగోలు చేయడంతో పాటు ఐకెపిల ద్వారా కొనుగోలు చేసిన తక్షణమే నగదును రైతుల ఖాతాలో వేస్తున్నామన్నారు. సన్న బియ్యానికి 500 బోనస్సు ఇస్తున్నామన్నారు. ప్రభుత్వం రైతుల రుణమాఫీ రైతు భరోసా, ఉచిత విద్యుత్తును అందించి, వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత కల్పిస్తున్నామన్నారు. మహిళా సాధికారత కోసం డ్వాక్రా సంఘాల ద్వారా రూ.21 వేలకోట్ల వడ్డీ లేని రుణాలు అందిస్తున్నామని,స్త్రీశక్తి క్యాంటీన్లు, ఆర్టీసీలో అద్దె బస్సులు, సౌర విద్యుత్తు ప్లాంట్ల ఏర్పాటు ద్వారా చిన్న తరహా పరిశ్రమలను ఏర్పాటు చేసి మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునే విధంగా ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఐదు లక్షల మంది యువతకు స్వయం ఉపాధి ద్వారా లబ్ధి చేకూర్చేందుకు రూ. 9,000 కోట్లతో రాజీవ్ యువ వికాసం పథకాన్ని అమలు చేస్తున్నామని అన్నారు. జూన్ 2న రుణ మంజూరు పత్రాలను అందించనున్నామని, ఈ పథకాన్ని యువత సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదిగేందుకు అడుగులేయాలన్నారు.

**రూ.62 కోట్ల అభివృద్ధి పనులకు భూమి పూజలు**

డిప్యూటీ సీఎం ఎర్రుపాలెం బోనకల్ మండలాల్లో 62 కోట్ల తో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. తొలుత ఎర్రుపాలెం మండల కేంద్రంలో రూ.22 కోట్ల తో 50 పడకల ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కంద్రిక గ్రామం నుండి పెద్ద గోపవరం గ్రామం వరకు రూ.2.62 కోట్లతో బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. అనంతరం బనిగండ్లపాడు గ్రామం నుండి బంజర గ్రామం వరకు రూ. 5.74 కోట్లతో బీటీ రోడ్డుకు భూమి పూజ చేశారు. అక్కడి నుండి బోనకల్ మండలం కలకోట గ్రామానికి చేరుకున్న డిప్యూటీ సీఎం అక్కడ కలకోట నుండి మోటమర్రి గ్రామం వరకు రూ. 20 కోట్ల అంచనా తో నూతనంగా అభివృద్ధి చేసి విస్తరించనున్న రహదారి పనులకు భూమి పూజ చేసారు. కలకోటలో నూతనంగా నిర్మించనున్న అంగన్వాడి భవనానికి, మత్స్య సహకార సంఘ భవనానికి ఆయన భూమి పూజలు చేశారు. అనంతరం రావినూతల గ్రామానికి చేరుకొని రూ.2.80 కోట్లతో రావినూతల నుండి ఆళ్లపాడు గ్రామానికి రహదారి పనులకు,రూ.8 కోట్లతో రావినూతల నుండి గోవిందపురం వరకు నూతన రహదారి విస్తరణ పనులకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క భూమి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్,రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా కలెక్టర్ ముజామిల్ ఖాన్, ఆర్డీవో నరసింహారావు,ట్రాన్స్కో ఎస్ఇ శ్రీనివాసాచారి, కళావతి భాయ్,పీఆర్ ఇఇ వెంకట్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ బండారు నరసింహా రావు, ఆత్మ చైర్మన్ కర్నాటి రామ రామకోటేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ దుర్గాప్రసాద్, పిసిసి సభ్యుడు పైడిపల్లి కిషోర్ స్థానిక అధికారులు, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



బుధవారం ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న జస్టిస్ చంద్రకుమార్, ప్రతాప్‌రెడ్డి తదితరులు

## మావోయిస్టులతో కేంద్రం చర్చలు జరపాలి

### శాంతి చర్చల కమిటీ డిమాండ్

**హైదరాబాద్, మే 14,ప్రభాతవార్త:** శత్రు దేశంతో చర్చలతో సమస్యలు పరిష్కారం చేసుకుంటున్న పుడు మధ్య భారతంలోని ఆదివాసీ ప్రాంతాలపై సైనిక దాడులు చేయడం అమానవీయ చర్య అని గతంలో ప్రభుత్వంపై సాయుధ పోరుకు పూనుకున్న గుర్రిలాండ్ నాగాలాండ్, ఇతర సంస్థలతో శాంతి ఒప్పందాలు చేసుకున్న ప్రభుత్వం మావోయిస్టులతో అదే ప్రాతిపాదికన శాంతి చర్చలు జరపాలని శాంతిచర్చల కమిటీ (పీస్‌డైలాగ్) డిమాండ్ చేసింది. ఈమేరకు బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అధ్యక్షులు జస్టిస్ చంద్రకుమార్, ఉపాధ్యక్షులు కంచిమల్ల ప్రతాప్ రెడ్డి, కోఆర్డినేటర్ బండి దుర్గా ప్రసాద్, ప్రొ. అన్వర్‌ఖాన్‌లు మాట్లాడారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివాసీలపై కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలు కొన సాగిస్తున్న దాడులను ఆపాలన్నారు. కాల్పుల విరమణతో చర్చలకు ముందుకు వచ్చిన మావోయిస్టు పార్టీతో కేంద్ర ప్రభుత్వం మొండి పట్టుదలకు పోకుండ వెంటనే షరతులు లేకుండా సీజ్ ఫైర్ ప్రకటించి కుంబింగ్ ఆపి చర్చల ప్రక్రియను మొదలు పెట్టాలన్నారు. బీజాపూర్ జిల్లా లో ఇటీవల జరిగిన 22 ఎన్‌కౌంటర్ మరణాలపై అనుమానాలు బలంగా వ్యక్తం అవుతున్న కారణంగా సుప్రీం కోర్టు వెంటనే సుమోటోగా స్వీకరించి విచారణ చేపట్టాలన్నారు. దేశ వ్యాప్తంగా ఉన్న ప్రజా స్వామిక వాదులు, రాజకీయ పార్టీలు గమనించి పెద్ద ఎత్తున స్పందించి ఈ మారణ హోమాన్ని ఆపడానికి పూనుకోవాలని పీస్ డైలాగ్ పిలుపునిచ్చింది. రాష్ట్రపతివెంటనే జోక్యం చేసుకుని కగార్ ఆపరేషన్ ఆపి చర్చలకు ప్రభుత్వం ఒప్పుకునేలా సూచన చేయాలని కోరారు. మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ 6 నెలల కాల్పుల విరమణ ప్రకటిం చడంను పీస్ డైలాగ్ కమిటీ స్వాగతిస్తుందని పేర్కొన్నారు.

## వేములవాడ టెంపుల్ ఘటనపై తెలంగాణ రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి సురేఖ ఆరా

**హైదరాబాద్, మే 14, ప్రభాతవార్త :**ఎండోమెంట్ కమిషనర్, వేములవాడ ఆలయ ఈవోలను పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్న మంత్రి సురేఖ.రాజన్న ఆలయ విస్తరణ పనులపై అపోహలు నెలకొన్నాయని ఆలయ సిబ్బంది మంత్రి దృష్టికి తీసుకు వచ్చారు.భక్తుల పూర్తిస్థాయిలో సౌకర్యాల అందజేసేందుకు ఆలయ విస్తీర్ణం పెంచాలనే చర్యలు తీసుకున్నట్లుగా వివరణ ఇచ్చారు.ప్రధాన ఆలయ విస్తీర్ణం, భీమేశ్వరాలయంలో భక్తులకు దర్శన సౌకర్యం కు సంబంధించిన పనులు చేపడుతున్నట్లు స్పష్టం చేశారు.అయితే, స్థానికంగా అనివార్యాల ప్రజలతో చర్చించి ముందుకు వెళ్ళాలని ఎక్కడా ఎటు వంటి అనుమానాలు, ఇబ్బందులకు తావు ఇవ్వకుండా ముందుకు వెళ్ళాలని అధికారులకు మంత్రి కొండా సురేఖ దిశానిర్దేశం చేశారు.

## మరో రూ.2,500 కోట్ల రుణం తీసుకున్న సర్కార్

**హైదరాబాద్, మే 13, ప్రభాతవార్త:** తెలంగాణ సర్కార్ రిజర్వ్ బ్యాంక్ నుంచి తాజాగా మరో రూ.2,500 కోట్ల రుణం తీసుకున్నది. రిజర్వ్ బ్యాంక్ తాజాగా నిర్వహించిన ఈవేలం ద్వారా ప్రభుత్వ సెక్యూరిటీ బాండ్లు పెట్టి ఈ రుణం సేకరించినట్టు రిజర్వ్ బ్యాంక్ ప్రకటించింది. 21 ఏండ్లకాల పరిమితికి 6.86 శాతం వార్షిక వడ్డీతో రూ.800 కోట్లు, 22 ఏండ్ల కాల పరిమితికి 6.86 శాతం వార్షిక వడ్డీతో రూ.900 కోట్లు, 25 ఏండ్ల కాలపరిమితికి 6.86 శాతం వార్షిక వడ్డీతో మరో రూ.900 కోట్లు సమీకరించింది. కాగా 2025-26 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో రూ.14 వేల కోట్ల రుణ సమీకరణ కోసం ఆర్బీఐకి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపించింది. ఏప్రిల్‌లో మూడు దఫాల్లో రూ.4,400 కోట్లు తీసుకున్నది. ఈ నెల 6న రూ.2 వేల కోట్లు, ఇప్పుడు మరో రూ.2,500 కోట్ల అప్పు తీసుకున్నది. ఇక ప్రస్తుత 2025-26ఆర్థిక సంవత్సరంలో మార్కెట్ రుణాల కింద రూ. 64,539 కోట్లు సమీకరిస్తామని వార్షిక అంచనా బడ్జెట్‌లో ప్రతిపాదించింది.

## గిరిజన రైతులకు హైకోర్టులో ఊరట

**హైదరాబాద్, మే 14, ప్రభాతవార్త:**గిరిజన రైతులకు హైకోర్టులో ఊరట లభించింది. భూ సంబంధిత వివాదంలో హైకోర్టు దాఖలైన రిట్ పిటిషన్లను పరిశీలించిన ధర్మాసనం స్టేటస్ క్వో ఆదేశాలు జారీ చేసిన ఆర్డర్ కాపీ ఇచ్చింది. జూన్ 24లోగా పిటిషన్లు ఎందుకు స్వీకరించకూడదో వివరణ ఇవ్వాలని ప్రతి వాదులకు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఖమ్మం జిల్లా సింగరేణి మండలం మాణిక్యారంకు చెందిన గిరిజన రైతులు ఇస్లావత్ జమునా, ఇస్లావత్ బాలా తమ వ్యవసాయ భూములపై అటవిశాఖ, పోలీసు అధికారులు అన్యాయంగా బెదిరిస్తున్నారని, భూముల నుంచి బలవంతంగా తమను తొలగించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపిస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖాలు చేశారు. పిటిషనర్ల తరపున అడ్వకేట్ నల్లపు మణిదీప్ వాదనలు వినిపించారు. పిటిషనర్లకు అటవీశాఖ ద్వారా మంజూరైన ఫారెస్ట్ హక్కుల గుర్తింపు చట్టం, 2006 (ఆర్వోఎఫ్ఆర్) పత్రాల ఆధారంగా భూములు ఉన్నాయని, అధికారుల బెదిరింపులు రాజ్యాంగ నిబంధనలకు విరుద్ధమని వారు కోర్టులో వాదించారు. మే మొదటి వారంలో విచారణ జరగగా తాజాగా ఆర్డర్ కాపీ హైకోర్టు విడుదల చేసింది. పిటిషనర్లకు చెందిన 9.30 ఎకరాలు, 6.71 ఎకరాల భూములపై ప్రస్తుతం ఉన్న యథాస్థితి కొనసాగించాలని జస్టిస్ పుల్లా కార్తీక్ స్పష్టం చేస్తూ స్టేటస్ కో ఆదేశాలను జారీ చేశారు. ప్రతి వాదులుగా పేర్కొన్న అటవిశాఖ, హోంశాఖ అధికార ప్రతినిధులకు, ప్రభుత్వ న్యాయవాదులకు ఇది వరకు నోటీసులను స్వీకరించినందున, పునఃనోటీసు జారీ చేయాల్సిన అవసరం లేదని హైకోర్టు ఉత్తర్వులలో పేర్కొంది. పిటిషన్లను ఎందుకు స్వీకరించకుడదో వివరణ ఇవ్వాలన ప్రతి వాదులైప అటవీశాఖ హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరికి వివరణ ఇవ్వాలని స్పష్టం చేసింది.

## క్యాన్సర్ బాధిత కుటుంబానికి అండగా సీఎం రేవంత్

### సాయిచరణ్ చికిత్సకు రూ.12 లక్షలు అందజేత

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మే14:** క్యాన్సర్ బారిన పడిన వ్యక్తి చికిత్సకు అవసరమైన ఆర్థిక సహాయం అందించి బాధిత కుటుంబానికి ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అండగా నిలిచారు. సిద్దిపేటకు చెందిన సిరిసిల్ల సాయిచరణ్ (35) అక్యుర్డ్ మైలాయిడ్ లుకేమియా (బ్లడ్ క్యాన్సర్) బారిన పడ్డారు. ఆయనకు భార్య లక్ష్మిప్రసన్న, కుమార్తెలు లక్ష్మి సుసజ్ఞ (6), స్మయ (2 నెలలు), తల్లిదండ్రులు రాము, సునీత ఉన్నారు. ఇంటికి ఆధారమైన సాయిచరణ్ క్యాన్సర్ బారినపడడంతో అతని చికిత్సకు కుటుంబ సభ్యులు సిద్దిపేట మండలం ఎన్సాన్‌పల్లిలోని తమ ఇంటిని విక్రయించారు. అయినప్పటికీ చికిత్సకు అవసరమైనంత డబ్బులు సరిపోకపోవడంతో వారు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డిని గతంలో కలిసి తమ ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. చలించిన ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి సాయిచరణ్ చికిత్సకు రూ.5 లక్షలు మంజూరు చేశారు. దాంతో హైదరాబాద్ బసవ తారకం క్యాన్సర్ ఆసుపత్రిలో సాయిచరణ్‌కు స్టెమ్‌సెల్ ట్రాన్స్‌ప్లాంటేషన్ పూర్త యింది. చికిత్సకు అదనంగా వ్యయమైన మరో రూ.7 లక్షలను సీఎంఆర్ఎఫ్ ద్వారా అందించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించడంతో ఆ మొత్తాన్ని అధికారులు అందజేశారు. చికిత్స చేయించుకున్న సాయిచరణ్ కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం సాయంత్రం రాష్ట్ర సచివాలయానికి వచ్చి ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ధైర్యంగా ఉండాలని సీఎం సాయిచరణ్‌కు సూచించారు.

## ఫ్లోరెన్స్‌నైటింగేల్ అవార్డు అందుకున్న పద్మావతి వర్సిటీ

**తిరుపతి,మే 14ప్రభాతవార్తప్రతినిధి:**ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తొలి మహిళ విశ్వవిద్యాలయం తిరుపతిలోని పద్మావతి మహిళ విశ్వవిద్యాలయం నర్సింగ్ విభాగం మెరుగైన బోధనకు "ఫ్లోరెన్స్‌నైటింగేల్ అవారు"అందుకుంది. ఆంధ్ర ప్రదేశ్ నర్సింగ్ కౌన్సిల్ వివిధ విభాగాల కోసం ప్రవేశపెట్టిన ఈ అవార్డులను తిరుపతి పద్మావతి మహిళ విశ్వవిద్యాలయం నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గంగాభవానీకి అందజేశారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన అంతర్జాతీయ నర్సులదినోత్సవ వేడుకల్లో ఉత్తమ నర్సింగ్ పరిశోధ కురాలు అవార్డును అందుకున్నారు. రాష్ట్రవైద్యఆరోగ్య శాఖమంత్రి సత్యకుమార్‌యాదవ్‌నుండి అవార్డును అందుకోవడం పట్ల పద్మావతి వర్సిటీ ఉపకులపతి ఆచార్య వెన్నంఉమ,రిజిస్ట్రార్,డిప్యూటీ రిజిస్ట్రార్ అభినందించారు.

## సింగరేణిలో పారదర్శకంగా కాంట్రాక్టులు

### రివర్స్ టెండరింగ్ ద్వారా పనుల అప్పగింత: సంస్థ సిఎండి బలరామ్

**హైదరాబాద్, మే 14, ప్రభాతవార్త:**సింగరేణిలో ప్రతీ కాంట్రాక్టు, ప్రతీ కొనుగోలు ప్రక్రియను పూర్తి పారదర్శకంగా బహిరంగ టెండర్ ద్వారా నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ సిఎండి బలరామ్ స్పష్టం చేశారు. అనంతరం అతి తక్కువ రేటును పేర్కొన్న వారికి మాత్రమే కాంట్రాక్టు అప్పగించడం జరుగుతుందని చెప్పారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటనలో ఇవన్నీ బహిరంగ టెండర్లే అని, ఎక్కడా కూడా ఏ ఒక్క కాంట్రాక్టర్‌కో అప్పగించేలా పక్షపాతం చూపించే అవకాశమే ఉండదని తేల్చిచెప్పారు. అలాగే రివర్స్ టెండరింగ్ ద్వారా కాంట్రాక్టు మరింత తక్కువ ధరకు అప్పగించడం జరుగుతుందన్నారు. ఓవర్ బర్డెన్, పేలుడు పదార్థాల టెండర్లలోనూ ఇదే పద్ధతిని పాటించడం జరుగుతుందని వెల్లడించారు. ఓవర్ బర్డెన్ కాంట్రాక్టులు, పేలుడు పదార్థాల కాంట్రాక్టులు అన్నీ సింగరేణి బోర్డు ఆమోదం లభించిన తర్వాతనే కేటాయించడం జరుగుతుందన్నారు. సింగరేణి బోర్డులో సింగరేణి డైరెక్టర్లతో పాటు, రాష్ట్ర ప్రభుత్వ నామినీ డైరెక్టర్లు, కేంద్ర ప్రభుత్వం నామినేట్ చేసిన డైరెక్టర్లు ఆమోదించిన తర్వాతనే కాంట్రాక్టును కేటాయించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ విషయంలో రాజకీయ నాయకులతో సహా ఎవరి ప్రమేయం ఉండదని తెలిపారు. బాధ్యత గల ప్రభుత్వ సంస్థగా ఇక్కడ కోట్లాది రూపాయల టెండర్లను అత్యంత పకడ్బందీగా, పూర్తి పారదర్శకంగా, పటిష్టమైన నియమ నిబంధనలతో నిర్వహించడం జరుగుతుందని తేల్చిచెప్పారు. ఏదైనా పనికి సంబంధించి టెండర్లు పిలిచినప్పుడు కంపెనీ పేర్కొన్న రేటుకు దాటి కాంట్రాక్టర్లు రేటు పేర్కొన్నట్లయితే, అది సబబుగా లేదని భావిస్తే కంపెనీ నియమ నిబంధనల ప్రకారం ఆ టెండర్లను రద్దు చేయడం లేదా తిరిగి పిలవడం జరుగుతుందన్నారు. అతి కనిష్ట కొటేషన్ దారుకు మాత్రమే పనులు అప్పగించడం జరుగుతుందని పేర్కొన్నారు. కాగా భూపాలపల్లి టెండర్ కంపెనీ పేర్కొన్న రేటు కన్నా తక్కువ ధరకు (మైనస్ 1.02 శాతం) రావడం గమనార్హమన్నారు. అలాగే మణుగూరు టెండర్ ప్రక్రియ ఇంకా పూర్తి కాలేదు. అలాంటప్పుడు అధిక ధరకు టెండర్లు ఎలా కట్టబెడతారని ప్రశ్నించారు. కాగా గతంలో పేలుడు పదార్థాల కాంట్రాక్టుకు ఇచ్చిన టెండర్‌తో పోల్చితే చాలా తక్కువ రేటుకు, అంటే మైనస్ 31 శాతం తక్కువకు తాజాగా కాంట్రాక్టును అప్పగించడం జరిగిందని వివరించారు. 2022-24 కాలానికి ఉపరితల గనుల్లో వినియోగించే సగటు పేలుడు పదార్థాల మెట్రిక్‌టన్ను కొనుగోలు ధర రూ.69,935 ఉండగా, ప్రస్తుత 2024-26 కాలానికి రూ.44,467 గా ఉండటం విశేషం. దీన్ని గమనిస్తే 30 శాతం అధికంగా కాకుండా 31 శాతం తక్కువ ధరకు కాంట్రాక్టును కేటాయించిన విషయం అర్థం అవుతుంది. ఇదిసింగరేణిలో కాంట్రాక్టులు అప్పగించే విషయం లో ఉన్న పకడ్బందీ పారదర్శక వ్యవస్థకు నిదర్శనమన్నారు.

## జూన్ 2 నుంచి భూభారతి రెవెన్యూ సదస్సులు

### రెవెన్యూ,హౌసింగ్. సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్,మే14,ప్రభాతవార్త :**రాష్ట్రఅవతరణ దినోత్సవమైన జూన్ 2 నుంచి భూభారతి చట్టంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు రెవెన్యూ, హౌసింగ్.సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు.గత పది సంవత్సరాలలో రాష్ట్రంలో పేరుకుపోయిన భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలన్న ఆశయంతో గత నెల 14వ తేదీన భూభారతి చట్టాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతులమీదుగా ప్రారంభించుకున్నామని,అదేనెల 17వ తేదీ నుంచి 30వ తేదీ వరకు4 జిల్లాల్లోని 4 మండలాల్లో ప్రయోగాత్మకంగా రెవెన్యూ సదస్సులు నిర్వహించామన్నారు.ఈనెల 5 నుంచి 30 వరకు 28 జిల్లాల్లోని 28 మండలాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు.ఆయా మండలాల్లో ఎదురైన అనుభవాలను దృష్టిలోపెట్టుకొని వచ్చే నెల2 నుంచి అన్ని మండలాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించాలని నిర్ణయించినట్లు బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు.ఈ రెవెన్యూ సదస్సులలో వచ్చే దరఖాస్తులకు నిర్దేశిత గడువు పెట్టుకొని భూ భారతి చట్టంపరిధిలోకి వచ్చే ప్రతి దరఖాస్తుకు పరిష్కారం చూపిస్తామన్నారు.ప్రయోగాత్మకంగా నిర్వహించిన 4 మండలాల్లో ఇప్పటికే కొన్నింటిని పరిష్కరించామని,ఈనెల 30 తేదీ నాటికి దాదాపు 60 శాతం భూసమస్యలను పరిష్కరిస్తామన్నారు.భూభారతి చట్టానికిలోబడి పరిష్కరించవలసిన అన్ని సమస్యలకు పరిష్కారం చూపుతూ, పరిష్కరించలేనివాటికి ఎందుకు పరిష్కరించలేకపోతున్నామనే విషయాన్ని లిఖిత పూర్వకంగా దరఖాస్తుదారులకు తెలియజేస్తామన్నారు.ఎప్పటికీ పరిష్కారం కానివి ఉంటే అసలు పరిష్కార యోగ్యం లేనివి అక్రమమైనవి ఉంటే అవి పరిష్కారం కావు అని చెప్పడం జరుగుతుంది. భూ సమస్యలకు పూర్తి స్థాయిలో పరిష్కారం చూపాలి అనేది భూ భారతి చట్టం లక్ష్యం. క్షేత్ర స్థాయిలో అధికారులు సత్వరం స్పందించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రెండవ దశలో 28 మండలాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులలో కూడా ఈనెల చివరినాటికి వీలైనంతవరకూ సమస్యలను పరిష్కరించాలని ఇప్పటికే కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. సాదాబైనామాలకు సంబంధించిన అంశం ప్రస్తుతం కోర్టు పరిధిలో ఉందని, కోర్టులో స్టే వెకేట్ అయిన వెంటనే ఈ సమస్యకు పరిష్కారం చూపిస్తామని అయితే ఆన్ లైన్ లో ఉన్న దరఖాస్తులను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటామన్నారు.ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకుగత ఏడాదిన్నర కాలంగా రెవెన్యూ విభాగంలో చేపట్టిన సంస్కరణలు,తీసుకున్న నిర్ణయాలకు ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తుందన్నారు. భూభారతి చట్టాన్ని ప్రజలు స్వాగతిస్తున్నారని ఈ చట్టంతోతమ సమస్యలు పరిష్కారం అవుతున్నాయన్న సంతోషం వారిలో కనిపిస్తుందన్నారు.సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానానికి ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తుందని,గత ప్రభుత్వం చేసిన నిర్వాకం వలన మొత్తం రెవెన్యూ సేవలు ప్రజలకు దూరమయ్యాయన్నారు.మొత్తం వ్యవస్థనుప్రజలకు చేరువు చేసి వారికి మెరుగైన సేవలుఅందించడమే లక్ష్యంగా పనిచేస్తుందన్నారు.

## యేటా 35 వేల మందికి జాబ్ లక్ష్యంగా శిక్షణ

### ఎస్సీ వెల్ఫేర్ విద్యాలయాల సంస్థ కార్యదర్శి వర్షిణి

**హైదరాబాద్, మే 14, ప్రభాతవార్త:** టెన్త్, ఇంటర్ ఫలితాల్లో తెలంగాణ సంక్షేమ గురుకుల విద్యాలయాలు ప్రైవేటుకు దీటుగా సత్తా చాటాయి. అంతా బానే ఉన్నా చదువులు పూర్తయ్యాక ఇక్కడ నుంచి వెళ్లిన విద్యార్థుల్లో కనీసం ఒక్కశాతం మంది కూడా స్థిరమైన జాబ్ చేయడం లేదన్న సంచలన విషయాలు బయటికి వచ్చాయి. స్వయంగా తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ విద్యాసంస్థల సెక్రటరీ వర్షిణి ఈ విషయాలను హైదరాబాద్‌లో మీడియాకు చెప్పారు. అందుకే పూర్వ విద్యార్థుల కోసం జాబ్ ఓరియేంటేషన్ శిక్షణను తెలంగాణ గురుకులాల్లో ఈ ఏడాది నుంచి అందుబాటులోకి తీసుకొచ్చినట్లు ఆమె వివరించారు. ఉన్నతి అనే సంస్థతో ఈ మేరకు ఒప్పందం చేసుకున్నామన్నారు. ఇందులో భాగంగా 238 విద్యాసంస్థల్లో 45 రోజుల ట్రైనింగ్ ఏడాదిలో మూడు బ్యాచ్‌లకు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఏటా 36 వేలమంది విద్యార్థులకు జాబ్ దొరికేలా శిక్షణ ఇవ్వడమే తమ లక్ష్యమని చెప్పారు. గురుకులాల్లో ఇటీవల ఆరా తీయగా 8,9,10 తరగతితో పాటు ఇంటర్ చదువుతున్న విద్యార్థుల్లో 40 శాతంకి పైగా నకిలి కుల, ఆదాయ పత్రాలు ఉన్నవారేనని తెలిపారు. అందుకే ఈ ఎడాది నుంచి ముందు కుల, ఆదాయ ధృవీకరణ తర్వాత అప్లికేషన్ చేసుకునే అవకాశం ఇచ్చా మన్నారు. అక్కడ కూడా తప్పుడు పత్రాలు జోడిస్తే అప్లికేషన్ రిజెక్ట్ చేస్తున్నట్లు చెప్పారు. కాగా గతేడాది గురుకులాల్లో ఫుడ్ పాయిజన్ ఘటనలపై స్పందించిన ఆమె డిసెంబర్‌లో అందుబాటులోకి వచ్చిన కామన్ డైట్ మెనూతో ఇప్పుడు ఎలాంటి ఇబ్బందులు రావడం లేదని తెలిపారు. అయితే కావాలని రాజకీయాల కోసం ప్రతిష్టాత్మక తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్స్‌ని బదనాం చేయడం సరికాదని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 104 గురుకులాల్లో ప్రస్తుతం సొంత భవనాల్లో నడుస్తుండగా మిగిలిన 134 అద్దె భవనాల్లో ఉన్నాయని పేర్కొన్నారు. వీటిలో 36 విద్యాసంస్థలకు సొంత భవనాల నిర్మాణ ప్రతిపాదనలు ఉండగా, మిగిలిన స్కూల్స్ ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌గా కన్వర్ట్ అవుతున్నట్లు ఆమె చెప్పారు. గురుకులాల అడ్మిషన్లకు ఈ ఏడాది కూడా భారీగా అప్లికేషన్లు వచ్చాయన్నారు. రాష్ట్రంలో 57 వేల 523 సీట్లు ఖాళీగా ఉంటే లక్షా 69 వేల 171 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని వివరించారు.

వీరిలో కేటగిరిల వారీగా అర్హత ఉన్నవారికి సీట్లను కేటాయిస్తున్నట్లు అధికారులు తెలిపారు. గురుకులాల సీట్ల కేటాయింపు ప్రక్రియను తెలుసుకునే విండో ఇచ్చినట్లు సెక్రటరీ చెప్పారు. గురుకులాల్లో కోఎడ్యుకేషన్ ఉండదని స్పష్టం చేశారు. డైవర్షన్ లేకుండా పిల్లలు ఫ్రీగా ఉండేలా వేర్వేరుగానే ఉంటాయని చెప్పారు. కోఎడ్యుకేషన్ గా ఉన్న ఒకే ఒక స్కూల్‌ని కూడా బాయ్స్, గర్ల్స్ పాఠశాలలుగా విభజన చేస్తున్నట్లు వివరించారు. అమ్మాయిల విద్యాసంస్థల్లో సిబ్బందిగా మహిళలు మాత్రమే ఉండేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు.

## 250శాతంపెరిగిన తుర్కియే టికెట్ కాన్సిలేషన్లు



**న్యూఢిల్లీ, మే 14:** ఆపరేషన్ సింధూర్ సమయంలో పాకిస్థాన్‌కు మద్దతిచ్చిన తుర్కియే అజర్‌బైజాన్‌లపై మనదేశంలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతోంది. ఈ క్రమంలో మన ట్రావెల్ ఏజెన్సీలు కూడా రెండుదేశాలకు ఆన్‌లైన్ బుకింగ్‌లు నిలిపి వేసాయి. దీనితో కొత్త బుకింగ్‌లు 60శాతం పడిపోయాయని, కాన్సిలేషన్లు 250శాతానికి పెరిగినట్లు ట్రావెల్‌ఏజెన్సీ మేక్‌మైట్రిప్‌ప్రకటించింది. తుర్కియే, అజర్‌బైజాన్‌లకు బాయ్‌కాట్ నినాదం ప్రభావం గత వారంరోజులుగాస్పష్టంగా కనిపిస్తోంది. ఈ రెండుదేశాలకు బుకింగ్‌లు 60శాతం తగ్గిపోయాయి. గత ఏడాదితోపోలిస్తే రద్దుచేసుకుంటున్న వారి సంఖ్యే 250శాతానికి పెరిగింది. మన దేశానికి సంఘీభావంతోపాటు మన సాయుధ బలగాలపై గౌరవంతో పర్యాటకుల నిర్ణయాన్ని మేమూ గౌరవిస్తున్నామనిమేక్‌మైట్రిప్ వెల్లడించింది. అత్యవసర ప్రయాణాలను మాత్రమే సూచిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే బుకింగ్‌చేసుకున్నవాటిని రద్దుచేసుకోవద్దని సూచిస్తున్నా పర్యాటకులు మాత్రం ఆ రెండుదేశాలకు వెళ్లేందుకు ఇష్టపడటంలేదు.

## సింధునదీజలాల నిలిపివేత నిర్ణయం పునఃసమీక్షించండి

### కేంద్ర జలశక్తిశాఖకు పాక్ జలవనరుల శాఖ లేఖలు



**ఇస్లామాబాద్, మే 14:**సింధజలాల ఒప్పందం నిలిపివేత నిర్ణయాన్ని పునఃసమీక్షించాలని పాకిస్థాన్ జలవనరులశాఖ భారత జలశకినత మంత్రిత్వశాఖకు లేఖరాసింది. ఈ నిలిపివేత నిర్ణయంపై చర్చించేందుకు పాక్ సిద్ధంగా ఉందని వెల్లడించింది.ప్రోటోకాల్‌లో భాగంగా ఈ అంశాన్ని విదేశీ వ్యవ హారాల మంత్రిత్వశాఖకు పంపించినట్లు తెలుస్తోంది. అయితే రక్తం, నీరు రెండూ కలిసి ప్రవహించలేవంటూ ఈ విషయంలో వెనక్కి తగ్గేదిలేదని ప్రధానిమోడీ ఇప్పటికే స్పష్టంచేసారు.పాక్‌తో చర్చలంటూ జరిగితే ఉగ్రవాదం, పాక్ ఆక్రమిత కశ్మీర్‌పైనే ఉంటాయని వెల్లడించారు. పహల్గాం దాడి అనంతరం సింధూ జలాల ఒప్పందంనుంచి వైదొలుగుతున్నట్లు భారత్‌ప్రకటించింది. సిందూ, దాని ఉపనదుల జలాలనుపంచుకోడానికి ప్రపంచ బ్యాంకుమధ్యవర్తిత్వంలో భారత్ పాకిస్థాన్‌మధ్య ఒప్పందం 1960లో కుదిరింది. ఈ ఒప్పందంపై అప్పటి ప్రధాని నెహ్రూ, పాకిస్తాన్ అధ్యక్షుడు ఆయూబ్‌ఖాన్‌లు సంతకాలుచేసారు. ఈ డీల్‌ప్రకారం సింధు, ఉపనదుల్లో తూర్పున పారే రావి, బియాస్, సట్లెజ్‌నదులపై భారత్‌కు హక్కులు లభించాయి. సింధునదితోపాటు దాని పశ్చిమ ఉపనదులైన జీలం, చీనాబ్‌లపై పాకిస్థాన్‌కు హక్కులు వచ్చాయి. ఉగ్రదాడి తర్వాత పాక్‌కు బుద్ధిచెప్పేందుకు సింధునదీజలాల ఒప్పందాన్ని రద్దుచేసుకుంటున్నట్లు భారత్‌ప్రకటించడంతో ముందు తీవ్రస్థాయిలో భీరాలు పలికిన పాకిస్తాన్ ఇపుడు సంధిబేరానికి వచ్చింది.

## చీటింగ్ కేసులో శ్రవణ్‌రావును కస్టడీ కోరనున్న సిసిఎస్ పోలీసులు

**హైదరాబాద్, మే 14, ప్రభాతవార్త:** ఆరుకోట్ల రూపాయల చీటింగ్ కేసులో అరెస్టయిన ఫోన్ ట్యాపింగ్ కేసు నిందితుడు మీడియా అధినేత శ్రవణ్ రావును మరి ంతగా విచారించేందుకు వారం రోజుల పాటు కస్టడీకి కోరాలని సిసిఎస్ అధికారులు నిర్ణయించినట్లు తెలిసింది. ఆకర్ష్ కృష్ణ అనే వ్యాపారిని 6.29 కోట్ల రూపా యలను శ్రవణ్‌రావు మోసం చేసినట్లు అందిన ఫిర్యాదుపై సిసిఎస్ పోలీసులు శ్రవణ్‌రావు సహా ఆయన భార్య స్వాతిరావు, సన్నిహితులు ఉమామహేశ్వర రెడ్డి, వేదమూర్తిలపై గత నెల 25వ తేదీన బిఎన్‌ఎస్‌లోని 316 (5), 318(4)తో పాటు రెడ్‌విత్ 3 (5 ) సెక్షన్ల కింద కేసులు నమోదు చేయడం తెలిసిందే. ఈ కేసు లో శ్రవణ్‌రావును మంగళవారం సాయంత్రం విచారణకు పిలిచిన సిసిఎస్ పోలీసులు నాలుగు గంటలకు పైగా విచారించి అనంతరం అరెస్టు చేయడం విదితమే. రాత్రి వేళ శ్రవణ్‌రావును నాంపల్లి మెజిస్ట్రేట్ ఇంటి వద్ద హాజరుపరిచి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు చంచల్‌గూడ జైలుకు రిమాండుకు తరలించారు. కాగా ఈ కేసులో మరింతగా విచారించేందుకు శ్రవణ్‌రావును వారం రోజుల కస్టడీ ఇవ్వాలని సిసిఎస్ పోలీసులు ఒకటి రెండు రోజుల్లో నాంపల్లి కోర్టులో పిటిషన్ దాఖలు చేయనున్నట్లు సమాచారం.

## కూలీగా మారిన విహెచ్ హనుమంతరావు!

**హైదరాబాద్,మే 14,ప్రభాతవార్త:** నల్గొండ జిల్లా శాలిగౌరారం మండలం వల్లాల గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో నిర్మిస్తున్న స్వాతంత్రోద్యమకారుల స్మారక స్థూప నిర్మాణానికి బుధవారం హనుమంతరావు రాళ్ళు ఎత్తి కూలీ పనిచేశారు. కంకర సిమెంట్‌ను నెత్తిపై మోస్తూ కూలీలతో కలిసి పని చేశారు. 1947లో స్వాతంత్ర వచ్చిన అనంతరం శాలిగౌరారం మండలం వల్లాల గ్రామంలో జాతీయ జెండా ఎత్తినందుకు నాటి నవాబు సర్కార్ కాల్చిచంపింది. 1948లో కొంతమంది విద్యార్థులు జాతీయ జెండాను ఎగరవేసి ఆగ్రహంకు గురైనారు. జెండా ఎత్తిన కారణంగా అప్పటి నవాబ్ ప్రైవేట్ సైన్యమైన రజాకారులు జెండా ఎగరవేసిన వారిని ప్రభుత్వ పాఠశాలలో కాల్చి చంపారు. వారి జ్ఞాపకార్థం విహెచ్ హనుమంతరావు ఈ చరిత్రను తెలుసుకొని వారి స్మారకార్థం స్థూపం నిర్మించాలని ఆయన కోరుతున్నారు. గత మూడు సంవత్సరాలుగా ఆగస్టు 15వ తేదీన వల్లాల ప్రభుత్వ పాఠశాలకు వచ్చి వారికి నివాళులు అర్పిస్తున్నారు. గత సంవత్సరం మృతి చెందిన వారి జ్ఞాపకార్థం నిర్మిస్తానని ఆయన ప్రకటించారు. రాబోయే తరాలకు వారి త్యాగాన్ని తెలియజేసేలా చేస్తానని తన సొంత డబ్బులతో స్థూపాన్ని నిర్మించడానికి పూనుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంఏ బాసిత్ కాంగ్రెస్ సందేశ్ గ్రామ సర్పంచ్ ఇంతియాజ్ ఎగ్ సర్పంచ్ అశోక్ రెడ్డి శంభుల శ్రీకాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు

## కొత్త పార్టీ పెట్టాలనే యోచనలో కవిత!

### బిజెపితో బిఆర్ఎస్ చేస్తున్న నాటకాలు జీర్ణించుకోలేకపోతున్నారు

### టిపిసిసి మీడియా అండ్ కమ్యూనికేషన్స్ ఛైర్మన్ సామా రామ్మోహన్ రెడ్డి

**హైదరాబాద్, మే 14,ప్రభాతవార్త :** బిజెపితో బిఆర్ఎస్ చేస్తున్న నాటకాలను కవిత జీర్ణించుకోలేక పోతోందని తను జైలుకు పంపిన పార్టీతో కలిసి పనిచేయడం ఆమె వ్యతిరేకిస్తున్నారని టిపిసిసి మీడియా అండ్ కమ్యూనికేషన్స్ ఛైర్మన్ సామా రామ్మోహన్ రెడ్డి అన్నారు. బుధవారం గాంధీభవన్ ప్రెస్ మీట్ ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకురాలు కల్వకుంట్ల కవిత కొత్త రాజకీయ పార్టీ పెట్టాలనే యోచనలో ఉన్నారని ఆమె నిర్ణయాన్ని కాంగ్రెస్ పార్టీ స్వాగతిస్తోందని చెప్పారు. టిఆర్ఎస్ హయాంలో మహిళలకు,బిసి లకు అన్యాయం జరిగిందని కవిత ఒప్పుకున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. గత పది సంవత్సరాల్లో సామాజిక తెలంగాణ నిర్మించలేకపోయామని ప్రతి వేదిక నుంచి తన తండ్రి పాలనపై ఆమె తన అసంతృప్తిని బాహాటంగానే బయట పెట్టుకున్నారని అన్నారు. కెసిఆర్ పాలనలో భూస్వాములకే రైతుబంధు వచ్చిందన్న వ్యాఖ్యలైనా, బిసిలకు అన్యాయం జరిగిందన్న వ్యవహారమైన, మహిళలకి రాజకీయాల్లో సమాన అవకాశాలు రాలేదన్న కవిత వ్యాఖ్యలను స్వాగతిస్తున్నా మని తెలిపారు. కెసిఆర్ నియంత పోకడలను కవిత ఫాలో కావద్దు అలా ఫాలో అయితే కవిత పెట్టబోయే పార్టీ నీ తెలంగాణ ప్రజలు సమాధి చేస్తారని సామ రాంమోహన్‌రెడ్డి సలహా ఇచ్చారు. తానుపెట్టబోయే పార్టీని భ్రూణ హత్య కాకుండా చూసుకునే బాధ్యత కవితదే అని హెచ్చరించారు.సొంత పార్టీ మీద సొంత కుటుంబం మీద తోడబుట్టిన సోదరుడి మీద కన్న తండ్రి మీద కవిత అసంతృప్తితో రగిలిపోతుందని ఆయన వివరించారు. బిజెపి సంగతి చూస్తా అని పిడికిలి ఎత్తి శపథం చేసిన కవిత నోరును బిఆర్ఎస్ నొక్కుతోందని రామ్మోహన్‌రెడ్డి హెచ్చరించారు. టిఆర్ఎస్ కు వేల కోట్ల ఆస్తులు ఉన్నాయి, ఆస్తుల్లో కేటీఆర్ కి వాటా ఇచ్చారు తప్ప కవిత పిల్లలను పట్టించుకోలేదని సామా విమర్శించారు. టిఆర్ఎస్ లోని పురుషాధిత్యాన్ని తట్టుకోలేకపోతున్నారుఅందుకే తన సొంత మనుషులే నన్ను అనుగదొకుతున్నారని చిట్ చాట్ లో చెప్పారని రామ్మోహన్ బాష్యం చెప్పారు. మా ప్రభుత్వం మీద బురద చల్లితే మిమ్మల్ని ఆ దేవుడే చూసుకుంటాడు అందుకే ఇప్పుడు మీ పార్టీ ముక్క చెక్కలయ్యే పరిస్థితి తలెత్తింది. కవిత కొత్త పార్టీ పెట్టబోతున్నది అని మాకు విశ్వసనీయ సమాచారం ఉంది కాదని కవితనే చెప్పమనండి అని ఆయన సవాల్ చేశారు.

# బ్లాక్ బస్టర్ హిట్ 'విశ్వంభర' 'రామ రామ' సాంగ్



మెగాస్టార్ చిరంజీవి అత్యంత ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్ విశ్వంభర. వశిష్ట దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీ ఈ సంవత్సరం మోస్ట్ ఎవైటెడ్ పాన్ ఇండియా చిత్రాలలో ఒకటి. ఇప్పటికే పోస్టర్లు, టీజర్ భారీ అంచనాలను నెలకొల్పాయి. ప్రతిష్ఠాత్మక యువి క్రియేషన్స్ బ్యానర్‌పై విక్రమ్, వంశీ, ప్రమోద్ నిర్మించిన ఈ చిత్రం మ్యూజిక్ ప్రమోషన్స్‌ని ఫస్ట్ సింగిల్ రామ రామ సాంగ్‌తో ప్రారంభించారు. జై శ్రీ రామ్ అనే నినాదాన్ని ప్రతిధ్వనించే ఈ సాంగ్ మ్యూజిక్ సెన్సేషన్‌గా మారి చార్ట్ బస్టర్‌గా నిలిచింది. తాజాగా ఈ సాంగ్ యూట్యూబ్ మ్యూజిక్‌లో 25+ మిలియన్ వ్యూస్ క్రాస్ చేసి అన్ని మ్యూజిక్ చార్ట్స్‌లో టాప్ ట్రెండింగ్ కొనసాగుతూ బ్లాక్ బస్టర్ హిట్‌గా అదరగొడుతోంది. సాంగ్ రిలీజ్ అయిన ప్పటి నుంచి ఇప్పటివరకు టాప్ ట్రెండింగ్లో కొనసాగుతుంది. సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఎక్కడ చూసినా ఈ పాటే వినిపిస్తోంది. మెగాస్టార్ చిరంజీవి డాన్స్ గ్రేస్, ఆస్కార్ విన్నర్ కీరవాణి మ్యూజిక్, రామజోగయ్య శాస్త్రి. అద్భుతమైన లిరిక్స్, మ్యాసీవ్ సెట్.. ఆడియన్స్‌ని మెస్మరైజ్ చేశాయి. రానున్న రోజుల్లో ఈ సాంగ్ మరింత పెద్ద హిట్ కాబోతోంది.

తన బ్లాక్‌బస్టర్ ఫస్ట్ మూవీ బింబిసారతో చెరగని ముద్ర వేసిన దర్శకుడు వశిష్ట, విశ్వంభరని అత్యద్భుతంగా చిత్రీకరిస్తున్నారు. దీనిని ఆయన తన అత్యంత ప్రతిష్ఠాత్మకమైన డ్రీం ప్రాజెక్ట్‌గా తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రంలో త్రిష కృష్ణన్, ఆశికా రంగనాథ్ హీరోయిన్స్‌గా నటిస్తుండగా, కునాల్ కపూర్ కీలక పాత్ర పోషించారు. మ్యూజికల్ జీనియస్ ఆస్కార్ విన్నర్ ఎంఎం కీరవాణి ఈ సినిమాకి మ్యూజిక్ అందిస్తున్నారు. ఈ చిత్రానికి డీవోపీ చోటా కె నాయుడు, ప్రొడక్షన్ డిజైనర్ ఎఎస్ ప్రకాష్. తారాగణం: మెగాస్టార్ చిరంజీవి, త్రిష కృష్ణన్, ఆశికా రంగనాథ్, కునాల్ కపూర్

సాంకేతిక బృందం: రచన, దర్శకత్వం: వశిష్ట
నిర్మాతలు: విక్రమ్, వంశీ, ప్రమోద్
బ్యానర్: యువి క్రియేషన్స్
సంగీతం: ఎంఎం కీరవాణి
డిఓపి: చోటా కె నాయుడు
ప్రొడక్షన్ డిజైనర్: ఎఎస్ ప్రకాష్
పీఆర్వో: వంశీ శేఖర్
మార్కెటింగ్: ఫస్ట్ షో.

# జులై 4న 'కింగ్‌డమ్'

విజయ్ దేవరకొండ కథానాయకుడిగా గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం కింగ్‌డమ్. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగ వంశీ, సాయి సౌజన్య ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్నారు. మే 30వ తేదీన విడుదల కావాల్సిన ఈ చిత్రం, జులై 4వ తేదీకి వాయిదా పడింది. ఈ విషయాన్ని చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. మే 30న విడుదల కావాల్సిన మా కింగ్‌డమ్ సినిమాను జులై 4న విడుదల చేయనున్నామని తెలియజేస్తున్నాము. ముందుగా అనుకున్నట్టుగా మే 30వ తేదీకే సినిమాని తీసుకురావాలని ఎంతగానో ప్రయత్నించాము. కానీ, మన దేశంలో ఇటీవల ఊహించని సంఘటనలు జరిగాయి. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రమోషన్‌లు, వేడుకలు నిర్వహించడం కష్టతరమని భావించి, ఈ నిర్ణయం తీసుకోవడం జరిగింది. ఈ నిర్ణయం కింగ్‌డమ్‌కి మరిన్ని మెరుగులు దిద్దీ, సాధ్యమైనంత ఉత్తమంగా మలచడానికి సహాయపడుతుందని మేము విశ్వసిస్తున్నాము. కాస్త ఆలస్యంగా వచ్చినా కింగ్‌డమ్ చిత్రం అభిమానులు, ప్రేక్షకుల అంచనాలకు ఏమాత్రం తగ్గకుండా ఉంటుంది. జులై 4న థియేటర్లలో అడుగుపెడుతున్న ఈ చిత్రం, మీ ప్రేమను పొందుతుందని ఆశిస్తున్నాము. విడుదల తేదీ మార్పు విషయంలో తమ మద్దతు ఇచ్చినందుకు దిల్ రాజుకి, నితిన్‌కి మా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాము అని చిత్ర బృందం పేర్కొంది. విజయ్ దేవరకొండ తన కెరీర్‌లో అత్యంత శక్తివంతమైన పాత్రను పోషిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాల్లో ఆయన కనిపించిన తీరు అందరినీ కట్టిపడేసింది. విజయ్‌కి జోడిగా భాగ్యశ్రీ బోర్సే ఒక ఆసక్తికరమైన పాత్రలో కనిపించనున్నారు. ప్రతిభగల దర్శకుడు గౌతమ్ తిన్ననూరి కింగ్‌డమ్ కోసం అద్భుతమైన కథను ఎంచుకున్నారు. ఆ అద్భుతమైన కథను, అంతే అద్భుతంగా తెరపైకి తీసుకొచ్చి ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని అందించడానికి సిద్ధమవుతున్నారు. జోమోన్ టి. జాన్ మరియు గిరీష్ గంగాధరన్ ఛాయాగ్రహణం అత్యున్నత స్థాయిలో ఉండనుంది. జాతీయ అవార్డు గ్రహీత నవీన్ నూలి ఈ చిత్ర ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అనిరుధ్ రవిచందర్ సంగీతం సమకూరుస్తున్నారు. ఇప్పటికే విడుదలైన మొదటి గీతం హృదయం లోపల ప్రేక్షకుల హృదయాలను గెలుచుకొని సినిమాపై అంచనాలను మరింత పెంచింది. శ్రీకరా స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగ వంశీ, సాయి సౌజన్య ప్రతిష్ఠాత్మకంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. బాక్సాఫీస్‌ను రూల్ చేయ డానికి, జులై 4న కింగ్‌డమ్ థియేటర్లలో అడుగుపెట్టనుంది.



చిత్రం: కింగ్‌డమ్, విడుదల తేదీ: జులై 4, 2025, తారాగణం: విజయ్ దేవరకొండ, భాగ్యశ్రీ బోర్సే, దర్శకత్వం: గౌతమ్ తిన్ననూరి నిర్మాతలు: నాగవంశీ, సాయి సౌజన్య, సంగీతం: అనిరుధ్ రవిచందర్, ఛాయాగ్రహణం: జోమోన్ టి. జాన్ ఐఎస్‌సి, గిరీష్ గంగాధరన్ ఐఎస్‌సి, కూర్పు: నవీన్ నూలి నిర్మాణ సంస్థలు:సితారఎంటర్ టైన్ మెంట్స్.

# 23న 'కేసరి ఛాప్టర్2'

బాలీవుడ్ స్టార్ అక్షయ్ కుమార్ నటించిన హిస్టారికల్ కోర్ట్ డ్రామా కేసరి ఛాప్టర్ 2: ది అన్‌టోల్డ్ స్టోరీ ఆఫ్ జలియన్‌వాలా బాగ్ థియేటర్లలో విజయవంతంగా ప్రదర్శించబడుతూ, ఇప్పటికే సుమారు రూ.100 కోట్ల వసూళ్లు సాధించింది. కరణ్ సింగ్ త్యాగి దర్శకత్వం వహించిన ఈ చిత్రం ప్రస్తుతం నాలుగో వారంలోనూ హౌస్ ఫుల్‌గా రన్ అవుతుంది. అక్షయ్ కుమార్, ఆర్.మాధవన్, అనన్య పాండే నటించిన ప్రధాన పాత్రలు, ఎమోషన్స్‌తో నిండిన కోర్ట్ సన్నివేశాల్లో వారి నటనకు విశేష ప్రశంసలు లభించాయి. ఇప్పుడు ఈచిత్రం తెలుగులోకి డబ్ చేయబడి మే 23న విడుదల కాబోతుంది. ఇప్పటికే హిందీ వర్షన్‌కు విమర్శకుల ప్రశంసలతో పాటు భారీ వసూళ్లు రావడంతో, తెలుగు ప్రేక్షకుల్లో ఈ సినిమాపై భారీ ఆసక్తి నెలకొంది. సురేష్ ప్రొడక్షన్స్ లాంటి ప్రముఖ సంస్థ ఈ సినిమాను విడుదల చేయడం వల్ల, తెలుగు రాష్ట్రాల్లో దీన్ని భారీస్థాయిలో విడుదల చేయనున్నారు. కేసరి ఛాప్టర్ 2తో ప్రేక్షకులకు పవర్ ఫుల్ సినిమాటిక్ ఎక్స్పీరియన్స్ అందించబోతుంది. ధర్మా ప్రొడక్షన్స్, లియో మీడియా కలెక్టివ్, కేప్ ఆఫ్ గుడ్ ఫిలిమ్స్ సంయుక్తంగా నిర్మించిన ఈచిత్రం, జలియన్‌వాలా బాగ్ హత్యాకాండ తర్వాత బ్రిటిష్ రాజ్‌కు వ్యతిరేకంగా పోరాటం చేసిన ప్రముఖ న్యాయ వాది సి శంకరన్ నాయర్ జీవితం ఆధారంగా రూపొందించబడింది.



# 'వర్జిన్ బాయ్స్' టీజర్



వర్జిన్ బాయ్స్ టీజర్ రిలీజై, యూత్‌లో హాట్ టాపిక్‌గా మారింది! గీతానంద్, మిత్రా శర్మ హీరో హీరోయిన్లుగా, శ్రీహాన్, రోనీత్, జెన్నిఫర్, అన్షుల, సుజిత్ కుమార్, అభిలాష్‌లతో రూపొందిన ఈ రొమాంటిక్ కామెడీ, దయానంద్ దర్శకత్వంలో రాజా దరపునేని నిర్మాణంలో రాజ్‌గురు ఫిల్మ్స్ బ్యానర్‌పై తెరకెక్కింది. తాజాగా విడుదల అయిన టీజర్‌లో యూత్‌ఫుల్ వైబ్స్, కలర్‌ఫుల్ విజువల్స్ ఆకట్టుకుంటున్నాయి.స్మరణ్ సాయి సంగీతం టీజర్‌కు జోష్‌ని జోడించగా, వెంకట ప్రసాద్ సినిమాటోగ్రఫీ ఫ్రెష్‌గా, ఎనర్జిటిక్‌గా కనిపిస్తోంది. మార్తాండ్ కె వెంకటేష్ ఎడిటింగ్ టీజర్‌ను క్రిస్పీగా మలిచింది. టీజర్‌లో గీతానంద్, మిత్రా శర్మ కెమిస్ట్రీ ఆకట్టుకుంటుంది. హాస్యం, రొమాన్స్, ఎమోషన్స్‌తో కూడిన ఈ కథ, ఆధునిక రిలేషన్‌షిప్స్‌ను తమదైన స్టైల్‌లో చూపించనుందని తెలుస్తోంది. బిగ్ బాస్ ఫేమ్ శ్రీహాన్ క్యారెక్టర్ కామెడీ టైమింగ్ కి రెస్పాన్స్ బాగా వస్తుంది. చిత్రంలో శ్రీహాన్ నుండి మరింత కామెడీని ఆశించవచ్చు అనిపిస్తుంది. టీజర్‌లోని డైలాగ్స్, సీన్స్ ఫన్ ఎలిమెంట్స్‌ను హైలైట్ చేస్తున్నాయి. ఈ సమ్మర్‌లో వర్జిన్ బాయ్స్ యూత్‌ను థియేటర్స్‌కు రప్పించే ఫుల్ ఎంటర్‌టైనర్‌గా కనిపిస్తోంది. ఈ సినిమా కచ్చితంగా యూత్‌కి బాగా కనెక్ట్ అవుతుందని మేకర్స్ భావిస్తున్నారు. నిర్మాత రాజా దరపునేని మాట్లాడుతూ, ఈ సినిమా యూత్‌కి కనెక్ట్ అయ్యేలా తీర్చిదిద్దాం అన్నారు. గతంలో ఎన్నో మంచి యూత్ ఫుల్ ఎంటర్టైనర్ లు వచ్చాయి. కానీ వాటిని మైమరిపించేలా ఈ సినిమా ఉంటుందని అన్నారు. రొటీన్‌కి భిన్నంగా ఈ సినిమా ఉంటుందన్నారు.ఈ సినిమా కచ్చితంగా యూత్‌కి బాగా కనెక్ట్ అవుతుందని భావిస్తున్నాను అన్నారు.




# 'కరాటే కిడ్:లెజెండ్స్' హిందీ డబ్‌లో తండ్రి కొడుకుల మ్యాజిక్

సోనీ పిక్చర్స్ ఎంటర్టైన్మెంట్ ఇండియా నుంచి భారీ అప్‌డేట్.హాలీవుడ్ క్లాసిక్ సిరీస్‌కు చెందిన కరాటే కిడ్: లెజెండ్స్ ఇప్పుడు కొత్త ఒరవడిలో భారత్‌లో ప్రేక్షకులను పలకరించబోతోంది. ఈసారి ప్రత్యేకత ఏంటంటే, బాలీవుడ్ స్టార్ అజయ్ దేవగన్ తన కుమారుడు యుగ్ దేవగన్తో కలిసి ఈ చిత్ర హిందీ డబ్బింగ్ వెర్షన్‌లో పని చేశారు. అజయ్ దేవగన్ జాకీ చాన్ పోషించిన మిస్టర్ హాన్ పాత్రకు గొంతు అందించగా, యుగ్ బెన్ వాంగ్ పోషించిన కథానాయకుడు లీ ఫాంగ్ పాత్రను డబ్బింగ్ చేశాడు. ఇది అజయ్ దేవగన్‌కి తొలిసారి ఇంటర్నేషనల్ సినిమా డబ్బింగ్ చేయడం కాగా, యుగ్‌కి ఇది డబ్బింగ్‌లో గ్రాండ్ ఎంట్రీ. సినిమా కథలో గురువుశిష్య బంధం ప్రధానాంశంగా ఉండగా, ఆ బంధం వెనుక నిజ జీవిత తండ్రీకొడుకుల కెమిస్ట్రీ ఉండడం ఈ వెర్షన్‌కు స్పెషల్ టచ్ ఇస్తోంది. యువతకు స్ఫూర్తినిచ్చే ఈ యాక్షన్ డ్రామా న్యూయార్క్ నేపథ్యంలో సాగుతుంది. షిఫ్ట్ అయిన స్కూల్, కొత్త స్నేహాలు, గొడవలు, శిక్షణతో కూడిన ప్రయాణం ఇవన్నీ కలిపి లీ ఫాంగ్ జీవితంలో కొత్త మలుపులు తిప్పుతాయి. కరాటే కిడ్: లెజెండ్స్ సినిమా మే 30, 2025 న దేశవ్యాప్తంగా ఇంగ్లీష్, హిందీ, తెలుగు, తమిళ భాషల్లో థియేటర్లలో విడుదల కానుంది. ఇండియన్ డబ్బింగ్ వెర్షన్‌కి అజయ్‌యుగ్ కలయిక మరింత బలాన్ని అందించనుంది.



# డిఫరెంట్ కాన్సెప్ట్‌లో 'లెవన్'

నవీన్ చంద్ర హీరోగా నటించిన బైలింగ్వల్ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ ఎలెవెన్. సుందర్ సి వద్ద కలకలప్పు 2, వంద రాజవతాన్ వరువేన్, యాక్షన్ వంటి చిత్రాలకు అసోసియేట్ డైరెక్టర్‌గా పనిచేసిన లోకేశ్ అజ్ల్స్ దర్శకత్వం వహించారు. ఎఆర్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై అజ్మల్ ఖాన్, రేయా హరి నిర్మించిన లెవెన్, విమర్శకుల ప్రశంసలు పొందిన సిలా నేరంగలిల్ సిలా మణిధర్గల్, సెంబి చిత్రాల విజయం తర్వాత వారి మూడవ వెంచర్. ఈ చిత్రం ఈ వేసవిలో అద్భుతమైన సినిమా ఎక్స్ పీరియన్స్‌ని అందించడానికి సిద్ధంగా ఉంది. ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ కంటెంట్ సినిమాపై హ్యూజ్ బజ్ క్రియేట్ చేశాయి. రుచిర ఎంటర్టైన్మెంట్స్ ప్రముఖ డిస్ట్రిబ్యూటర్ ఎన్ సుధాకర్ రెడ్డి ఈ సినిమా థియేట్రికల్ హక్కులను సొంతం చేసుకున్నారు. మే 16న ఈ చిత్రం ప్రపంచ వ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరో నవీన్ చంద్ర విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.

**సినిమాకి లెవన్ అనే టైటిల్ పెట్టడానికి కారణం?**

అది కథ నుంచి వచ్చిన టైటిల్. సినిమా చూసినప్పుడు మీకే తెలుస్తుంది. సినిమాపై చాలా కాన్ఫిడెంట్‌గా వున్నాను. తమిళ్‌లో షోస్ జరిగాయి. యునానిమస్ గా సూపర్ రెస్పాన్స్. చూసిన ఆడియన్స్ స్టాండింగ్ ఒవేషన్ ఇచ్చారు. మేము అనుకున్న ట్విస్ట్ లు, టర్న్స్, అడ్రినల్ రష్ మూమెంట్స్ ప్రేక్షకులని ఎక్సయిట్ చేశాయి. ఆడియన్స్ రెస్పాన్స్ పట్ల చాలా హ్యాపీగా వున్నాను. చాలా సంవత్సరాల తర్వాత మంచి థియేట్రికల్ ఎక్స్ పీరియన్స్ దొరికింది.

**ఈ థ్రిల్లర్ ఎంత కొత్తగా వుండబోతోంది?**

ఇప్పటివరకూ ఏ థ్రిల్లర్‌లో రాని ఒక డిఫరెంట్ ఎమోషనల్ కాన్సెప్ట్ ఈ సినిమాలో వుంది. ఆడియన్స్‌కి చాలా కొత్త ఎక్స్ పీరియన్స్ ఇస్తుంది. ఇందులో ప్రతిదానికి లాజిక్ వుంటుంది. ఇందులో ట్విస్ట్‌లని ముందుగా డీకోడ్ చేయడం కష్టం.

**స్క్రీన్ ప్లే ఎలా వుండబోతోంది? డైరెక్టర్ లోకేష్ గురించి?**

మంచి రైటింగ్ బలం వున్న సినిమా. తెలుగు తమిళ్ రెండు భాషల్లో సినిమా చేయడానికి దాదాపు ఆరు నెలలు సినిమా ప్రీప్రొడక్షన్ చేశాం. లెవన్ చూస్తున్నపుడు విజువల్‌గా ఓ కమర్షియల్ సినిమా చూస్తున్న ఫీలింగ్ కలిగిస్తుంది. నిర్మాతలు చాలా ఖర్చు చేశారు. ఇది డైరెక్టర్, టెక్నికల్ ఫిల్మ్. లోకేష్ సినిమాని చాలా అద్భుతంగా తీశాడు. సినిమా చూసిన వారంతా డైరెక్టర్ గురించి, రైటింగ్ గురించి ప్రత్యేకంగా చెబుతున్నారు. ఈ సినిమా ఫస్ట్ హాఫ్ ఎంగేజ్ చేస్తుంది. సెకండ్ హాఫ్ మైండ్ బ్లోయింగ్‌గా వుంటుంది.

**రెండు భాషల్లో సినిమాని షూట్ చేశారా?**

అవును. రెండు భాషల్లో డిఫరెంట్ డిఫరెంట్ షాట్స్ తీశాం. స్క్రిప్ట్‌ని కూడా ట్రాన్స్ లేట్ చేయలేదు. తెలుగు నుంచి ప్రత్యేకంగా రైటర్‌తో రాయించి తెలుగు స్క్రిప్ట్‌తో షూట్ చేశాం. నిర్మాతలు ఎక్కడ రాజీపడకుండా ఖర్చు చేశారు. తెలుగు తమిళ్ బైలింగ్వల్ చేయడం ఇప్పుడు అడ్వాంటేజ్‌గానే భావిస్తున్నాను. ఈ సినిమాకి తమిళ్ డబ్బింగ్ నేనే చెప్పాను. నాకు ఎనిమిది భాషలు వచ్చు. నా అన్ని సినిమాలకి ప్రతి భాషలో నేనే డబ్బింగ్ చెప్పడానికి ప్రాధాన్యత ఇస్తుంటాను.

**ఒక క్యారెక్టర్ నుంచి బయటికి రావడానికి ఎలాంటి ప్రాక్టీస్ చేస్తుంటారు?**

బిగినింగ్ డేస్ లో ఒక క్యారెక్టర్ నుంచి బయటపడటం నాకూ కొంచెం సమస్యగానే వుండేది. షూటింగ్ తర్వాత కూడా ఆ క్యారెక్టర్ ని ఇంటి వరకూ తీసుకెళ్ళే వాడిని. అయితే పెళ్లి తర్వాత దాన్ని మెల్లమెల్లగా మానుకున్నాను. షూటింగ్ లో ఉన్నంత వరకే డైరెక్టర్ డిజైన్ చేసే క్యారెక్టర్ లో వుంటాను. తర్వాత స్విచ్ ఆఫ్ చేసేస్తాను.

**మాస్ జాతరలో మీ క్యారెక్టర్ ఎలా వుండబోతోంది?**

రవితేజకి విలన్‌గా చేయాలని సితార నుంచి కాల్ వచ్చింది. రిఫర్ చేసింది కూడా రవితేజ గారే. అరవింద్ సమేతలో నా క్యారెక్టర్ ని ఎలా యూనిక్‌గా ఫీల్ అయ్యారో.. అంతే యూనిక్‌గా ఈ సినిమాలో వుంటుంది. నా లుక్ కూడా చాలా వెరైటీగా వుంటుంది. నా ప్రతి సినిమాకి పది మంది ఆడియన్స్ అయినా పెరగాలనే ఉద్దేశంతో అన్ని రకాల పాత్రలు చేస్తున్నాను.

**కరుణ్ కుమార్‌తో చేస్తున్న సినిమా గురించి?**

హానీ అనే సినిమా జరుగుతోంది. చాలా డార్క్ సినిమా అది. చాలా కొత్తగా వుంటుంది. అలాగే కాళీ అనే యాక్షన్ సినిమా చేస్తున్నాను.



# 'బద్మాషులు' నుంచి సాంగ్ రిలీజ్

మహేష్ చింతల, విద్యాసాగర్ కారంపురి, మురళీధర్ గౌడ్ లీడ్ రోల్స్‌లో శంకర్ చేగూరి దర్శకత్వంలో రూపొందున్న హిలేరియస్ ఎంటర్టైనర్ 'బద్మాషులు'. తార స్టోరీ టెల్లర్స్ బ్యానర్ పై బి. బాలకృష్ణ, రామ శంకర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇప్పటికే రిలీజైన ఈ సినిమా ఫస్ట్ లుక్ మరియు టీజర్‌కు మంచి రెస్పాన్స్ వచ్చింది. తాజాగా ఈ సినిమా నుండి లోకం మారిందా సాంగ్‌ను హీరో నవీన్ చంద్ర విడుదల చేశారు. ఈ సందర్భంగా నవీన్ చంద్ర మాట్లాడుతూ, 'బద్మాషులు' టీజర్ హిలెరియస్‌గా ఉంది, లోకం మారిందా సాంగ్ కూడా చాలా క్యాచీగా ఉంది, తేజ కూనూరు సంగీతం అందించారు, దివ్య మాలిక పాడిన ఈ సాంగ్‌కు మంచి రెస్పాన్స్ వస్తుందని అనుకుంటున్నాను, జూన్ 6న విడుదల కాబోతున్న బద్మాషులు మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నాను అన్నారు. మహేష్ చింతల, విద్యాసాగర్ కారంపురి, మురళీధర్ గౌడ్ పాత్రలు విశేషంగా, రూరల్ రూటెడ్ కథ, కథనం, కామెడీ చాలా ఆర్గానిక్‌గా ఈ చిత్రాల్లో ఉండబోతున్నాయి, డైరెక్టర్ శంకర్ చేగూరి టేకింగ్ చాలా రిఫ్రెషింగ్‌గా అన్ని వర్గాల ఆడియన్స్‌కు కనెక్ట్ అయ్యే విధంగా ఉండబోతోంది. జూన్ 6న ఈ చిత్రాన్ని దీపా ఆర్ట్స్ థియేటర్స్‌లో విడుదల చెయ్యబోతోంది. ఇది మన ఊరి కథ అనే విధంగా ఈ చిత్రంలో పాత్రలు చాలా సహజంగా ఉంటాయి, డైరెక్టర్ శంకర్ చేగూరి వంద శాతం జనాలను రెండు గంటలు నవ్వించాలి అనే ఉద్దేశ్యంతో 'బద్మాషులు' చిత్రాన్ని తెరకెక్కించారు.





# అమ్మాయిలు పరిశోధన కెరియర్‌గా..

**అమ్మాయిలు వైద్య పరిశోధనల్ని కెరియర్‌గా ఎంపికచేసుకోవడం, అందులో రాణించడం అరుదు. అలాంటిది గత రెండు దశాబ్దాలుగా పరిశోధనలకే అంకితమయ్యారు డా.ఎం. శశికళ. ఎఐజిలో రిసర్చ్, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రాన్సలేషనల్ సైన్స్ (ఎఎఎస్) ఫెలోషిప్ వరించింది.**

సిసిఎస్ 1848లో అప్పటినుంచి ఏటా ప్రపంచవ్యాప్తంగా కొందరు ఈ ఫెలోషిప్ అందిస్తున్నారు. సైన్స్‌లో ఇది ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ గుర్తింపు. మనదేశం నుంచి నేను పదహారో వ్యక్తిని. 2024 భారత్ నుంచి మెడికల్ సెక్షన్లో (ఎన్) ఈ అవార్డుకి ఎంపికయ్యా. గ్యాస్ట్రో ఎంటరాలజీ, మధుమేహ ట్రాన్సలేషనల్ రిసర్చ్‌లో నా కృషికి ఈ గుర్తింపు రావడం ఆనందంగా ఉంది. ట్రాన్సలేషనల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ అంటే.. పరిశోధనలు రోగుల చికిత్సకు ఉపయోగపడటాన్నే ట్రాన్సలేషనల్ రిసర్చ్ అంటారు. జీర్ణాశయం, కాలేయం, క్లోమ సంబంధిత వ్యాధులపై పరిశోధనలు చేసి, వాటి ఆధారంగా రోగులకు చికిత్స అందించడమే. ఆంధ్రా యూనివర్సిటీ నుంచి బయోకెమిస్ట్రీ పిజి చేసి, గోల్డ్‌మెడల్ సాధించా, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్‌లో అధ్యయనాల మీద శిక్షణ తీసుకున్నా. తరవాత విజయ డయాగ్నస్టిక్స్‌లో పనిచేస్తూ పిజి పూర్తయిన 14 ఏళ్లకి ఉస్మానియా నుంచి పిహెచ్‌డి చేశా. నాన్న లేటు విశ్వనాథరావు కెజిహెచ్‌లో పీడియాట్రిక్ సర్జన్. మా వారు చంద్రశేఖర్ ఈఎన్‌టి సర్జన్. ఈ నేపథ్యం వల్ల నాకూ పరిశోధనలపట్ల ఆసక్తి ఏర్పడింది. 2007లో నాగేశ్వరరెడ్డిగారు ఎఐజిలో సైన్స్ సెంటర్‌ను ఏర్పాటుచేయాలన్న ఆలోచనలో క్లినికల్, పరిశోధన జ్ఞానం రెండూ తెలిసి ఉన్న బేసిక్ సైంటిస్ట్ కావాలని నన్ను ఎంపిక చేసుకున్నారు. అదే నా కెరియర్‌లో కీలక మలుపు. వైద్యులకి పరిశోధనలూ తెలిసి ఉంటే రోగి సమస్యపట్ల స్పష్టత ఉంటుందన్న లక్ష్యంతో ఈ కేంద్రాన్ని ప్రారంభించారు.

ఎఐజిలో కాలేయం, క్లోమం (పాంక్రియాస్), గుండె.. ఇలా అన్ని విభాగాల్లోనూ పరిశోధనలు జరుగుతున్నాయి. వాటన్నింటినీ కోఆర్డినేట్ చేస్తూ టైప్-3 సి(క్లోమగ్రంథి సంబంధింత మధుమేహం), టైప్-2 డయాబిటిస్ మూలకారణాల్ని పరిశోధిస్తున్నా. క్లోమగ్రంథి గ్లూకోజ్ స్థాయుల్ని స్థిరంగా ఉంచడంతోపాటు జీర్ణక్రియలోనూ కీలకపాత్ర వహిస్తుంది. అయితే క్లోమగ్రంథిలో వచ్చే వ్యాధి (పాంక్రియాటైటిస్) వల్ల ఇన్సులిన్‌ను స్రవించే బీటా-ఐలెట్స్ కణాల పనితీరు తగ్గుతుంది. తద్వారా వచ్చే వ్యాధిని టైప్-3సి డయాబిటిస్ అంటారు. మన దగ్గర చిన్న వయసువాళ్లలోనే ఇది కనిపిస్తోంది. టైప్-2 గురించి చాలా పరిశోధనలు జరిగినా దీని గురించి పెద్దగా అవగాహన లేదు. టైప్-3సి గురించి చాలా పరిశోధనలు జరిగినా దీని గురించి పెద్దగా అవగాహన లేదు. టైప్-3సి డయాబిటిస్‌కి కూడా టైప్-1, 2 లక్షణాలే ఉంటాయి కాబట్టి గుర్తించడమూ కష్టమే. అలాగే మనదేశంలో నలభై ఏళ్లలోపే టైప్-2 డయాబిటిస్ బారినపడుతున్నారు. పాశ్చాత్యుల్లో డయాబిటిస్, ఫ్యాటీ లివర్ వంటివి ఆల్కహాలిక్స్, ఊబకాయుల్లోనే ఎక్కువ. మనదగ్గర ఆల్కహాల్ తీసుకోని వాళ్లలోనూ సన్నగా ఉన్నవాళ్లలోనూ వస్తోంది. దీనికి కారణాల్ని అన్వేషిస్తున్నాం. దీర్ఘకాలంలో డయాబిటిస్ రాకుండా నియంత్రించాలన్నదే మా లక్ష్యం. ఇందుకోసం మూలకణాలమీదా పరిశోధనలు జరుగుతున్నాయి. ప్రతిష్ఠాత్మకమైన ఈ ప్రాజెక్టుకు 'డిబిటి-వెల్‌కమ్ ట్రస్ట్ ఇండియా అలయెన్స్' సంస్థ క్లినికల్ అండ్ పబ్లిక్ హెల్త్ రిసర్చ్ సెంటర్ ద్వారా గ్రాంట్ జారీచేసింది. ఈ మధ్య ఎవరిని చూసినా గ్యాస్ అంటున్నారు.. ఆహారం, శరీరతత్వం, జీవనశైలి.. ఇవన్నీ జీర్ణప్రక్రియను ప్రభావితం చేస్తాయి. గత కొన్నేళ్లుగా మారిన జీవనశైలితో జీవగడియారం అస్తవ్యస్తమైంది. దాంతో గ్యాస్ సమస్యలు పెరిగాయి. పొట్టలోని బ్యాక్టీరియా మార్పు కూడా కారణమే అని మా పరిశీలనల్లో తేలింది.

గ్యాస్ట్రిక్ సమస్యలు మెనోపాజ్‌లో ఎందుకు ఎక్కువ... నెలసరిలోనూ గర్భిణిగా ఉన్నప్పుడు మెనోపాజ్ సమయాల్లోనూ హార్మోన్ల హెచ్చుతగ్గులు జీర్ణవ్యవస్థను ప్రభావితం చేయడంతో గ్యాస్ ఎక్కువగా ఉత్పత్తి అవుతుంది. ఒత్తిడి, ఆందోళనలు, భావోద్వేగాలు, ఆరోగ్యంపట్ల శ్రద్ధ తీసుకోకపోవడం, శారీరక శ్రమ లేకపోవడం, నిద్రలేమి వంటి వాటితో జీర్ణ సమస్యలు వస్తున్నాయి. వీటికి పూర్వం వాము, జీలకర్ర.. వంటివి వాడేవారు. వాటిల్లోని ఎంజైమ్‌లు జీర్ణక్రియను ప్రభావితం చేస్తాయి. ముఖ్యంగా మెనోపాజ్‌లో వ్యాయామం, యోగా చేయడం, ఇంటిపని చేసుకోవడం, ఎక్కువగా స్నేహితులతో కలవడం.. వంటివి చేస్తే ఒత్తిడి, ఆందోళనలు తగ్గి జీర్ణక్రియ తద్వారా జీవక్రియ బాగుంటుంది. అమ్మాయిలకి ఓపిక ఎక్కువ. కాబట్టి వీళ్ల పరిశోధనల్లోకి రావాలి. ఇంజినీరింగ్, మెడిసిన్ మాత్రమే కాకుండా కోర్ సైన్స్ సబ్జెక్టుల్ని ఎంచుకుని ఆయా రంగాల్లో నిబద్ధత కలిగిన సైంటిస్ట్‌లుగా పరిశోధనలు చేస్తే మానవాళికీ ప్రయోజనం, మనకీ సంతృప్తి. □

# దాంపత్యానికి నాలుగు సూత్రాలు



ఎన్నో ఆశలతో వివాహ బంధంలోకి అడుగులు పెడుతుంటాం. ఈ ప్రేమ దీర్ఘకాలం కొనసాగాలంటే దంపతులు ఇరువురు ప్రేమలో పడాలంటున్నాయి అధ్యయనాలు. ప్రేమ ఉంది కదా అందుకే కదా కలిసి ఉంటున్నాం అనుకుంటున్నారా? కానీ బంధం బలపడాలంటే ఇద్దరి మధ్యా ప్రేమ మూలస్తంభంగా ఉండాలంటున్నారు నిపుణులు.

**కమ్యూనికేషన్..** భార్యాభర్తల మధ్య కమ్యూనికేషన్ ప్రాణ వాయువు లాంటిది. ఇది లేకుండా జీవించడం ఎంత కష్టమో, దాంపత్యంలో భావ వ్యక్తీకరణ లేకపోతే బంధం బీటలు వారుతుంది. ఇలా కాకూడదంటే భాగస్వామి ఆలోచనలనూ, భావాలనూ స్వేచ్ఛగా వ్యక్తరిచేలా మనం మసలుకోవాలి. మా వారంటే నాకు చాలా ఇష్టం, గౌరవం ఉందంటే సరిపోదు. ఎప్పుడైనా ఆయనతో చెప్పారా! బంధంలో ఏ విషయాన్ని అయినా స్వేచ్ఛగా పంచుకున్నప్పుడు మాత్రమే దాంపత్య జీవితం కలకాలం సాఫీగా సాగుతుంది. అంతేకాదు ఈ రోజు వంట బాగుందనో, లేక ఎందుకు అలసటగా కనిపిస్తున్నావ్ ఏమైంది అనే చిన్న పలకరింపు ఆమెకెంతో ఊరటనిస్తుంది.

**తగ్గిచూడండి..** ఆలుమగలన్నాక చిన్నాచితకా గొడవలు రావడం సహజమే. ఆ సమయంలో ఎవరో ఒకరు మౌనం పాటిస్తే గొడవలు తగ్గుతాయి. అంత మాత్రం చేత మీరు తప్పు చేసినట్లు కాదు. ఇలా చేయడం వల్ల గొడవ తీవ్రత తగ్గుతుంది. దీని వల్ల ఇద్దరి మధ్యా దూరం పెరగుతుంది. కోపం తగ్గాక మీరు ఆవేశంలో ఏం మాట్లాడుతున్నారో తెలియడం లేదు, మాట్లాడే తీరు మార్చుకోమని సున్నితంగా చెప్పాలి. ఈ సూత్రం దంపతులు ఇద్దరికీ వర్తిస్తుంది మరి. రాజీపడటం..

**ఎంత ప్రేమిస్తే ఏం ప్రయోజనం..** రాజీపడే మనస్తత్వం లేకపోతే అదంతా బూడిదలో పోసిన పన్నీరే అవుతుంది. బంధంలో ముందుకు సాగాలంటే సానుభూతి, అవగాహన, క్షమాపణలు చెప్పడం.. అలవరచుకోవాలి. ప్రస్తుత కాలంలో ఎక్కువ యువ జంటలు ఈ కారణాల వల్లే విడాకుల వరకు వెళుతున్నారని అధ్యయనాలు చెబుతున్నాయ. క్షమాపణ లేని చోటప్రేమ నిలవదు అంటున్నారు నిపుణులు.

**సమన్వయం..** దాంపత్యంలో వృత్తి, వ్యక్తిగతి జీవితాన్ని సమనవ్వయం చేసుకోగలిగితేనే మూడుపువ్వులూ ఆరు కాయలుగా కొనసాగుతుంది. ఆఫీసూ, ఇంటి పనులకు పరిమితులు గీసుకోవాలి. ఆఫీసువేళల్లో ఇంటిపనినీ, ఇంటి దగ్గర ఆఫీసు పనులను చేయకూడదు. ఇలా చేయడం వల్ల కుటుంబంతో గడిపే నాణ్యమైన సమయం దెబ్బ తింటుంది. ఈ నాలుగు సూత్రాలను భాగస్వాములు ఇరువురూ అనుసరించినప్పుడు బంధం మరింత బలంగా బలపడుతుంది. ఇక అపార్థాలకు తావుండదు. □

# మగువ పచ్చటి గుత్తుల హారం







నగలపై మక్కువ లేని మగువలుండరంటే అతిశయోక్తి కాదేమో! అందుకే వారి మనసుని పసిగట్టి.. పసిడి మెరుపులకు ముత్యాలు, పచ్చలు, పగడాలు..వంటి నవరత్నాలెన్నో చేర్చి చమక్కుమనిపిస్తుంటారు డిజైనర్లు. అంతేనా, అమ్మ, అమ్మమ్మల తరం నాటి ఆభరణాలకు, అందమైన నగిషీలెన్నో అద్ది ఈ తరం వారిని ఆకట్టుకుంటున్నారు. అలా వచ్చినవే గుత్తుపూసల హారాలు. ఇవి నిన్నటి వరకూ ముత్యాలతో మురిపించాయి. ఇప్పుడు పచ్చలు సెమీ ప్రెషయస్ ఆనిక్స్ స్టోన్‌తో.. సందడి చేస్తున్నాయి. రాణీహారాలు, చోకర్లు, టెంపుల్ డిజైన్ నగల హారాలు.. ఒకటేమిటి అన్నింటి మీదకూ చేరి ధరించినవారికో ప్రత్యేకతనూ తెచ్చిపెడుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా రాచరికానికి గుర్తుగా రాజ్యమేలే పచ్చలు.. ఇప్పుడు రకరకాల ఆకృతుల్లో ఒదిగి పోతున్నాయి. ముఖ్యంగా ముత్యాలను పోలి ఉండేలా చేసిన ఇవి చిన్నచిన్న గుత్తుల్లో ఒదిగిపోయి హుందాగా మెప్పిస్తున్నాయి. పుత్తడి నగిషీల మధ్య కొత్తదనాన్ని చుట్టుకుని అదరహో అనిపిస్తున్నాయి. ముత్యాలతోనూ జతకట్టి సొగసులీనుతున్నాయి. మరింకెందుకాలస్యం రానున్న వేడుకలూ, పండగల్లో చీరకు జతగా ధరించేయండి.











# మష్రూమ్ టోస్ట్



కావలసిన పదార్థాలు : మష్రూమ్స్ (పుట్టగొడుగులు): ఒక కప్పు, బ్రెడ్ స్లైసెస్: నాలుగు, ఉల్లిగడ్డ: ఒకటి, క్యాప్సికమ్: ఒకటి, వెన్న: అర కప్పు, క్రీమ్ చీజ్: అర కప్పు, మిరియాల పొడి: అర టీస్పూన్, ఉప్పు: తగినంత, వెల్లుల్లి రెబ్బలు: నాలుగు.

**తయారీ విధానం :** మష్రూమ్స్‌ను ముక్కలుగా చేసుకోవాలి. స్టవ్‌మీద పాన్‌పెట్టి ఒక టేబుల్ స్పూన్ వెన్న వేసి వేడయ్యాక సన్నగా తరిగిన వెల్లుల్లి, మష్రూమ్ ముక్కలు, క్యాప్సికమ్, ఉల్లిగడ్డ ముక్కలు వేసి వేయించాలి. అన్నీ బాగా వేగాక మిరియాల పొడి, ఉప్పు వేసి మరో రెండు నిమిషాలు వేయించి దించేయాలి. బ్రెడ్ స్లైస్‌పై క్రీమ్ చీజ్ రాసి మష్రూమ్ మిశ్రమం పరిచి పైనుంచి మరో స్లైస్ ఉంచాలి. స్టవ్‌మీద పాన్‌పెట్టి, అప్పటికే తయారు చేసి పెట్టుకున్న బ్రెడ్ స్లైసెస్‌ను రెండువైపులా వెన్న వేసి కాల్చుకుంటే మష్రూమ్ టోస్ట్ రెడీ. □

## చెలి చిట్కా

- బెల్లంతో వేరు శనగపప్పు ఉండలు చేసే అప్పుడు బెల్లంలో కొంచెం పంచదార కలపండి ఇలాచేస్తే శనక్కాయ పప్పు ఉండలు త్వరగా మెత్తబడవు .
- చీమలు అధికంగా వున్నచోట గెమాక్సిన్ పొడరు చల్లండి చీమలు లేకుండా పోతాయి.
- పాలలో పుదినా ఆకులు వేస్తే విరగవు.

□

# అల్పాహారం ఆయువు పట్టు

## వ్యధ



**ఎన్.బి.సుధాకర్‌రెడ్డి**
**సైకాలజిస్టు**



ప్రశ్న: మా అమ్మాయి బి.టెక్ మూడవ సంవత్సరం చదువుతోంది. తొమ్మిదవ తరగతి చదివే రోజుల్లో ఒక్కోరోజు ఉదయం అల్పాహారం (టిఫిన్) మానేసేది. రాను రాను ఆ సమస్య ఎక్కువ అయ్యింది. సన్నగా ఉంటేనే అందంగా ఉంటామన్న ఆలోచనవల్ల అలా ప్రవర్తిస్తోందని ఆమె మాటల్ని బట్టి అనుకున్నాము. ఇంటర్‌కు వచ్చిన తరువాత ఉదయం కేవలం కాఫీతో సరిపెట్టుకోవడం అలవాటు చేసుకున్నది దీనివల్ల ఆమెకు కొన్ని సమస్యలు వచ్చాయి. ఆమె చాల నీరసంగా ఉంటోంది. బాగా బక్క చిక్కపోయింది. రుతుక్రమంలో తేడాలు వచ్చాయి. రెండు, మూడు నెలలకు ఒకసారి బహిష్టు అవుతోంది. జుట్టు ఊడటం ఎక్కువ అయ్యింది. ఇటీవల మహిళా వైద్యురాలి వద్దకు తీసుకెళితే అన్ని పరీక్షలు చేసి రక్తహీనతతో బాధపడుతున్నదని చెప్పారు. ఆమె ఉదయం టిఫిన్ మాననేయడంతో పాటు మిగిలిన రెండు పూటలు కూడా తక్కువగా తింటున్నదని డాక్టరు గ్రహించారు. తాత్కాలికంగా కొన్ని మందులు రాసిచ్చారు. అయితే మూడు పూటలా మంచి ఆహారం తీసుకోవాలని చెప్పారు. యే యే ఆహారం తీసుకోవాలాలో సూచిస్తూ డైట్ చార్ట్ రాసిచ్చారు. అయినా మా అమ్మాయి డాక్టర్ సూచనలు పాటించడంలేదు. బలవంతం చేస్తే నా వల్ల కాదు అంటోంది. ఈ విషయం డాక్టరుకు చెపితే సైకాలజిస్టుకు చూపమన్నారు. మా అమ్మాయి ఈటింగ్ డిజార్డతో బాధపడుతున్నదని చెప్పారు. కౌన్సెలింగ్, సైకోథెరపీ చేయడం ద్వారా ఆమెలో మార్పువస్తుందని చెప్పారు. కాబట్టి ఆమెను ఎలా మార్చాలో చెప్పండి.

– ఒక సోదరి, గుంటూరు.

**జవాబు :** అమ్మా మీ అమ్మాయి సమస్య అర్థం అయింది. డాక్టరు చెప్పినట్టు ఆమె అనోరెక్సియా నెర్వోసా అనే ఈటింగ్ డిజార్డర్‌తో బాధపడుతున్నట్లు భావించాలి. ఈ సమస్య ఉన్నవారు చాలా తక్కువగా తింటుంటారు. ఎత్తుకు తగిన బరువు ఉండరు. జుట్టు, చర్మం పొడిబారుతుంది. జుట్టు రాలడం, శరీర ఉష్ణోగ్రత తగ్గిపోవడం జరుగుతుంది. నిద్రలేమి, అలసట, నీరసం, నిస్సత్తువ ఉంటాయి. అమ్మాయిలలో రుతుక్రమం, సక్రమంగా ఉండదు. ఏకాగ్రత, జ్ఞాపకశక్తి తగ్గుతుంది. వీరిలో ఆందోళన, డిప్రెషన్, ఒత్తిడి లక్షణాలు కనిపిస్తాయి. ఒకసారిగా వారిలో మార్పు తీసుకుని రావాలని బలవంతంగా తినిపిస్తే వాంతులు అయ్యే అవకాశం ఉంది. కాబట్టి సైకాలజిస్టును కలిసి కౌన్సెలింగ్ చేయిస్తే ప్రవర్తనలో మార్పు వస్తుంది. ఆమె ఉదయం అల్పాహారం మానేయడం ప్రారంభించిన తొలి రోజుల్లోనే జాగ్రత్త పడి ఉంటే ఈ సమస్య వచ్చేది కాదు. ఇదిలా ఉండగా ఈ రుగ్మత లేనివారు కూడ కొంతమంది ఏదో కారణం చేత ఉదయం టిఫిన్ మానేస్తు ఉంటారు. అలాంటి వారిలో పని సామర్థ్యం క్షీణిస్తుంది. రోజంతా అలసట ఆవహిస్తుంది. తరచు ఇలా చేయడం వల్ల టైప్-2 డయాబెటిస్, ఊబకాయం వచ్చే అవకాశం ఉందని నిపుణులు అంటున్నారు. అంటే ఉదయం తినకపోవడం వల్ల మధ్యాహ్నం, రాత్రి సమయాలలో ఎక్కువగా తినడం వల్ల జీవరసాయన చర్యల్లో తేడాలు వస్తాయి. దీనివల్ల శారీరక రుగ్మతలు తలెత్తే అవకాశం ఉంది. కాబట్టి బాల్యం నుంచి అల్పాహారం తీసుకోవడం అలవాటు చేయాలి. పిల్లలు అయినా, పెద్దలు అయినా ఆరోగ్యానికి అల్పాహారం తీసుకుంటే ఆరోగ్యం బాగుంటుంది. అల్పాహారంలో మాంసకృతులు, పిండి పదార్థాలు, కొవ్వులు ఉండేలా జాగ్రత్త పడాలి. మామూలుగా తినే ఇడ్లీ, దోశ, పొంగల్, ఉప్మా లాంటి వాటితో పాటు పాలు, పెరుగు, పండు, కూరగాయలు తీసుకోవడం మంచిది దీనివల్ల శరీరం రోజంతా శక్తివంతంగా ఉంటుంది. దీనితో ఉత్సాహం, ఏకాగ్రత, జ్ఞాపకశక్తి చురుగ్గా పనిచేసి సామర్థ్యాన్ని పెంచే అవకాశం ఉంటుంది. □

# కప్ప గంతులు వేయించండి !



**సెలవుల్లో పిల్లల అల్లరిని నియంత్రించడం తల్లిదండ్రులకు కత్తిమీద సామే.** ఒకరికి మించి ఇంట్లో ఉన్నప్పుడు ఆ ఇల్లు కిష్కింద కాండే. ఇలాంటప్పుడు వారి దృష్టిని ఆటలమీదకు మళ్లిస్తే మెదడు, శరీరం చురుగ్గా పనిచేస్తాయి. జ్ఞాపకశక్తీ పెరుగుతుంది. అలాంటిదే ఇది. ఈ ఆట పిల్లల్లో నవ్వుల పువ్వులు పూయిస్తుంది. ఒత్తిడిని దూరం చేస్తుంది. ఈ ఆట ఆడేవారు కింద కప్పల్లా కూర్చుని వాటి మాదిరిగానే గెంతాలి. ఇలా ముందుగా పెట్టుకున్న నిర్ణీత లక్ష్యాన్ని చేరుకోవాలి. ఎవరైతే మొదట దాన్ని పూర్తి చేస్తారో వారే విజేతలు. ఇప్పుడీ ఆట ప్రొగ్రెస్, ఫ్రాగ్ జంప్స్ పేరుతో వాడుకలో ఉంది. □

# పిల్లలకు పాట్‌లక్‌తో..

నిజానికి ఇంట్లో ఎంత చిన్న వేడుక చేసినా పెద్దలకు నచ్చే రుచులనే ఎక్కువగా వండుతాం. కానీ, ఈ వేసవిలో పిల్లలకోసం మాత్రమే పాట్‌లక్ పార్టీ ఏర్పాటు చేయండి. దీన్ని మీ పిల్లలూ, వారి స్నేహితుల తల్లులూ కలిసి నిర్వహించండి. తలా ఒక రకాన్ని విందుకోసం సిద్ధం చేయండి. అయితే, ఒక్క షరతు.. వీటిని తయారు చేసేటప్పుడు మాత్రం బుజ్జాయిలు కచ్చితంగా సాయమందించాలనే నియమం పెట్టండి. అప్పుడు పనిలో ఉండే కష్టం, ఇష్టమైనదాని కోసం శ్రమించే తత్వం వంటివన్నీ అలవడతాయి. ఈ వేడుకను అద్భుతంగా వాళ్లు ఆస్వాదిస్తారు. □

# వద్దంటే డబ్బు !

ఆధ్యాత్మికం

సాయిబాబాను దర్శించిన కళాకారులలో బోడాస్ ఒకరు. బోడాస్ పూర్తి పేరు గణేశ గోవింద బోడాస్. అందరూ ఆయనను గణపత్‌రావ్ బోడాస్ అని పిలిచేవారు. మరాఠీ నాటకరంగంలో కొన్ని సంవత్సరాలపాటు ఒక వెలుగు వెలిగిన వ్యక్తి బోడాస్. ఈయనను గురించి హేమాడ్‌పంత్ 'సాయి సచ్చరిత' 14వ అధ్యాయంలో వ్రాశారు. ఈయన 2 జూలై 1880న షేగాం అనే గ్రామంలో జన్మించాడు. 1965లో మరణించే వరకు నాటకరంగాని సేవించాడు . చిన్నతనములోనే నాటకాల పట్ల, సంగీతము పట్ల ఈయనకు గల అభిరుచి వలన కిర్లోస్కర్ నాటకమండలలో సభ్యత్వము పొందినాడు. ప్రతి చిన్న విషయాన్ని సూక్ష్మంగా పరిశీలించి అవగాహన చేసుకునేవాడు. ఈయన ఏ మహనీయుని దర్శించలేదు. పైగా విమర్శించే వాడు కూడా. కోపర్గాంలో మమలతదారుగా పనిచేస్తున్న బాలా సాహెబ్ మిరీకర్ ఈయన స్నేహితుడు. ఒకసారి బోడాస్ అహ్మద్‌నగర్‌లో మిరీకర్ ఇంట్లో దిగారు. బోడాస్‌కు ఎందుకో దగ్గరలో ఉన్న షిరిడీలోని సాయి బాబాను దర్శించాలనే కోరిక కలిగింది. బోడాస్, బాలా సాహెబ్ మిరీకర్ ఒక సోమవారంనాడు షిరిడీకి వెళ్ళి బాబాను దర్శించుకున్నారు. ఇద్దరూ సాయి బాబాకు సాష్టాంగ నమస్కారాలు చేశారు. ఒక కొబ్బరికాయను సమర్పించారు. సాయిబాబా బోడాస్‌కు తన ఖాళీ చిలుంను పొగాకుతో నింపి ఇవ్వమని ఇచ్చారు. ఇది అరుదైన సంఘటన అని అందరూ చెప్పుకుంటారు.

'ఎట్లా ఉన్నావు' అని బోడస్‌ను అడిగారు సాయి. బోడాస్‌ను దక్షిణ అడిగారు సాయి. బోడాస్ వెంటనే ఒక రూపాయి ఇచ్చాడు. బోడాస్ భోజనానికి వెళ్ళగా అక్కడ ఎవరో 'సాయి నిన్ను దక్షిణ అడిగితే పర్సులోని మొత్తం ఇచ్చి ఉడవలసింది' అన్నాడు. అలా ఇచ్చి ఉంటే ఎంత బాగుండేదో కదా అని తన మనసులో అనుకున్నాడు బోడాస్. ఈ విషయం అంతర్యామి అయిన సాయికి తెలియకుండా ఉంటుందా? వీడ్కోలు సమయంలో సాయి పాదాలకు సమస్కరించాడు బోడాస్. 'వెళ్ళిరండి. దక్షిణ ఇవ్వు' అన్నారు సాయి. వెంటనే తన దగ్గరున్న డబ్బునంతా సాయికి ఇచ్చాడు బోడాస్. 'నీవు నాకు దక్షిణ ఇచ్చావు. నారాయణుడు నిన్ను తగు విధంగా చూస్తా డులే అన్నారుసాయి. బోడాస్ ఇక తన జీవితంలో ఏ మహనీయుని దర్శించలేదు. బోడాస్‌కు ధనం కుప్పలు, తెప్పలుగా వచ్చిపడేది. నేను ఎవరి దగ్గరనుండైనా ఒక రూపాయి తీసుకుంటే దానికి పదిరెట్లు ఇస్తాను అన్న దానికి ఇది ఒక చక్కని ఉదాహరణ. □

**యం.పి.సాయినాథ్**

ఆట

## ఇటాలియన్ ఓపెన్‌లో క్వార్టర్ ఫైనల్‌కు సిన్నర్



**న్యూఢిల్లీ:** మూడు నెలల డోపింగ్ నిషేధం నుండి తిరిగి వచ్చిన తర్వాత అగ్రస్థానంలో ఉన్న జానిక్ సిన్నర్ ఒక పెద్ద పరీక్షలో ఉత్తీర్ణత సాధించాడు, రోమ్‌లో జరిగిన మ్యాచ్‌లో నిష్ణాతుడైన క్లేకోర్ట్ ఆటగాడు ఫ్రాన్సిస్కో సెరుండోలోను 7-6 (2), 6-3 తేడాతో ఓడించి ఇటాలియన్ ఓపెన్ క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నాడు. 18వ ర్యాంక్‌లో ఉన్న సెరుండోలో ఈ సంవత్సరం టూర్‌లో అత్యుత్తమంగా 18 క్లే కోర్టు విజయాలు సాధించాడు. ఇదే సమయంలో మాడ్రిడ్ ఓపెన్ సెమీఫైనల్స్‌కు చేరుకునే ప్రయత్నంలో ఉన్నాడు. అలాగే, రెండు సంవత్సరాల క్రితం వీరిరువురూ చివరిసారిగా ఒకే కోర్టులో మరియు ఒకే రౌండ్‌లో తలపడినప్పుడు సెరుండోలో సిన్నర్‌ను ఓడించాడు. ఇక జనవరిలో ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో తన మూడవ గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను గెలుచుకున్న తర్వాత సిన్నర్‌కు ఇది మొదటి టోర్నమెంట్, మరియు అతను మూడు మ్యాచ్‌లలో ఒక్క సెట్‌ను కూడా కోల్పోలేదు. సిన్నర్ అక్టోబర్ నుండి తన విజయ పరంపరను 24 మ్యాచ్‌లకు విస్తరింప చేశాడు. అతడు తన తదుపరి గేమ్‌లో సెరుండోలోను బ్రేక్ చేసి రెండవ సెట్‌లో 3-1 ఆధిక్యంలోకి వెళ్లి శాశ్వతంగా నియంత్రణ సాధించాడు. తదుపరి మ్యాచ్‌లో సిన్నర్ కొత్తగా టైటిల్ గెలుచుకున్న మాడ్రిడ్ ఛాంపియన్ కాస్పర్ రూడ్ లేదా జౌమ్ మునార్‌తో తలపడనున్నాడు. కాగా 1976లో అడ్రియానో పనాట్టా తర్వాత రోమ్ టైటిల్ గెలుచుకున్న తొలి ఇటాలియన్ వ్యక్తిగా నిలిచేందుకు అతను ప్రయత్నిస్తున్నాడు. ఈ నెల 25న ఫ్రెంచ్ ఓపెన్ ప్రారంభమయ్యే ముందు రోమ్‌లో చివరి పెద్ద వార్మప్ జరుగుతుంది.




# చరిత్ర సృష్టించిన జడేజా

## ఐసిసి ర్యాంకింగ్స్‌లో టాప్ ప్లేస్

**న్యూఢిల్లీ:** టీమిండియా ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా చరిత్ర సృష్టించాడు. ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) టెస్ట్ ఆల్‌రౌండర్ల ర్యాంకింగ్స్‌లో అత్యధిక కాలం టాప్ ర్యాంక్‌లో కొనసాగిన ప్లేయర్‌గా అవతరించాడు. ఐసీసీ బుధవారం విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో జడేజా టాప్ ప్లేస్‌ను నిలిబెట్టుకున్నాడు. ప్రస్తుతం అతడు 400 రేటింగ్ పాయింట్లతో ఉన్నాడు. ఈ ర్యాంకింగ్స్‌లో జడేజా తర్వాతి స్థానాల్లో బంగ్లాదేశ్‌కు చెందిన హసన్ మిరాజ్, దక్షిణాఫ్రికా ప్లేయర్ మార్కో జన్సెన్, ఆస్ట్రేలియాకు చెందిన పాట్ కమిన్స్, బంగ్లాదేశ్ ప్లేయర్ షకీబ్ అల్ హసన్ ఉన్నారు. మెహిది హసన్ ఇటీవల బంగ్లాదేశ్‌తో జరిగిన టెస్టు మ్యాచ్‌లో సెంచరీ సహా 5 వికెట్ల ప్రదర్శన నమోదు చేసి జన్సెన్‌ను కిందికి దించి రెండో స్థానానికి ఎగబాకాడు. మెహిది హసన్‌కు, జడేజాకు మధ్య 73 ర్యాంకింగ్ పాయింట్ల వ్యత్యాసం ఉంది. కాగా 2022 మార్చి 9న వెస్టిండీస్ ఆటగాడు జేసన్ హెల్డర్‌ను గద్దె దించి అగ్రపీఠాన్ని అధిరోహించిన జడ్డూ 1152 రోజుల పాటు (38 నెలలకు పైగా) టాప్ ర్యాంక్డ్ టెస్ట్ ఆల్ రౌండర్‌గా కొనసాగాడు. టెస్టు క్రికెట్ చరిత్రలో దిగ్గజ ఆల్‌రౌండర్లయిన జాక్ కల్లిస్, కపిల్ దేవ్, ఇమ్రాన్ ఖాన్‌కు కూడా ఇంత కాలం ర్యాంకుల్లో అగ్రస్థానంలో కొనసాగడం సాధ్యం కాలేదు. 36 ఏళ్ల జడ్డూ 2022 మార్చి నుండి 23 టెస్టులు ఆడి 36.71 సగటున 1175 పరుగులు చేశాడు. ఇందులో మూడు సెంచరీలు, ఐదు అర్ధ సెంచరీలు ఉన్నాయి. బౌలింగ్‌లో అయితే 22.34 సగటున 91 వికెట్లు పడగొట్టాడు. ఇందులో ఆరు 5 వికెట్ల ప్రదర్శనలు, రెండు 10 వికెట్ల ప్రదర్శనలు ఉన్నాయి.




### ఖేల్ ఇండియాలో ఎపి, టిజిలకు

# పతకాల మోత

### పసిడితో మెరిసిన నిశిక, వర్షిత, సాయి

**న్యూఢిల్లీ:** ఖేలో ఇండియా యూత్‌గేమ్స్‌లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ క్రీడాకారులు పతకాల మోత మోగించారు. నాలుగో రోజు పోటీల్లో ఆంధ్రప్రదేశ్‌కు 7, తెలంగాణకు 3 పతకాలు లభించాయి. గయా(బీహార్) వేదికగా జరుగుతున్న ప్రతిష్టాత్మక ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో తెలంగాణ యువ జిమ్నాస్ట్ నిశిక అగర్వాల్ స్వర్ణ పతకంతో మెరిసింది. మహిళల ఆర్టిస్టిక్ జిమ్నాస్టిక్స్ వ్యక్తిగత ఆల్‌రౌండ్ ఫైనల్లో నిశిక 44.33 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. అద్భుత ప్రదర్శన కనబరుస్తూ నిశిక సత్తాచాటింది. ఇదే విభాగంలో అనౌష్క పాటిల్ (42.06), సారా రవూల్ (41.23) వరుసగా రజత, కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు. అలాగే బాలుర యూత్ 89 కిలోల కేటగిరీలో బరిలోకి దిగిన తెలంగాణ యువ లిఫ్టర్ సాయివర్ధన్ పసిడి పతకంతో మెరిశాడు. స్నాచ్‌లో 120 కిలోలు, క్లీన్ అండ్ జెర్క్‌లో 155 కిలోలతో మొత్తం 275 కిలోలు ఎత్తిన సాయివర్ధన్ అగ్రస్థానంలో నిలిచాడు. ఇదే విభాగంలో చెంచు వెంకటేశ్ (272 కిలోలు, ఆంధ్రప్రదేశ్), రోహన్‌కుమార్ మహతో (266 కిలోలు, జార్ఖండ్) వరుసగా రజత, కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు. అదేవిధంగా బాలికల ఫెన్సింగ్ ఈపీ విభాగంలో హైదరాబాద్ అమ్మాయి అదీబా హురైన్ కాంస్యంతో మెరిసింది. బ్యాడ్మింటన్ డబుల్స్‌లో చరణ్ రామ్, హరికృష్ణ (ఆంధ్రప్రదేశ్) ద్వయం కైవసం చేసుకుంది. వెయిట్‌లిఫ్టింగ్ యూత్ బాలికల 64 కిలోల కేటగిరీలో జి.వర్షిత (శ్రీకాకుళం) 174 కిలోల బరువెత్తి పసిడితో మెరిసింది.

### దాయాది దేశాల రెంటిలోనూ

# డబుల్ ఛాన్స్

## ఐపిఎల్, పిఎస్ఎల్‌లో ఒకే ప్లేయర్లు




**న్యూఢిల్లీ:** వరల్డ్ వైజ్ క్రికెట్ లీగ్‌లు జరుగుతున్నా ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) మాత్రం టాప్‌లో ఉంది. 2008లో స్టార్ట్ అయిన ఐపీఎల్ చూసిన తర్వాతే వివిధ దేశాల్లో కూడా లీగ్‌లు మొదలుపెట్టాయి. పాక్ క్రికెట్ బోర్డు కూడా పాకిస్థాన్ సూపర్ లీగ్ (పిఎస్ఎల్) స్టార్ట్ చేసింది. ముంబయిలో ఉగ్రదాడుల తర్వాత భారత క్రికెటర్లు పీఎస్ఎల్‌లోను, పాక్ ప్లేయర్లు ఐపీఎల్ ఆడే ఛాన్స్ లేదు. మొదటి ఐపీఎల్ సీజన్లో మాత్రమే పాకిస్థాన్ ప్లేయర్లు ఐపీఎల్‌లో పాల్గొన్నారు. అయితే కొందరు విదేశీ, పాక్ ఆటగాళ్లు ఇటు ఐపీఎల్, అటు పీసీఎస్ టోర్నీల్లో ఆడుతున్నారు. ఐపీఎల్‌లో టైటిల్ నెగ్గిడంతో పాటు, అటు పీఎస్ఎల్ లోనూ ఛాంపియన్‌గా నిలిచారు. ఇంగ్లాండ్ ప్లేయర్ ఇయాన్ మోర్గాన్ ఇటు ఐపీఎల్, అటు పీఎస్ఎల్ నెగ్గిన ఆటగాళ్లలో ఒకడు. మోర్గాన్ 2012లో కోల్‌కతా, 2016లో సన్‌రైజర్స్ జట్ల తరఫున ఐపీఎల్‌లో ఛాంపియన్‌గా నిలిచాడు. అలాగే 2017లో పెషావర్ జల్మీ టీమ్ తరఫు పీఎస్ఎల్ ట్రోఫీని కూడా గెలిచాడు. బంగ్లాదేశ్‌కు చెందిన షకీబ్ అల్ హసన్ 2012, 2014లో కేకేఆర్ ఐపీఎల్ ట్రోఫీ గెలవడంలో పాత్ర పోషించాడు. 2017లో పెషావర్ జల్మీ జట్టులో ఉండి పీఎస్ఎల్ టైటిల్ గెలిచాడు. వెస్టిండీస్‌కు చెందిన మిస్టరీ స్పిన్నర్ సునీల్ నరైన్ కూడా ఈ రెండు లీగ్‌ల్లో ఆడాడు. 2012, 2014లో కోల్‌కతా నైట్ రైడర్స్ విజయాల్లో నరైన్ కీ ప్లేయర్ పాత్ర పోషించాడు. అటు 2019లో క్వెట్టా గ్లాడియేటర్స్ తరఫున పీఎస్ఎల్ కప్పు గెలిచాడు. మరో పాపులర్ పవర్ హిట్టర్ ఆండ్రీ రస్సెల్ 2014లో కోల్‌కతా నైట్ రైడర్స్ తరఫున ట్రోఫీ అందుకున్నాడు. 2016, 2018లో ఇస్లామాబాద్ యునైటెడ్ తరఫున రెండు సార్లు పీఎస్ఎల్ గెలిచాడు. పాకిస్థాన్‌కు చెందిన సోహైల్ తన్వీర్ 2008లో రాజస్థాన్ రాయల్స్ తరఫున ట్రోఫీ గెలిచాడు. 2019లో క్వెట్టా గ్లాడియేటర్స్, 2021లో ముల్తాన్ సుల్తాన్స్ తరఫున పీఎస్ఎల్ టైటిల్స్ గెలిచాడు. ఇంకో ప్లేయర్ కమ్రాన్ అక్మల్ 2008లో ఐపీఎల్ విజేత రాజస్థాన్ రాయల్స్ టీమ్‌లో ఆడాడు. 2017లో పెషావర్ జల్మీతో కలిసి పీఎస్ఎల్‌ను కూడా గెలుచుకున్నాడు. ఆస్ట్రేలియా ప్లేయర్ షేన్ వాట్సన్ 2008లో రాజస్థాన్ రాయల్స్, 2018లో చెన్నై సూపర్ కింగ్స్‌తో తరఫున ఐపీఎల్ గెలిచాడు. అలాగే 2016లో ఇస్లామాబాద్ యునైటెడ్ తరఫున, 2019లో క్వెట్టా గ్లాడియేటర్స్ తరఫున పీఎస్ఎల్ టైటిల్ అందుకున్నాడు. వెస్టిండీస్ ప్లేయర్ డ్వేన్ బ్రావో 2018, 2021లో చెన్నై సూపర్ కింగ్స్ ఐపీఎల్ విజయాల్లో కీలక పాత్ర పోషించాడు. 2019లో క్వెట్టా గ్లాడియేటర్స్‌తో కలిసి పీఎస్ఎల్‌లో కూడా విజయం సాధించాడు. షెర్ఫేన్ రూథర్‌ఫోర్డ్ 2020లో ముంబయి ఇండియన్స్, అదే సంవత్సరం కరాచీ కింగ్స్‌తో పీఎస్ఎల్ గెలుచుకున్నాడు. ఆఫ్ఘనిస్థాన్ టాప్ లెగ్ స్పిన్నర్ రషీద్ ఖాన్ 2022లో గుజరాత్ టైటాన్స్ ఐపీఎల్ గెలిచాడు. 2022, 2023లో లాహోర్ కలందర్స్ తరఫున కూడా వరుసగా పీఎస్ఎల్ ట్రోఫీ గెలిచాడు.



### దక్షిణాసియా ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్:

# నేపాల్‌ను ఓడించి సెమీస్‌కు భారత్

**న్యూఢిల్లీ:** దక్షిణాసియా అండర్-19 పురుషుల ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో భారత్ సెమీ ఫైనల్‌కు చేరింది. అరుణాచల్‌ప్రదేశ్‌లో జరిగిన ఈ టోర్నీలో నేపాల్‌ను ఓడించిన భారత్ సెమీస్‌కు అర్హత సాధించింది. గోల్డెన్ జూబ్లీ స్టేడియంలో నేపాల్‌పై 4-0 తేడాతో విజయం సాధించిన తర్వాత భారత్ దక్షిణాసియా అండర్-19 పురుషుల ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో గ్రూప్ బి లో అగ్రస్థానంలో నిలిచింది. రోహెన్ సింగ్ చాపమాయుమ్ (28వ నిముషంలో, 76వ నిముషంలో) రెండు గోల్స్ చేయగా, స్థానిక యూత్ ప్లేయర్ ఒమాంగ్ దోదుమ్ (29వ నిముషంలో), డానీ మెయిటీ (84వ నిముషంలో) ఒక్కొక్క గోల్ చేశారు. ఈ విజయంతో భారత్ రెండు మ్యాచ్‌ల్లో ఆరు పాయింట్లతో గ్రూప్ బి ని ముగించింది, 12 గోల్స్ తేడాతో నేపాల్ రెండు మ్యాచ్‌ల్లో మూడు పాయింట్లతో రెండవ స్థానంలో నిలిచింది. ఆతిథ్య జట్టు ఈ నెల 16వ తేదీ శుక్రవారం రాత్రి 7.30 గంటలకు గ్రూప్ ఎ రన్నరప్ అయిన మాల్దీవులతో తలపడనుంది, అదే రోజు జరిగే సెమీఫైనల్లో గ్రూప్ ఎ విజేత బంగ్లాదేశ్ మధ్యాహ్నం 3.30 గంటలకు నేపాల్‌తో తలపడనుంది. రెండు జట్లు ఇప్పటికే చివరి నాలుగు స్థానాలకు చేరుకోగా, మ్యాచ్ చాలా ఉత్సాహంగా ప్రారంభమైంది. గ్రూప్‌లో అగ్రస్థానంలో నిలిచే విషయంలో ఇరు జట్లు రాజీ పడటానికి ఇష్టపడ లేదు. అయితే, స్కోరింగ్ ప్రారంభమైన తర్వాత, భారత్ తన స్థానాన్ని పదిలం చేసుకుంది. రెండు గోల్స్ తేడాతో, నేపాల్‌పై ఆధిపత్యం చెలాయించడం ప్రారంభించడంతో, భారత్ ఆత్మవిశ్వాసాన్ని పెంచుకుంది. బ్లూ కోల్ట్స్ జట్టు 15 నిమిషాల కంటే తక్కువ సమయం ఉండగానే మూడో గోల్ చేసింది. భారత కెప్టెన్ సింగమాయుమ్ షమీ చేసిన లాంగ్ రేంజ్ ప్రయత్నాన్ని పరియార్ అడ్డుకున్నాడు. అయితే, మునుపటి ఆటలో శ్రీలంకపై హ్యాట్రిక్ సాధించిన ప్లేమేకర్, తెలివిగా రీబౌండ్‌ను సాధించాడు.

# వాణిజ్యం

# తొలిరోజే ట్రంప్ టవర్స్ రికార్డ్ సేల్స్..

**ముంబై, మే 14:** గురుగ్రామ్‌లో నిర్మించిన ఈ ట్రంప్ టవర్స్ లోని 298 లగ్జరీ ఫ్లాట్లన్నీ ఓపెనింగ్ రోజే అమ్ముడయ్యాయి. వీటి ధర రూ.8 కోట్ల నుంచి రూ.15 కోట్ల మధ్య ఉంటుంది. ఆశ్చర్యకరమైన మరో విషయం ఏంటి అంటే మొదటిరోజే రూ.3250 కోట్ల విలువైన బుకింగ్‌లు జరిగాయి. ఇందులో రూ.125 కోట్ల విలువైన నాలుగు పెంట్‌హౌస్‌లు కూడా ఉన్నాయి. గురుగ్రామ్‌లోని ట్రంప్ టవర్స్‌ని స్మార్ట్‌వరల్డ్ డెవలపర్స్ అండ్ ట్రిబెకా డెవలపర్స్ ఉమ్మడిగా అభివృద్ధి చేశాయి. ఈ ప్రాజెక్ట్ గురుగ్రామ్‌లో ట్రంప్ బ్రాండ్ రెండవ హౌస్ కంస్ట్రక్షన్ ప్రాజెక్ట్. న్యూయార్క్ తర్వాత రెండు ట్రంప్ టవర్లు ఉన్న మొదటి నగరం గురుగ్రామ్. సెక్టార్69లో ఉన్న ట్రంప్ టవర్స్‌లో రెండు 51 అంతస్తుల టవర్లు ఉన్నాయి, వీటిలో 298 లగ్జరీ ఇళ్ళు ఉండగా, ఒక్క ఇంటి ధర రూ.8 కోట్ల నుంచి రూ.15 కోట్ల మధ్య ఉంటుంది. స్మార్ట్ వరల్డ్ డెవలపర్స్ వ్యవస్థాపకుడు పంకజ్ బన్సల్ మాట్లాడుతూ, ట్రంప్ టవర్స్‌కి లభించినఅద్భుతమైన స్పందన దేశంలో ప్రపంచ స్థాయి లైఫ్ స్టయిల్ని స్పష్టంగా చూపిస్తుంది. ఈ ప్రాజెక్టును పూర్తి చేయడం మాకు గర్వకారణం ఇంకా మా కస్టమర్ల నమ్మకాన్ని సంపాదించినందుకు వారికి ధన్యవాదాలు అని అన్నారు. గురుగ్రామ్‌లోని ట్రంప్ టవర్స్ ప్రాజెక్ట్ సేల్స్ చదరపు అడుగుకు రూ.27,000 చొప్పున మొదలవుతుంది. ఇందులో ప్రత్యేక ఇంటీరియర్ డిజైన్, ప్రైవేట్ లిఫ్ట్, విలాసవంతమైన క్లబ్‌హౌస్ ఇంకా ప్రత్యేకమైన సేవలు ఉన్నాయి. ట్రంప్ అనే బ్రాండ్ పేరుకు ప్రత్యేక ఆకర్షణ ఉంది. అందుకే ప్రపంచం నలుమూలల నుండి కొనుగోలుదారులు దీనిని ప్రత్యేకమైన ఇంకా కాస్ట్లీ ప్రాజెక్టుగా భావిస్తారు. ఈ ప్రాజెక్టులో మొత్తం అమ్మకానికి ఉన్న విస్తీర్ణం 12 లక్షల చదరపు అడుగులు. దీనికిపూర్తిగా గాజు గోడలు, కొన్ని ఇళ్లలో రెట్టింపు ఎత్తు గల లివింగ్ రూములు, పెద్ద పెద్ద పైకప్పువరకుకిటికీలు, ప్రైవేట్ లిఫ్ట్, ఆరావళి కొండల దృశ్యాలతో కూడిన షేర్డ్ టెర్రస్ ఉంటాయి.




## రాణించిన ఐటి, మెటల్ స్టాక్స్

**ముంబై, మే 14:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు మోస్తరు లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాల నేపథ్యంలో స్వల్ప లాభాలకు పరిమితమయ్యాయి. ముఖ్యంగా మెటల్, రియల్ ఎస్టేట్, టెక్నాలజీ స్టాక్స్ రాణించాయి. భారత్ పాక్ మధ్య ఉద్రిక్తతలు చల్లారడం, రిటైల్ ద్రవ్యోల్బణం తగ్గడంతో ఆర్‌బీఐ వడ్డీ రేట్లను తగ్గించొచ్చన్న అంచనాలు ఇందుకు కారణం. నిఫ్టీ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు ఒక శాతానికి పైగా లాభపడ్డాయి. సెన్సెక్స్ ఉదయం 81,278.49 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమై రోజంతా ఒడుదొడుకులు ఎదుర్కొన్న సూచీ.. 80,910.03 81,691.87 మధ్య కదలాడింది. చివరికి 182.34 పాయింట్ల లాభంతో 81,330.56 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 88.55 పాయింట్ల లాభంతో 24,666.90 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 85.27గా ఉంది. టాటా స్టీల్, ఎటర్నల్, టెక్ మహీంద్రా, మారుతీ సుజుకీ, మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు ప్రధానంగా లాభ పడ్డాయి. ఏషియన్ పెయింట్స్, టాటా మోటార్స్, కోటక్ మహీంద్రా బ్యాంక్, ఎన్టీపీసీ, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ షేర్లు నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 65.77 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 3237 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.



## మరికొందరు మైక్రోసాఫ్ట్ ఉద్యోగులపై వేటు




**న్యూఢిల్లీ, మే 14:** ప్రముఖ టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ ఉద్యోగులకు షాక్ ఇచ్చింది. వేలాది మందిని తొలగించేందుకు సిద్ధమైంది. ప్రపంచవ్యాప్తంగా తమ సిబ్బందిలో మూడు శాతం మందిని తొలగిస్తున్నట్లు ప్రకటించింది. సంస్థ నిర్ణయంతో దాదాపు 6 వేల మందిపై లేఆఫ్స్ ప్రభావం పడనున్నట్లు తెలుస్తోంది. 2023లో 10 వేలమందికి ఉద్వాసన పలికిన అనంతరం ఇదే రెండో అతిపెద్ద తొలగింపు కానుంది. గతేడాది జూన్ నాటికి ఆ సంస్థలో 2.28 లక్షల మంది సిబ్బంది ఉన్నారు. మైక్రోసాఫ్ట్ తాజా నిర్ణయంతో మధ్యస్థ స్థాయి మేనేజ్‌మెంట్ ఉద్యోగులపై అధిక ప్రభావం పడనుందని అంచనా. ఈ ఏడాది ప్రారంభంలో కూడా పనితీరు ఆధారంగా పలువురు ఉద్యోగులను సంస్థ తొలగించిన విషయం తెలిసిందే. తాజా లేఆఫ్‌లకు ఉద్యోగుల పనితీరుకు సంబంధం లేదని సంస్థ స్పష్టం చేసింది.

## రూ.2.75 లక్షల కోట్ల ఆర్‌బిఐ డివిడెండ్!

**ముంబై, మే 14:** రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా ప్రభుత్వానికి డివిడెండ్ చెల్లించిన తర్వాత భారత బ్యాంకింగ్ వ్యవస్థలో మిగులు లిక్విడిటీ గణనీయంగా పెరుగుతుందని కొన్ని సంస్థల నివేదికలు చెబుతున్నాయి. బ్యాంకింగ్ వ్యవస్థలో ఈ లిక్విడిటీ రూ.6 లక్షల కోట్లకు చేరుకుంటుందని అంచనా వేస్తున్నాయి. ఈ యేడాది ఆర్‌బిఐ ప్రభుత్వానికి ఇచ్చే డివిడెండ్లు రూ.2.25 లక్షల కోట్ల నుంచి రూ.2.75 లక్షల కోట్ల మధ్య ఉంటుందని తెలుస్తుంది. ఇది కేంద్ర ఆర్థిక వనరులను గణనీయంగా పెంచుతుందని నివేదికలు అంచనా వేస్తున్నాయి. అధిక రాబడినిచ్చే అమెరికా ప్రభుత్వ సెక్యూరిటీల్లో ఇన్వెస్ట్ చేసిన విదేశీ మారక నిల్వలపై రాబడులు మరింత పెరిగే అవకాశం ఉంది. రూపాయి అస్థిరతను నిర్వహించడానికి డాలర్లను విక్రయించడం ద్వారా వచ్చిన లాభాలతో ఆర్‌బిఐ ఆదాయం సమకూర్చుకుంటోంది. 2025 ఆర్థిక సంవత్సరంలో దేశీయ బాండ్ మార్కెట్ ద్వారా ఆర్‌బిఐ రూ.1.95 లక్షల కోట్లు రాబడిని అందుకున్నట్లు అంచనా. ఆర్‌బిఐ క్రియాశీల డాలర్ అమ్మకాలు కూడా ఈ ఆదాయానికి తోడయ్యాయి. 2025 ఆర్థిక సంవత్సరం ఫిబ్రవరి నాటికి స్థూల డాలర్ అమ్మకాలు 371.6 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. 2024 సెప్టెంబర్‌లో విదేశీ మారక నిల్వలు 704 బిలియన్ డాలర్లకు చేరాయి.తర్వాత కాలంలో ఆర్‌బిఐ 125 బిలియన్ డాలర్లకుపైగా విక్రయించినట్లు తెలుస్తుంది. మే చివరి నాటికి బ్యాంకింగ్ వ్యవస్థ లిక్విడిటీ మరింత మెరుగుపడి రూ.5.5-6 లక్షల కోట్లకు చేరుకుంటుందని బార్క్లేస్ అంచనా వేసింది. స్టాండింగ్ డిపాజిట్ ఫెసిలిటీ రేటు 6శాతం నుంచి 5.75శాతానికి దగ్గరగా వెయిటెడ్ యావరేజ్ కాల్ రేట్ తగ్గే అవకాశం ఉందని తెలిపింది. ఈ పరిస్థితులు ఆర్‌బిఐ రాబోయే ద్రవ్య విధాన వైఖరిని ప్రభావితం చేయనుందని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. మరోవైపు జూన్‌లో జరగనున్న ఆర్‌బిఐ మానిటరీ పాలసీ కమిటీ సమావేశంలో కీలక వడ్డీరేట్లను యథాతథంగా ఉంచే అవకాశం ఉందని కొందరు అంచనా వేస్తున్నారు.




## లాభాల్లో హీరో మోటోకార్ప్ భేష్

**ముంబై, మే 14:** ద్విచక్ర వాహన రంగ దిగ్గజం హీరో మోటోకార్ప్ గతేడాది చివరి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. జనవరి-మార్చి నాలుగో త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ నికర లాభం 24 శాతం జంప్‌చేసి రూ.1,169 కోట్లను తాకింది. వ్యయ నియంత్రణ, విభిన్న ప్రొడక్టులు, మెరుగుపడిన మార్జిన్లు ప్రభావం చూపాయి. అంతకుముందు యేడాది ఇదే కాలంలో రూ.943 కోట్లు మాత్రమే ఆర్జించింది. కంపెనీ బోర్డు వాటా దారులకు రూ.2 ముఖ విలువ గల ఒక్కో షేరుకి రూ.65 చొప్పున తుది డివిడెంట్ ప్రకటించింది. మొత్తం ఆదాయం రూ.9,794 కోట్ల నుంచి రూ.10,244 కోట్లకు బలపడింది. అయితే మోటార్ సైకిళ్ల, స్కూటర్ల మొత్తం విక్రయాలు 13.92 లక్షల నుంచి 13.81 లక్షల యూనిట్లకు స్వల్పంగా తగ్గాయి. మార్చితో ముగిసిన పూర్తి యేడాదికి హీరో మోటో నికర లాభం 17శాతం పెరిగి రూ.4,376 కోట్లకు చేరింది. 2023-24లో రూ.3,742 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం కూడా రూ.38,643 కోట్ల నుంచి రూ.41,967 కోట్లకు చేరింది. ఈ కాలంలో 5శాతం అధికంగా 58.99 లక్షల వాహనాలు విక్రయించింది. 2023-24లో 56.21 లక్షల వాహన అమ్మకాలు నమోదయ్యాయి. గతేడాది కంపెనీ చరిత్రలోనే అత్యధిక ఆదాయం, నికర లాభాలు ఆర్జించినట్లు హీరో మోటో ఈడీ, తాత్కాలిక సిఇఒ విక్రమ్ ఎస్ కస్బేకర్ పేర్కొన్నారు.




వరుసగా 24వ యేడాదిలోనూ మార్కెట్ లీడర్‌గా కంపెనీ కొనసాగినట్లు తెలియచేశారు. కీలకమైన 125 సిసి విభాగంలో కన్సాలిడేషన్ జరుగుతున్నదని, భవిష్యత్‌లో ఈవీల విడుదల ద్వారా వృద్ధి కొనసాగనున్నట్లు వివరించారు.

## 'మారుతి'పై రూ.1.15లక్షల డిస్కౌంట్ ఆఫర్

**ముంబై. మే 14:** ప్రముఖ కార్ల తయారీ సంస్థ మారుతీ సుజుకీ నెక్సా మోడళ్లపై పెద్దఎత్తున డిస్కౌంట్ అందిస్తోంది. బాలెనో, జిమ్నీ, ఫ్రాంక్స్‌తో పాటు పలు వాహనాలపై రాయితీ ఇస్తోంది. కొన్ని వాహనాలపై ఏకంగా రూ.1.15 లక్షల వరకు తగ్గింపు అందిస్తోంది. వివిధ మోడళ్లపై నగదు తగ్గింపుతో పాటు ఎక్స్ఛేంజ్ బోనస్, కార్పొరేట్ ప్రయోజనాలు కూడా అందిస్తోంది. మారుతీ తీసుకొచ్చిన ప్రీమియం హ్యాచ్‌బ్యాక్‌పై రూ.45 వేల వరకు డిస్కౌంట్ ఇస్తోంది. మేన్యువల్ ట్రాన్స్‌మిషన్ వెర్షన్‌పై రూ.25 వేలు, ఏజీఎస్ వెర్షన్‌పై రూ.30 వేలు వరకు తగ్గింపు ఇస్తోంది. ఎక్స్ఛేంజ్ బోనస్ రూ.15వేలు అందిస్తోంది. దీంతోపాటు ఆప్షనల్ రీగల్ ఎడిషన్ యాక్సెసరీస్ కిట్‌పై కూడా తగ్గింపు ఇస్తున్నట్లు ప్రకటించింది. పెట్రోల్ డీజిల్ ఇంజిన్ వేరియంట్లపై రూ.10 వేల వరకు తగ్గింపు అందిస్తోంది. సిగ్మా వేరియంట్లపై ఈ రాయితీ లభించదు. ఫ్రాంక్స్ ఏజీఎస్ వెర్షన్లపై రూ.15 వేల తగ్గింపుతో పాటు రూ.15 వేల వరకు అదనపు ఎక్స్ఛేంజ్ బోనస్ పొందొచ్చు. ఇక టర్బో పెట్రోల్ వేరియంట్‌లో వచ్చిన ఫ్రాంక్స్‌పై కూడా రూ.30 వేల వరకు తగ్గింపు, రూ.43 వేల విలువైన వెలాసిటీ యాక్సెసరీస్ కిట్, రూ.15వేల ఎక్స్ఛేంజ్ బోనస్ ఇస్తోంది.



Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.